# రామాయణ కల్పవృక్షము - ఒక విమర్శన

## [బాలకాండ]

7
T
294.592209
DUR

— శ్రీ దుర్గానంద్

### 1

వాల్మీకి క్రౌంచద్వంద్వ వియోగోత్థ శోకపరితప్తుడు. ఇది ఆతని వైయక్తిక భావన. భావనానుగతమైనమనీష మహాకావ్యసృష్టికి హేతువౌతుంది. కవి వ్యక్తికాడు. 'భూమావై సుఖం' అతని బాహ్యాసృష్టి కల్పనా బీజకము, కల్పనా పర్యవసానమున్నూ. ఉద్వేగాకులమైన మనస్సు విహంగమువలె రెక్క లల్లార్చుతూ తుదకు ఒక శాఖకను ఆశ్రయించుతుంది. కరుణవిహ్వాలమైన వాల్మీకి హృదయం రెక్కలల్లార్చి ఒక కొమ్మమీద కూర్చుంది. ఇదే నారద సమాగమము. ఈ లోకంలో ఉత్తమ పురుషు డెవరు? ఆయన ప్రశ్నలో ఆయన కావ్యవస్తువు ఉంది. ఒక ఆదర్శ ప్రతిష్ఠాపన కొరకు కవి తన అహాన్ని కళాపరంగా వినియోగించుకుంటాడు. ఆ వినియోగం చరిత్రాశ్రయమై మహా కావ్య మౌతుంది.

వాల్మీకి స్వతఃముని. మననశీలి. క్రౌంచ వియోగోద్భూతమైన ఆవేదనా, నారద సమాగమముతో సంతరించుకున్న కావ్యవస్తువూ మునిధర్మంతో మథితమై వ్యాకోచాన్ని పొంది క్రమపద్ధతిలో సమష్టిపరం చేయబడినవి. రామాయణ రచనాకాలంలో ఆయన మునిధర్మం ఆయన్ను అంతర్ముఖునిగా చేస్తే ఆయన ఋషిధర్మం బహిర్ముఖుణ్ణి చేసింది. ఋషిధర్మంలో ముందు చూపుంది. తన భావనా జగత్తుకు పరంగా ఉన్న ఒక జీవితసత్యంకోసం తహ తహలాడి ఆదర్శ మానవుణ్ణి వెతుక్కోవడమే ఋషిధర్మం. ఇదే సత్యం. వస్తువును యథార్థ స్వరూపంలో చూడటమే సత్యంకాదు. వస్తువుయొక్క యాథార్థ్య పరిమాణాన్ని అనుభూత జీవిత పరిమితుల్లోకి తెచ్చుకుంటూ కూడ ఇతఃపరంగా ఉన్నదాని 'మిగులు'ను చూడడం. దీన్ని శాశ్వతమని ప్రాచీనులూ ప్రయోజనమని ఆధునికులూ అంటారు. వస్తువును ఇలా పరిశీలన చేయగలిగిన వాడే ఋషి. 'నానృషిః కురుతే కావ్యం'. ముందు ఋషియై సత్యద్రష్టయై కావ్యాన్ని వ్రాయాలి. అంటే ప్రియం పలకాలి. అప్పుడు కవి గుణాలు 'సత్యంచ ప్రియంచ' అవుతాయి. వాల్మీకియొక్క ఋషిత్వం ఏమిటి?

నొక్కొక్క మెట్టు పెంచును;
దిక్కులు కననేల, బైలుదేరుము నాతో.

పరమ విష్ణు మోసి, బ్రహ్మను ప్రసవించి,
తనువు దొరగి చనియె తమి, నిశీథి;
కాలరుద్రమూర్తి కనువిచ్చుటకుముందె
లోకబాంధవునిగ సాకికొమ్ము!

పురు లంటుకొనగ పేలాల్
కొర కురికెడి మూకభంగి క్రుమ్మరునదె ప్రా
గ్గిరి తటముల తొగ తోటల
అరవిందములందు రేగి అలిబృందమ్ముల్.

వేల్

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11746

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA D.P.R.I. Acc. No. 11746

గ్రంథ

౧. కర్ణ చరిత్ర .... శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి
౨. సమాధాన వేదిక .... శ్రీ ఆచార్యా మామిడిపూడి వెంకటరంగయ్యా
౩. వీర కంకణము .... శ్రీ పాణ్యాం నరసరామయ్యా
౪. భగవద్గీతా మాహాత్మ్యము .... శ్రీ పురాణపండ రామమూర్తి
౫. కెరటాలు ... శ్రీ రంగశ్రీ
౬. రాగవాసిష్ఠం .... శ్రీ బోయి భీమన్న

AOLAIOSB119



లోకాన్ని గుణవంతం, వీర్యవంతం, పుణ్యశ్లోకీభూతం చేయడం. ఇదే ఆనాటి లోకధర్మం. ఇదే ఆర్షం, ఆదర్శం, ఋషిధర్మం, ఇదే రామాయణం.

వాల్మీకియొక్క సాథురమైన సత్యసంకల్పం ముందు యుగాలమీదకు ప్రసరించి కర్తవ్యప్రబోధం చేసింది. మహాకావ్యంగా ఆనందాన్నీ మహా సంహితగా శాంతిని యిచ్చింది. అది భారతీయునకు విడదీయరాని ఆత్మ సంబంధం. ప్రతి సారస్వతంలోనూ ఆయనవాక్కు ప్రతిధ్వనించింది. సత్యమూ, స్వచ్ఛమూ, సరళమూ అయిన వాక్కు ఎప్పుడూ అలాగే ఉంటుంది. పలువురు భారతకవులు రామకథాసంకీర్తనం చేశారు. వాల్మీకియుగంలో వాల్మీకిసృష్టి ఒక మహాకావ్యం. తరువాతి మానవునకు అది సంస్కృతి, ధర్మం, మతం అయింది. మతప్రవక్త మానవుణ్ణి మంచివానిగా చేస్తాడు. అందువల్ల మానవుడు చెడిపోతాడు. కాని కవి మానవుణ్ణి మంచివానిగాచేయక మానవుణ్ణిగానే ఉంచుతాడు. అందువల్లే కవీ, మానవుడూ ఎప్పుడూ చరిత్రలో శాశ్వతంగా ఉంటారు. మానవునిలో మానవత్వం ఉజ్జ్వలంగా భాసింపజేయ గలగడానికి మించి అతనికి అధికంగా ఏమీ ప్రవచింపనక్కరలేదు. ఈరహస్యం కవికిమాత్రమే తెలుసు. వాల్మీకి, వాల్మీకియొక్క రాముడూ, వీళ్ళిద్దరిమధ్యనున్న మానుష భావాన్ని తరువాతియుగం అమానుషంచేసింది. అతిమానవుడుగా రాముడు అవతరించినాడు. ఆధిదైవికంగా రామాయణం రూపొంది ఐహిక ప్రసారాన్ని శిక్షించే స్మృతిగా నిలిచింది. అనువాదాలుగా విరిసిన రామాయణాలలో వాల్మీకియొక్క కావ్య వ్యక్తిత్వం మరుగున పడిపోయింది. వాల్మీకి తరువాతి యుగంలో ఉన్నవారు తమ యుగంలో వాల్మీకిని చూడలేదు. వాల్మీకియుగం లోనే వాల్మీకిని చూచినారు. అందువల్ల వాళ్లు కేవలం అనువాదకులు. కాళి దాసాదులు రఘుచరిత్రను వ్రాశారు. వీరు రామకథాకావ్య కవులు. వీరు రామకథమీద స్వతః తమ వ్యక్తిత్వం నిరూపించుకో ప్రయత్నం చేయలేదు. రామకథలోని కథాభాగం, నిశ్చయాత్మకమైన ఒక ధార్మికబుద్ధి, కావ్య శిల్పంలో వీరికున్న అపారమైన శక్తి, వీరిని రామకథాకావ్య కవులుగాచేసింది. రామాయణాన్ని తమదిగా చేసుకునే కుతూహలం వీరికిలేదు. అవసరం లేదు కూడానూ. తులసీదాసు రామకథాకవులలో చెప్పుకోదగినవ్యక్తి. ఇతడు రాముని కోసం జీవించి రామునికోసం కైంకర్యం అయినాడు. రాముణ్ణి ఇష్టదైవం గానూ, సర్వస్వంగానూ ఆరాధించినాడు. నిజంచెప్పాలంటే ఈయన రామాయణ కవిగాదు, రామకవి. వాల్మీకి, వాల్మీకి యుగం, వాల్మీకి రామాయణం,

ఈ మూడూ పరస్పరాధారాధేయకాలు. అందువల్ల స్వతస్సిద్ధాలు. అలాగే తులసీదాసు, తులసీదాసుయుగం, తులసీదాసురామాయణం, ఈమూడూ పరస్పరసాపేక్షాలు. అందువల్ల స్వతస్సిద్ధాలు. వాల్మీకి రామాయణంవలె తులసీదాసురామాయణం కూడా స్వయంభువము. ఆయుగప్రసూతము. తత్కారణంగా రామకథా సాహిత్యంలో తులసీదాసు విలక్షణవ్యక్తిత్వంలో మనకు కనిపించుతున్నాడు. కావ్యవిషయాన్ని తనలోచూచుకొని తనదిగా చేసుకొనగలగడం వ్యక్తిత్వం. తులసీదాసు వాల్మీకిని మఱచిపోయి, వాల్మీకి ప్రతిష్ఠించుకున్న రాముణ్ణికూడా మఱచిపోయి, తానుగా రూపించుకొన్న రాముణ్ణి తన కావ్యంలో ప్రతిష్ఠించుకున్నాడు. వాల్మీకిలో లోకోత్తర పురుషుడు రాముడు. తులసీదాసులోనిరాముడు మర్యాదా పురుషోత్తముడు, పతితపావనుడు, అవతారపురుషుడు. ఇది తులసీదాసు స్వయం వరించుకున్న రూపమే కాదు. ఆయన యుగస్వభావము నిర్మించుకున్న రూపముకూడా. తద్యుగధారణను తనలో ప్రతిబింబింపజేసికొని దానిని రామాయణంగా గానం చేయగలగడం తులసీదాసుని విశిష్టత. ఏ యుగం కోరిన ఆదర్శాన్ని ఆ యుగానికి అందించాలి కవి. వాల్మీకి అలాగేచేసినాడు. తులసీదాసుకూడా అంతే. తులసీదాసు తనకాలంలో ఉన్న లోకధర్మాన్ని తిరస్కరించి వాల్మీకియొక్క లోకధర్మాన్ని స్వీకరించినట్లైతే తాను ప్రత్యేకించి చూపదగిన వైశిష్ట్యమేమి ఉండేది? అతనూ అన్యరామాయణకవులలో జను అయిఉండేవాడు. ఆధిభౌతికంగా దేశం క్షీణదశలో ఉన్న ఆమధ్యయుగంలో భారతీయుని కనుగొనల్లో నిరాశారేఖలు క్రమ్మినాయి. ఐహిక జీవితవైభవం అపహరింపబడింది. అట్టి అపహృత మానవుడు ఆముష్మిక కల్పనా సుఖపునీలినీడల్లో విశ్రాంతిని పొందగోరుతాడు. అధికారధిక్కృతమై, చెదరిపోయిన ఆభిజాత్యం విజేతపాదాలక్రింద అణగి ఉండలేక ఎదురు తిరుగుతుంది. అలా ఎదురు తిరగలేనినాడు భగవదాశ్రయాన్ని పొందుతుంది. మానవునిలోని మానవ శక్తులు క్షీణించినప్పుడు మానవుడు జీవుడౌతాడు. అతని జీవితకాంక్ష ముముక్షగా పరిణమిస్తుంది. లోకంలో జీవించుచూ కూడా లోకాతీతమనస్థితిలో కాలయాపన చేయుచున్న జీవుని క్షణాలు లోకదృష్టిలో నిట్టూర్పులూ, ఓదార్పులూ అని పిలువబడతాయి. ఆయుగంలో భారతీయుని ఎదుట ఉన్నస్థితి ఇది. జీవితమంతా భ్రాంతి. ప్రపంచం క్షణభంగురం. ప్రతిదీ కర్మమీదా, ప్రారబ్ధంమీదా ఆధారపడి ఉంటుంది. పురుషకారమంటూ ఏమీలేదు. అంతా ఈశ్వరేచ్ఛా సంచాలితము. ఈ విధమైన అభా

వాత్మక ధోరణిలో నెగెటివిజంలో మధ్యయుగీన భారతీయుడు జీవించాడు. అదే తులసీదాసులో ప్రతిబింబించింది. మధ్యయుగంలోని భారతీయుడు ఉపాసనా ప్రధానుడు, భక్తుడు. తులసీదాసు పరమభక్తుడు. ఆయనకు సృష్టి అంతా భక్తిమయము. అంతా రామమయం. 'నిజః పరోవా' అనే భేదంలేదు. సర్వధర్మాలను, సర్వకావ్యశక్తుల్ని మ్రింగి వెల్లుబికి వచ్చిన ఆతని భక్తి పారవశ్యంలో ఆతని సర్వనాడులూ ఝుంకరించినాయి. అతనిలోంచి రామచరితమానసం ఝుంకారం చేసింది. ఇంతకంటే వేరే వ్యక్తిత్వం ఏముంటుంది? వేద్యాంతర సంపర్కశూన్యత అంటే యిదే. ఆయన పరిధిలో, ఆయన ఆదర్శంలో, ఆయన లోకధర్మంలో ఆయన్ను మించి మరోకవి పుట్టలేరు. ఆయన పరమ భక్తాగ్రేసరుడు. రామపాద సరోరుహాలక్రింద సర్వాత్మనా సమర్పితమైన కైంకర్యశీలుడు. ఆత్మలో ఆత్మగా తాదాత్మ్యం పొందిన నిరహంభావుడు. ఆయన్ను మనం ఏవిధంగా పోలిక తెచ్చుకోగలం? అన్యకవుల్ని ఆయనతో పోల్చుకొని కావ్యగుణదోష విమర్శ చేయబూనడం పరిహాసము. ధర్మాధర్మ వివేచన ఆయనపట్ల వ్యర్థం. ఆయన భక్తిలో, ఆయన తాదాత్మ్యంలో, ఆయన ప్రగాఢవిశ్వాసంలో మునిగిపోగలిగితే ఆయనవద్దకు వెళ్ళాలి. లేకపోతే దూరాన్నుంచే నమస్కరించాలి.

ఇదింతా నవ్యేతర యుగాంతరగాథ. ఇప్పటికి చాలా దూరంలో ప్రయాణం సాగించిన మానవుడు కోరిన క్రొర్కెకు ఆలపించిన కావ్యగానం అది. దాన్ని మనం ఇప్పుడు ఎలా మన పరిసరాల దగ్గరకు తెచ్చుకోవాలి. మన అనుభూతుల్ని కాపాడగలిగిన అంశం దాంట్లో ఎంత ఉంది? మన పురోగమనంలో దాని పాథేయం ఎంతపాలు? అసలు మనం ఎవరము? మనకు కావలసిన రామాయణం ఏమిటి? విశ్వనాథ ఎవరు? ఆయన రామాయణమేమిటి? ఒకదారికి వద్దాం.

విశ్వనాథకు జీవితాన్ని గురించి ఏమైనా ప్రత్యేకమైన దృష్టికోణం ఉందా! ఆయన ముందున్న కావ్యాదర్శమేమిటి? మహా కావ్యరచనకు కవి ఋషి కల్పుడు అయి ఉండాలని ముందు చెప్పాం. అతడు తన స్వాయంభువ సత్యాన్ని ఆహ్లాదమయంగా ప్రకటించగలగాలి. దాన్నే 'సత్యం శివం సుందరంగా' విభజించుకుందాం. విశ్వనాథలో సత్యం ఉందా? ఉందికాని అది చాలా ప్రాతది. వర్తమాన జీవితంలో తాదాత్మ్యం పొందలేని సత్యం ఆయనకుంది. ఆధునిక జీవనపద్ధతి ఆయన సంస్కారాన్ని తికమకపెట్టే ఒక జటిల

సమస్య. సత్యమునకు వెనుకటికాలంలో ఉన్నరూపం ఆముష్మికము, ఆధ్యాత్మికమూ, ధార్మికము. ఇప్పుడు ఆ సత్తుకు అర్థం మానవుడు తన ఆయుః పరిమితిలో సమష్టికి చేయగలిగిన హేతుబద్ధమైన పరమార్థము. అట్టి సత్యాన్ని ఉపయోగమనుకుంటే ఇంకా తేలిగ్గాఉంటుంది. ప్రస్తుత కవులు ఒక ప్రత్యేకమైన ఆలోచనా పద్ధతిని అలవర్చుకొని జీవితాన్ని యిలాగే పర్యాలోచిస్తున్నారు. అందువల్లే కవిత అంటే Criticism of life అనే సూక్తిలో సారభూతంగా కనిపించుతుంది. ఒక సమదర్శివలె ఒక పరిశోధకునివలె నిర్దిష్టమైన ఆలోచనా పద్ధతిని ఏర్పరచుకుంటే తప్ప వర్తమాన పాఠకుడు తృప్తి పొందలేడు. ప్రబంధకవులూ, భావకవులూ కళకోసం కళ అని భావనచేసినా ఒక పరమార్థంకోసం కవితనల్లే కవికిమాత్రం సత్యాన్ని గురించి నిశ్చితమైన దృక్కోణం ఉండడం అవసరం. వెనుకటి 'సత్యం' అనే మాటలోంచి ఆముష్మికమూ, ధార్మికమూ తీసివేస్తే విశ్వనాథలో సత్యంలేదు. 'సుందరం' ఉందీ అంటే అదీలేదు. పోతే 'శివం' ఉంది. శివమంటే సత్యభ్రాంతి. మిథ్యాసత్యం. అజ్ఞాతమైన మేలు. పరంపరాగతంగావచ్చి ప్రమాణీకృతం కాలేక నమ్మకాలను ఆశ్రయించిన ఉపయోగం అది. ఇలాంటి ఉపయోగంతో, అవాంఛితమైన శుభంలో కావ్యనిర్మాణంచేస్తే ఈయుగం హర్షించదు. విశ్వనాథ ఈయుగంలో ఉండి కావ్యం వ్రాస్తున్నాడు. కాబట్టి ఈ యుగంలో ఉన్న లోక ధర్మాన్నే ఆయన పరిగ్రహించాలి. వాల్మీకి తులసీదాసులు తత్తద్యుగధర్మాలను గ్రహించగలిగియే తమవ్యక్తిత్వాలు నిరూపించుకున్నారు. కాని ఈ కవి తన లోక ధర్మాన్ని విసర్జించినాడు. ఒక్క వస్తుపరంగానేకాక ఆలోచనాపద్ధతిలో కూడా ఈయన ప్రాచీన సంప్రదాయాన్ని వరించినాడు. గతయుగంలోని జీవనప్రేరక శక్తుల్ని యథాతథంగా వర్తమానంలోకి చొప్పించడం సాధ్యపడదు. కారణమేమంటే వాటిలోనివి కొన్ని కల్పనలు, కొన్ని మిథ్యలు, కొన్ని చిదాభాసలు, మరికొన్ని తంతులు. నేటి మానవప్రజ్ఞ యింకోధోరణిలో నడుస్తుంది. ఈ ప్రజ్ఞ పదార్థంలోపుట్టి పదార్థంతోసాగి పదార్థంతో ముగిస్తుంది. దీనిస్థాయిత్వంలో మన కెలాంటి సందేహములున్నా ఈ ప్రజ్ఞావికాసపు వెలుతురులో ఉండి జీవితాన్ని ఆలోచించుకోవడం యీనాటి మనుష్యుని కనీసధర్మం అయింది. ఇలా కాలం ముందుకుపరుగిడుతుంది. కాని మన మహాకవులైనవారు వెనక్కు అంగలు వేస్తున్నారు.

ఈ యుగంలోనే గత భారతీయుని జీవిత విధానాన్ని సంస్కరించి కొత్త కొత్త త్రోవలు చూపించిన మహాకవులూ ఉన్నారు. నానా సంకీర్ణమైన ఆ పాత చరిత్రలోంచి సారభూతపదార్థాన్ని వీరు పిండారు. ఆయా అనుభూతుల్లోనూ, భావనల్లోనూ సామాన్యధర్మం ఎక్కడో గ్రహించారు. ఒక విశేషమైన రస సమాధిని పొంది ఒక క్రొత్త కాకువుతో కావ్యగానం చేశారు. ప్రాతకాలపు అనుష్ఠాన ప్రధానమైనధర్మచర్య వీరికి రహస్య కళాక్రీడగా భాసించింది. చిరంతన విషయాలను క్రొత్త యింద్రియాలతో ఆఘ్రాణించినట్లు వీరి లేఖిని నవోన్మేషం పొందింది. దీని కంతకూ ప్రతినిధి రవీంద్రుడు.

"సాకారపు కడలి నడుమ
బ్రుంగుడు వడి అట్టడుగున
నిరాకారపు నిండుముత్తి
యాన్ని నెముక బోవుచుంటి"

అని తన అద్వైతభావనను ఈయన ఒక కొత్తవ్యంజనతో మేళవించారు.

ఇలాగే :

భక్తి భజన పూజసేస లేల
అపనయించుమూ అర్చకా!
గడియవైచి ఏలనోయి
కోవెలలో రసహీనపూజ.

అని తదుపాసనాభంగిమను ఒక క్రొత్తరీతిలో సంస్కరించుకున్నాడు. జీవునకూ ఆత్మకూ మధ్యనున్న రూపాన్నీ, మానవునకూ సమాజమునకూ మధ్యనున్న సంబంధాన్నీ, సృష్టికీ కవికీ మధ్యనున్న అనురాగాన్నీ ఒకక్రొత్త అనుభూతితో భావనచేసిన విధానం ఇది. ఈ భారతీయుడు తన వారసత్వాన్నీ, తన హైందవాన్నీ ఇలా నూతన అభివ్యక్తిలో చూచుకున్నాడు.

మరి విశ్వనాథ ఈ విషయంలోనూ సున్నితంగా కనిపించరు. ఆయన ప్రాచీన భవ్యనాగరికతకు సరైన పౌరోహిత్యం వహించడంలేదు. ఆయన అభిరుచి హైందవంలోని మహోన్నత పక్షాన్ని గాక నిర్బలమైన పక్షాన్ని ఆశ్రయించింది. ఈ యుగాన్ని కలియుగంగా భావనచేసి కవిగా రాణించలేరు ఎవ్వరూ. విశ్వనాథకున్న కవి భావనను ఈ క్రింది పద్యపాదంలో చూడవచ్చు.

"కలిలో దైవము లేదు భూసురు లనంగా ద్వేషమైపోయె" దీంట్లో విశ్వనాథ యొక్కనగ్నవ్యక్తిత్వం కనిపించుతుంది. కలియుగం పాపభూయిష్ఠం.

ఇది కొందరి పుణ్యాత్ముల ధారణ. 'దేవుడు ఉన్నాడు లేడు' ఈ చర్చా భారాన్ని ఈ యుగం సహించలేదు. దేవుని ఆస్తిక్యా నాస్తిక్యాలను పట్టించుకునీ పట్టించుకోకుండా సాగిపోవడం నేటి లోకమర్యాద. 'భూసురు లనంగా ద్వేషమైపోయె' ఇలాంటి మాటలు వ్రాయడానికీ, చదవడానికీ నేడు ఇంపుగా ఉండవు. ఇవన్నీ మనకు అక్కర్లేదు. విషయాంతరం.

పోతే కవి ఈ రామాయణాన్ని జీవుని వేదన అని చెప్పుకొన్నాడు. ఈ మాటను ఆధారంగా చేసుకొని కాబోలు కొందరు దీన్ని అద్వైత రామాయణంగా చిత్రించారు. ఈ కవియొక్క అద్వైతభావనలో కూడా చాలా చిక్కులున్నాయి. శుద్ధమైనఅద్వైతం ఎక్కడా కనిపించదు. అలాగే విశిష్టాద్వైతం, ద్వైతాద్వైతం సవీ క్రమబద్ధంగా నిరూపింపబడవు. హిందూధర్మమే అలాంటిది. దీంట్లో కొంత చరాస్తి ఉంటుంది. కొంత స్థిరాస్తి ఉంటుంది. తర్కంమీద ఆధారపడింది కొంత, ఆలోచనలో సంతరించుకొంది కొంత, ఆవేశంలో అబ్బింది కొంత, బలవంతాన చేర్చుకొంది కొంత, బలహీనంగా వచ్చింది కొంత, ఊహా కొంత, ఉత్ప్రేక్ష కొంత. హిందూధర్మం ఒక పెద్ద తిరునాళవంటిది. ఈ తిరునాళ విశ్వనాథలో కనిపించుతుంది దాని గుణదోషాలతోపాటు.

రామాయణ కల్పవృక్ష కథాప్రారంభాన్ని ఈ కవి అద్వైత స్మరణతోనే చేశాడు. అద్వైతాన్ని ఆమూలాగ్రంగా కవిగా నిర్వహించడం చాలా కష్టమైనపని. దీనికి ద్వంద్వాతీతుడైన యోగివలె ఈ సృష్టిని సాక్షీభూతంగా చూడగలిగిన పక్వత కావాలి. జడునివలె ఉన్మత్తునివలె బాలకునివలె ద్వేషరాగదూరుడై ఈ జడచైతన్యాల్ని అంటీ అంటక చూడగలిగిన సాధన అద్వైతికి అలవడాలి. నానా కర్మసంకులమైన జీవపరమాత్మల గాథగా రామాయణం భాసించాలి. నిర్లిప్తుడు, నిర్నమస్క్రియుడు, నిస్వధాకారుడు అయిన ఆ కవికి వాఙ్మనోతీతమైన అమనీభావాన్ని ప్రత్యణువులోనూ వేపుచేసి చూపగలిగిన తాత్త్వికనిష్ఠా, దానిని అనుభవైకవేద్యంచేసుకొనగలిగిన భావైక్యత సిద్ధించాలి. ఒకటి - అద్వైతాన్ని గురించి స్పష్టమైన దృష్టిని అలవరచుకోవడం, రెండు - తన్నిష్ఠ భావభావితాంతరంగుడు కావడం, మూడు - తద్భావ ప్రభావోద్దీపితమైన వాక్కును ప్రసారం చేయడం; ఇవి అద్వైత కవియొక్క ప్రయోగదశలు. కావ్యం, సర్వాంగాలనూ ఒరసికొంటున్న కూలంకషవలె, లేదా బయటికి కనిపించని అంతర్వాహినివలె, లేదా పెల్లుబుకుచున్న వరదవలెనూ ఉండి ప్రతి పాత్రయందునూ ప్రతి సన్నివేశమునందునూ ఆ తత్వ

ప్రతిపాదకుని పురః ప్రసారగలిని ప్రద్యోతనం చేయాలి. ఇష్టపాత్రలయందు రాగమూ, అనిష్ట పాత్రలయందు విరాగము, ఒకటి పూర్వపక్షమూ, మరొకటి సిద్ధాంతమూ, ఒక్కెడ స్వీయవ్యాఖ్యానమూ, మరొక్కచో తూష్ణీంభావమూ ఇంచుకఆసక్తి, రవంత అనాసక్తి, తాను క్రాంతదర్శివలె, తన కావ్యం కాంతవోలె శైత్యశోభితమై మందమందాక్షర చరణరణితమై సురభిళమై పిల్లతెమ్మెరవలె సహృదయ హృదయోపగూహనం చేయాలి కావ్యం. గ్రథన— గ్రంథా (Manner and Matter) ద్వైతమైన అద్వైతం పిచ్చలించి మదద్విరేఫంలా రెక్కోల్పాలి పఠితను. అదే రససిద్ధి, అది తాదాత్మ్యం, అది నిష్ఠ, అదే కవి వాక్కు - ఈ గుణాలు విశ్వనాథలో ఎంతవరకుఉన్నాయి ?

ఈ క్రిందిపద్యం చూడండి. కవియొక్క అద్వైతభావన పౌరాణికంలో మెలివడి ఎంత సంకీర్ణమైన మనస్థితిని వెల్లడిచేస్తుందో బోధపడుతుంది.

సుమంత్రునకు దశరథుడు పుత్రుడులేని కొరతను ఇలా వివరించుతున్నాడు.

"కొమరుడన్ పుణ్యకర్మము గాంచనేరని
కట్టడి పున్నరకంపుఁద్రోవ.
తనయుఁడన్న సూక్ష్మతత్త్వంబెఱుగని
జీవి మాయలోన జిక్కుకొన్న
యనదపుర్వు వాని కైహికాముష్మికం
బులు నశించు దారి వెలుఁగులేక."

పుత్రుడు లేకపోవడం పున్నామ నరకానికి దారియని చెప్పాడు. తరువాత పుత్రునకు ఆధ్యాత్మిక ధోరణిలో నిర్వచనంఉంది.

తనయుడు సూక్ష్మతత్త్వమట. ఆతత్త్వము తెలుసుకోలేనిజీవి మాయలో చిక్కుకున్న పురుగట. తనయుణ్ణి సూక్ష్మతత్త్వమని ఏదో గొప్పరహస్యం చెప్ప దలచుకున్నట్లు కనిపించుతున్నాడు కవి. మొదటితప్పు ఇందులో ఏమంటే తనయుణ్ణి సూక్ష్మతత్త్వమనడం. తనయుడు ఏవిధంగా చూచినా సూక్ష్మ తత్వముకాదు. భౌతికప్రమాణదృష్టితో సూక్ష్మాసూక్ష్మ నిర్ణయంచేయరు వేదాంతులు. ఇక్కడ పుత్రుడుఅనేవానిలో జడతత్వం లఘుమాత్రలో ఉందనీ కాబట్టి అదిసూక్ష్మతత్వమనీ కవి అభిప్రాయపడి ఉండవచ్చు. కాని ఆధ్యాత్మికుల దృష్టిలో తనయుడు రాగమోహజన్ముడు. స్థూలజగత్తునకుకూడా స్థూలతత్వ మతడు. పంచతన్మాత్రాభూతమైనసృష్టి ఈదృశ్యమాన జగత్తుకంటె కొంచెం

ప్రాథమికదశగాబట్టి అది సూక్ష్మమని, తనయుడు సమ్యగ్వికసిత మానవుడు కాదు గాబట్టి పంచతన్మాత్రాదశకు ఈడైనవాడనీ, ఊహించుకొని ఈకవి తన యుణ్ణి సూక్ష్మతత్వమని నిర్వచించినాడా! అదికూడా సరికాదు. ఎందుకన పుత్రశబ్దవాచ్యత సంపూర్ణజీవత్వం పొందిన తరువాతనే సిద్ధించుతుంది. కాబట్టి తనయుడు సూక్ష్మతత్వ మనుకోవడం కేవలంభ్రమ. సూక్ష్మతత్వాన్ని ఎఱుగుట అన్నాడు గాబట్టి ఎఱుగుటనుబట్టి పుత్రజననప్రాప్తిగాక పుత్రజనన సంబంధిజ్ఞాన మునకు అన్వయమా! ఆ జ్ఞానములేని జీవి మాయలో చిక్కుతుంది అనియా ఇదీ సబబుగాదు. ఎందుకంటే ఆ సీసపద్యంలో పైనిచెప్పిన పాదాల్లోని విధే యానికి ఇక్కడ పూర్తిఉండదు. దశరథునకు పుత్రజననరహస్యమే కావలసివస్తే పుత్రకామేష్టిచేయ నవసరంలేదుగదా! ఇంకా ముందుకువద్దాం. అట్టిజీవి మాయలో చిక్కుకపోతుందట. తనయుణ్ణి పొందలేనిజీవి మాయలోచిక్కడం వేదాంతానికే విరుద్ధం. సాంసారిక తృష్ణలకు ఎంతదూరంగా వెళితే అంత బంధన రహితుడౌతాడు జీవుడు. తనయుడున్నవాడు మాయాగ్రస్తుడు అని చెప్పు కోవడమే ఆధ్యాత్మికుల మర్యాద. దీనికి భిన్నంగా పుత్రవర్జితుడు మాయలో చిక్కుకపోతాడని ఈయన వితండవాదన. మళ్ళీ చివరకు "ఐహికాముష్మి కంబులు నశించు" అని మొదటచెప్పినమాటనే తిరిగిచెప్పాడు. ఈపద్యంలో ఉన్న తికమక అర్థమౌతూనేఉంది. అసలిది ఒక పౌరాణికభావన. దీనికి సూక్ష్మ తత్వం, జీవి, మాయఅనే పదాలలో ఆధ్యాత్మికావగుంఠనం వేసి తన్ను వేదాం తిగా నిరూపించుకోదలచుకున్నాడు. కాని అంతా వ్యర్థమైపోయింది. ఇలాంటి అవకతవకలు ఈయనభావాల్లో చాలా కనిపించుతాయి.

ఈయన క్రొత్తవిచెప్పలేక వెనుకటి ప్రాతసిద్ధాంతాలనే పిష్టపేషణం చేస్తుంటారు. అంతకు మినహా రామాయణంలోఉన్న క్రొత్తదనం ఏమిటి? రామాయణం పురావృత్తం కాబట్టి ఆకాలానికి సంబంధించిన పరిశోధన దీంట్లో, ఉందా? అంటే లేదు. అవతార వాదమూ, జన్మజన్మాంతర సంబంధములూ, ప్రారబ్ధమూ, దశరథుడు అరువదివేల ఏండ్లు జీవించడమూ, అహల్యా శాప విమోచనము, స్వర్గ నరక సంరంభములు, సురాసురమాయావిచేష్టితాలు, ఇంకాఏవేవో అభూతకల్పనలూ అన్నీ యథాతథంగానే ఉన్నాయి. కథా సంయోజనలో, పాత్రలరూపకల్పనలలో మనస్తత్వ దృష్టిగాని, శైలిలో నవ్యతాద్యోతకమైన శిల్పంగానీ మరేవిధమైన క్రొత్తదనంగానీ కన్పించదు. కథకు వెలుపటగానీ బయటగానీ నిలుచుండి ఈ కవి ఏదైనా మహోన్నతమైన

సందేశంయిస్తున్నాడా అంటే అదీ కానరాదు. ఉదాత్తభావశాలీనత ఈ కవిలో గోచరించదు. పోతే ఒక్కటి. వర్ణనలలో ఆధునిక పదధ్వనులు. అవికూడా కటు శ్రావ్యంగా మొత్తంమీద అస్తవ్యస్తంగా వినిపించుతాయి. ఈ అభిమానంతోనే ఈయన ఇంతపెద్దరామాయణం వ్రాసి యుండవచ్చు. వ్యుత్పత్తీ, ప్రతిభా ఈ రెండూ తనలో గాఢంగా ఉన్నవని ఈయన నమ్మిక. ఈ నమ్మికను ఆధారం చేసుకునే అవతారికలో

"కవిప్రతిభలో నుండును గావ్యగత శ
తాంశములయందుఁ దొంబది యైన పాళ్ళు"

అని సాధికారంగా పల్కినాడు. నిజమే. ఈయన సాధికారత శ్లాఘనీయము. ప్రతిభాశాలి. ఈయన ఏదైనా వ్రాయగలడు. కాని వ్రాసిందంతా చదువలేము. చదివింపంతా ఆనందించలేము. దీనికి కారణమేమిటి అనేదే నా విమర్శనోద్దేశ్యం. దీనికిముందు ఎంతో చెప్పాను. అది అప్రాసంగికంకాదు. ఎందువల్లనంటే విశ్వనాథ ఆధునికుడు. ఆధునికాశయములు కలిగిన కవికి ఆధునికయుగంలో జీవించడంలో కష్టంలేదు కాని విశ్వనాథవంటి సంప్రదాయ బద్ధుడైన కవి ఉదాత్తభావపరిణతిలేని కారణంగా ఆధునికత సంపాయించడం కోసం యుగంతో ఎంతగా పెనగులాడవలసివస్తుందో ఈ విమర్శనద్వారా నిరూపిస్తాను.

ఈ కవిలో బాహ్య-ఆభ్యంతరికములైన దోషాలూ అనౌచిత్యాలూ ఎన్నో ఉన్నాయి. బాహ్యవికృతుల్ని యిట్టేపట్టేయవచ్చునుగాని ఆంతరిక శైథిల్యాలు కావ్యనిర్మాణంలో ఏ యే పట్టుల జీర్ణించిఉంటాయో చెప్పడం చాలకష్టం. రస పోషణలో, పాత్రౌచితిలో, కథాసంయోజనలో ఏదో తెలియరాని లోపం ఒకటి ఉండి స్వేచ్ఛగా రసాస్వాదన చేయనీయక అడుగడుగునా అడ్డు తగులుతుంది. కవిలోని ఒకానొక ప్రతిభ మనల్ను ఆనందోన్ముఖుల చేయబోగా రెండవపొరలో ఉన్న యీ ఆభ్యంతరిక శైథిల్యం ఆ రసగుళికను మ్రింగ నుమియగారాని గుటకగా జేసి బలవంతాన మ్రింగిస్తుంది. ఇది ఈయన కావ్యంలో ఎక్కువగా దొరుకుతున్న ప్రధానదోషం. దీన్ని నేను సాధారణీకరణ లోపంగా భావిస్తాను.

## సాధారణీకరణలోపం :

భరతముని సాధారణీకరణాన్ని రసపరంగా చెప్పినాడు. కవియొక్క అంతర్గతభావాన్ని నటుడు తన నటనాకౌశలంచేత ఆస్వాదయోగ్యం చేస్తాడు

అని. ఇలా ఆస్వాదయోగ్యం చేయగలగడం సాధారణీకరణమనే ప్రక్రియ ద్వారానే జరుగుతుంది. నటుని అభినయ వ్యాపారంలోనే గాక ఈ సాధారణీ కరణం కవి అంతర్గతభావంలో కూడా ఉంటుంది. కవి తాను గోచరం చేసు కొన్న వస్తువును యథాతథంగా అలాగే అపరిపక్వంగా ఇవ్వడంలేదు. కవి మొదట పొందిన జ్ఞానము సాక్షికము, విషయజము. దేశకాలావధుల్లో అది సీమితమై ఉంటుంది. దాన్నే కవి తన హృదయంలో మననంచేసి దేశకాలాది భేదాతీతంగా చేసి మనకు అందించి మనలను రసాస్వాద యోగ్యుల్ని చేస్తాడు. అభినవగుప్తుని వ్యాఖ్య దీన్నే ఇలా విశదం చేస్తుంది.

"కవేః సాధారణం తథాపి వర్ణనా నిపుణస్య యః అంతర్గతోఽనాది ప్రాక్తన సంస్కార ప్రతిభానమయో నతు లౌకిక విషయజః రాగాంతే ఏవ దేశకాలాది భేదాభావాత్ సర్వసాధారణీభావేన ఆస్వాదయోగ్యః తం భావ యన్ ఆస్వాదయోగ్యీకుర్వన్"

ఇక్కడ కవిభావమంటే అనాది ప్రాక్తన సంస్కార జన్యమైనదనీ, లౌకికవిషయజము కాదనీ చెప్పబడింది. ఇది కవి భావాన్ని గురించిన వివరణ. ఈ కవిభావమే కవికర్మగా రూపొందుటలో గల సృజన విధానాన్ని వర్డ్స్ వర్తు ఇలా చెబుతున్నాడు.

"Poetry is the spontaneous overflow of powerful feelings. It takes its origin from emotions recollected in tranquility."

ఒక ఉద్దామమైన ఆవేగమును కవి తిరిగి స్తిమితకాలంలో స్మరించి కవితగా యిస్తాడు. స్మరించడం అంటే మననం చేయడం. ఇదే సాధారణీ కరణం. వాల్మీకి కూడా క్రౌంచవియోగోద్భూతమైన ఆవేగాన్ని స్తిమిత కాలంలో భావనచేసి రామాయణంగా బృహత్కల్పన చేశాడు. కవికర్మలో ఈ సాధారణీకరణం ఎన్నో రూపాలతో సాక్షాత్కరిస్తుంది. ఒక భావాన్ని సాధారణీకరణం చేయవచ్చు. ఒక సిద్ధాంతాన్ని సాధారణీకరణం చేయవచ్చు. అలాగే వస్తువునుకూడా. భావాన్ని సాధారణీకృతం చేస్తే రసమౌతుంది. సిద్ధాంతాన్ని చేస్తే ఆదర్శమౌతుంది. వస్తువునిచేస్తే కల్పనమౌతుంది. భిన్న ఉపాధుల్లోనుంచి భిన్నభిన్న దేశకాలాల్లోనుంచి సేకరించుకొనిన అనుభవాలు మనకు ఎన్నో ఉంటాయి. వ్యక్తినుంచి, దేశంనుంచి, కాలంనుంచి వేరుచేయ బడిన తద్విషయిక జ్ఞానము కవి కల్పనకు పూర్వవ్యంజనంగా తయారవుతుంది. వ్యక్తినిష్ఠమైన జ్ఞానంలో సాంద్రత ఉంటుంది గాని వైశాల్యం ఉండదు.

ద్రవీభావం కూడా ఉండదు. కవి దానిని సాధారణీకరణం ద్వారానే ద్రవీభూత మొనర్చి సర్వహృదయాభిగమ్యం చేస్తాడు. ఇది ఒక రకమైన వడపోత. లౌకిక విషయములనుండి మరలించి తీసుకురాబడిన అనుభవాన్ని తన అభీష్ట పాత్రలలో తిరిగి సాంద్రీకరించడం. అంటే మొదట వ్యక్తినిష్ఠములైన భావాలు ఇప్పుడు పాత్రనిష్ఠము లౌతాయి. మొదటివి వాస్తవిక భావాలు అయితే రెండోవి కాల్పనికాలు రససిద్ధాలు. సాధారణీకరణం వరకు రాలేని కొన్ని భావాలు అపరిపక్వంగా ఉండి రసాభాస లౌతాయి. కొన్ని సరిపడని తత్వాలు సాధారణీకరణ కాలంలో వచ్చి చేరడంవలన వైమనస్యం పొంది రసవిరోధాలుగా ఏర్పడుతవి. ఇక్షు-రస-శర్కరీ న్యాయంగా ఈ సాధారణీకరణం జరుగుతుంది.

సిద్ధాంతం కూడా సాధారణీకరణం ద్వారానే ఆదర్శమౌతుంది. ఒక ధర్మంలో ఎన్నో భేదప్రభేదాలు ఉంటాయి. కాని అవన్నీ ఒకే మూలయథార్థం మీద తిరుగుతూ ఉంటాయి. వాటియొక్క బాహ్య మాలిన్యాన్ని కరగించి మూలసత్యం వరకు వెళ్ళడమే సాధారణీకరణం. ఉదాహరణకు భారతీయధర్మంలో ఎన్నో కర్మకాండలూ ఉపాసనావిధులూ ఉన్నాయి. వీటినిపోనాడి బాహ్యాబంధనాలను త్రెంచి అంతస్సత్యంవరకు వెళ్ళడం ఒకదశ. తిరిగి దానిమీద దేశకాలాదుల ననుసరించి రూపకల్పన చేసుకోవడం రెండోదశ. ఇదేఆదర్శం. ప్రస్తుత రామాయణకవి యీ మూల సత్యంవరకుకూడా వెళ్ళలేకపోయాడు. తిరిగి దానిమీదనుంచి ఆదర్శం నిర్మించుకొనడం ఈయనకెలా సాధ్యమౌతుంది ?

వస్తుసాధారణీకరణంకూడా యిలాంటిదే. ఒక వస్తువును ఇంకోవస్తువు మీద ఆరోపించేటప్పుడు కేవలం బాహ్యారూపాన్నే చూడడంలేదు కవి. వస్తువు అంటే వస్తువూ దాని గుణమున్నూ. బాహ్యాఆకారమూ, ఆంతరిక గుణమూ రెండూకలిసి మనలో ఒక సాధర్మ్యాన్ని ఒక సామ్యప్రభావాన్ని వేస్తాయి. ఆ సామ్యప్రభావాధారంగా ఆవస్తువును ఇంకొకవస్తువుమీద ఆరోపిస్తున్నాము. అప్పుడు కల్పన అవుతుంది. ముఖచంద్రుడుఅంటే కేవలము వర్తులత్వమే కాదు గదా ! దానిలోఉన్న కాంతీ ఆహ్లాదకత్వమున్నూ. ఈ బింబగ్రహణశక్తి ఎంత ఎక్కువఉంటే అంతఎక్కువ ఆకవియొక్క ఊహ సజీవంగాఉంటుంది. ఈయనలో సాధారణీకరణం తక్కువఅయిన కారణంగా ఈయనచిత్రాలు ఎంత అపరి

పక్వంగా తయారవుతున్నవో కొన్ని ఉదాహరణలతో చూపుతాను. ఈయన ఒక పద్యంలో చంద్రుణ్ణి పసిపాపతో పోల్చాడు.

"ఒనర బోర్లాకడించి యుయ్యేల తొట్టెలో
బండపెట్టిన పసిపాపవోలె
... ... ....
.... ... ..
వెల్లదుస్తులు కట్టించి వీథులన్ షి
కారు పంపిన రాజకుమారువోలె."

చంద్రుడు ఉయ్యేలతొట్టిలో పండబెట్టిన శిశువువలెనూ, తెల్లదుస్తులుకట్టించి వీథుల్లో షికారుకు పంపించిన రాజకుమారునివలెనూ ఉన్నాడట. పోలికగా తెచ్చుకొన్న రాజకుమారునిదృశ్యం కవి అప్పుడే బజారులోచూచివచ్చిన తాజా చిత్రంలాఉంది. ఇది కేవలం చాక్షుషరూపం. వెల్లదుస్తులు, వీథి, షికారు లాంటి విశేషాలవల్ల ఒక ప్రత్యేకమైన దేశము కాలములోని పరిస్థితులు మన ఊహకు స్ఫురిస్తున్నాయి. అందువల్ల సామ్యభావంలో ఉదాత్తత గోచరించడంలేదు. చంద్రుడు పిల్లవానికి మధ్యనున్న రూపగుణవ్యాపారాదుల్లోని ప్రతిచ్ఛాయను మాత్రమే కర్షించి అలంకారాన్ని యివ్వాలి కవి. అప్పుడు చిత్రం మహోదాత్తంగా ఉంటుంది. అలాకాక రూపగుణ వ్యాపారాదుల విశేషపరిగణనతో కూడిన సామ్యం చేపట్టడంవల్ల యీ పోలిక నిండైన సామ్యస్ఫురణను తీసుకురావడం లేదు. శబ్దార్థములలోని వాచ్యముకంటె శబ్దార్థములకు అతీతంగా ఉన్న ధ్వని ఉత్తమమైనట్లే ఉపమానోపమేయముల మధ్యనున్న రూపాశ్రయ సామ్యముకంటే వాటి బింబభావ చిత్రణమే హృదయముపై గంభీరముద్ర వేయగలదు. అందువల్లనే ఉపమారూపకాద్యలంకారాలకంటె నిదర్శన దృష్టాంతాదులలో గాంభీర్య మెక్కువ. కారణం! ఈ అలంకారాలలో బింబగ్రహణ ముండును. బింబగ్రహణమే సాధారణీకరణము గదా ! తారతమ్య వివేచనకొరకు ఎప్పుడో "పిరదౌసి" కావ్యంలో చంద్రుణ్ణి శిశువుతో పోల్చిన జాషువకవి పద్యం ఒకటి యిస్తున్నాను.

"ఆగడపు మబ్బుశయ్యల నపరశిఖరి
బుడుత చంద్రుడు నిద్దురవోవుచుండె
ఈ చెఱువు నీట నతని కుయ్యేలలుగట్టె
జోల వాడుచు నావంకఁ జూడవేమి?"

దీనిలో మబ్బులు శయ్యలుగా పోల్చబడినవి. చంద్రునికి తగిన పాన్పు మబ్బు. ఇది అనాది వస్తువు. దేశకాలానావిద్ధము. కొద్దిపాటి లాక్షణిక ప్రయోగ ములతోనే కవి చంద్రమేఘ సహవాసాన్నీ వాటి అకృతక సౌందర్యాన్ని తాను ఆశించిన మానవీకరణ నిరూపణను సాధించుకున్నాడు. మబ్బుశయ్యలు, బుడుతచంద్రుడులాంటి లఘు విశేషణాలతో ఉదాత్తమైన సాదృశ్యాన్ని కల్పించి కవి మనలను విశ్వమయుని రహస్య క్రీడల్లోకి మౌనంగా తీసుకు వెళుతున్నాడు. విశ్వనాథ తిరిగి రామాయణం ఎందుకు వ్రాస్తున్నాడు అన్న దానికి ఆయన మాటల్లోనే సమాధానం చూడండి.

"మఱల నిదేల రామాయణం బన్నచో
నీ ప్రపంచక మెల్ల నెల్లవేళ
దినుచున్న యన్నమే దినుచున్న దిన్నాళ్లు
తనరుచి బ్రతుకులు తనవిగాన
చేసిన సంసారమే చేయుచున్నది"

ఇచ్చట తిన్న అన్నము తిన్నట్లుగా ఉంది రామాయణ సృష్టి. ఉక్తిలో ఒక పరమార్థం గానీ, సౌందర్యం గానీ ఏమీలేదు. ఆశయ వివక్షకు కావలసిన ఉపమాసామగ్రిని కొంచెం సంస్కరించుకోవడం అనేది ఈయనలో లేదు. అందినది అందినట్లుగా కచ్చాపచ్చాగా యిచ్చివేయడమే ఈయనవంతు. నీవు ఎందుకు ప్రేమిస్తున్నావు అంటే కృష్ణశాస్త్రి ఇలాఅన్నారు.

"సౌరభములేల చిమ్ము బుష్పవ్రజంబు ?
చంద్రికలనేల వెదజల్లు చందమామ ?
ఏల సలిలంబు పాఱు ? గాడ్పేల విసరు ?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను ?"

ఇదీ కవిత్వం. దీంట్లో కవితాలావణ్యం తొణికసలాడుతుంది. కారణం - కవిభావన సాధారణీకృతమై అనాదివస్తువులను ఆశ్రయించింది. సుకుమారమైన ప్రేమవ్యాఖ్యానం చేయడం. ప్రేమకూడా అనాదివస్తువు. సున్నితమైన కవి హృదయం రివ్వున భృంగంలా ఎగిరి తన అభివ్యక్తికి తగిన కోమలములైన ఉపమానములమీద అప్రయత్నంగా వ్రాలింది. చెప్పబడేది ఏమిటి ? చెప్పేది ఏమిటి ? అన్న అంతరువుకూడా గుర్తు పట్టజాలనంత అద్వైతైక్యభావం ఈ చిత్రంలో కనిపించుతుంది. మరి విశ్వనాథో ! రామాయణంలాంటి మహత్తర సృష్టిని రోజూతినే అన్నముతోనూ రోజూ చేసే సంసారముతోనూ పోల్చు

కుంటున్నాడు. భావనలో స్తిమితత్వం శబ్దసంచయంలో పరిమార్జన లేకపోవడం ఇందు చూస్తున్నాము. ఇట్టివి ఈయన శబ్దసామ్యాల్లోనూ చాలా కనిపించు తాయి.

విశ్వామిత్రుని మ్రోల దశరథుడు తన పుత్ర మమకారాన్ని ఇలా వెల్లడి చేస్తున్నాడు.

"రాముడు నాకు స్నానమగు రాముడు నాకు జపంబు ధ్యానమున్
రాముడె యెల్ల నా బ్రతుకు రాముడు నన్నును గన్నతండ్రి"

ఇచ్చట రాముణ్ణి దశరథుడు తన స్నానమూ, జపముగా పోల్చు కున్నాడు. దశరథునకు రామునియందుగల ప్రీతిని వెల్లడి చేయడానికి ఇవి తగిన పోలికలని ఆయన అభిప్రాయము. ఇంతియేగాక దశరథునకు నియమ నిష్ఠలయందు ఎంత పవిత్రభావమున్నదో కూడా వీటివల్ల వ్యక్తమౌతుందనీ, ఇవి క్రొత్త శబ్దసామ్యములనీ ఈ కవి ఊహ. స్నానజపధ్యానాదులు శుద్ధ సాత్వికమనః ప్రబోధకములుగావు. కేవలము ధార్మికులు సృష్టించుకున్న బాహ్యాచిహ్నములు. అంతః పారిశుధ్యములేనివారి కివి లోకప్రతారణకుకూడ ఉపయోగపడవచ్చును. సార్వదేశీయత సార్వకాలీనత లేనికారణంగా ఇలాంటి పోలికలు కావ్యములలోని కెక్కలేదు. విశేషధర్మనిష్ఠాపరులకే ప్రీతికరములగు ఈవిషయములను సర్వజనసుఖసంధాన హేతువులగు కావ్యములందు చొప్పించు పరిపాటిలేదు. కొన్నిరోజులవరకు కూడా స్నానము జపములులేకుండా ఉండ వచ్చును గాబట్టి ఎప్పుడూ విడదీయరాని ప్రాణములవంటి రామునియొక్క ఆత్మీయతాద్యోతనంకొరకు ఈ శబ్దములు చాలక న్యూనోపమలే యగు చున్నవి. ఇట్లు ఈకవి కావ్యకలనలో అతిప్రధానమైన ఒకగుణమును కోల్పోయి తనకృషిని దివ్యకళాఖండముగా నొనరించుకొనలేక పోవుచున్నాడు.

### అనుష్ఠాన రాహిత్యము :

మహాకావ్యత్వసిద్ధికి సాధారణీకరణమెంత అవసరమో కావ్యానుష్ఠాన మంత అవసరము. సాధారణీకరణము కావ్యోత్పాదనలోని ప్రక్రియ. కాని అనుష్ఠానము నిమిత్త కారణములోని ఒక సాత్వికగుణము. ఇది కవికర్మను వ్యవస్థీకరించును. కావ్యతత్వములను క్రమబద్ధ మొనర్చును. ఔచిత్య భంగము రానీయకుండ జూచును. సోద్దేశ్యమైన ప్రయత్నము లౌకికుల ప్రతి కార్యము నందునూ కనిపించును. కాని కావ్యసృష్టి ఒక మహోను

ష్ఠానము. లౌకికేతరములైన కావ్యము లందలి నిశ్చయాత్మకబుద్ధి తత్కార్యోన్ముఖమై తత్కార్యనిరతమై తత్కార్యేతర సంపర్కశూన్యమై అనుష్ఠానమని పిలువబడును. అనుష్ఠానశూన్యమైన శిల్పము వికీర్యమాణ దృశ్యసంకలనమై వేగుచుక్కతోపాటు కరగిపోవును. మహాకావ్యకవి అనుష్ఠాన శీలుడు. సమాధిస్థయోగి, లోకవృత్తమేదైననూ ఈనిష్ఠాశీలుని పర్యవేక్షణలో సంకోచవికోచములనుపొంది కథా సంవిధానమగును. వస్తుభావ పరిగణన లోని యీనిష్ఠయే వర్ణనఅగును. భాషలో శైలిగనూ, కల్పనలో అలంకారము గనూ ఈనిష్ఠయే దాగికొనియుండును. వీటన్నిటినీ మించి కవి ఈఅనుష్ఠాన బలమువలననే తనకావ్యవిషయిక జగత్తునకుకూడ సాక్షీభూతుడై నిలబడును. కవికల్పనలు కవి నిస్సృతములైనను కవి వానికినీ అతీతుడు. కవి ఊర్ణనాభము వలె తననుండియే కథా సూత్రమును లాగికొని ప్రసరింపజేయును. నానావిధ కర్మ వ్యూహములతో కూడిన జీవితము వెనుక ముందు వేయుచున్న పద ముద్రలను దేశకాలవ్యక్తినిబద్ధ మొనర్చి తద్గమనమును ఉత్తేజపరచుటయే కథ. కవి తన పాత్రల పురోగమమును తన క్రమములోనికి తెచ్చుకొనును. పాత్రల సంభాషణములు పాత్రల వ్యవహారముల మీదనూ, పాత్రల వ్యవహారములు పాత్రల నిర్మాణములమీదనూ, పాత్రలనిర్మాణములు కవిప్రయోజనముమీదనూ ఆధారపడియుండును. పాత్రలనిర్మాణములో సాంకర్యమురాగూడదు. పాత్రల స్వభావము ఒకదానితో నొకటి పెనగొనిపోయిన రసవిఘాతము కలుగుటయే గాక కవియొక్క ఇష్టానిష్ట కథనమునకు ఆశ్రయమే లేకుండ పోవును. పాత్రలు మూడు రకములు-(1) కథాగతములు, (2) కవిగతములు, (3) విశేష వ్యక్తిత్వ సూచకములు. కథాగతములు రాజు, సేవకుడు మొదలైనవి. కవి గతములు ధీరోదాత్త ధీరశాంతాదులు. విశేష వ్యక్తిత్వ సూచకములు నేటి మనస్తత్వ శాస్త్రదృష్ట్యా స్నేహగాంభీర్య సంకోచాదులను సూచించు పాత్రలు ఈ కవిలో సైడుపాత్రలుతప్ప మనస్తత్వ పరిశీలనకు సంబంధించిన పాత్రలు. కానరావు. కాబట్టి వానిని ఉల్లిఖించుట అనవసరము. రసభంగం అనే విషయం లోనే ఈయన పాత్రలను గురించి కొంత ఆనుషంగికముగా రాగలదు. అనుష్ఠా నములేమి కతన కావ్యతత్వములలో ఎన్నియో దొసగులు కలుగును. కథా సంవిధానస్ఖాలిత్యము కూడ ఇందులో ఒకటి.

ఈ క్రింది కథాసరణిని గమనించినచో ఈ విషయము బోధపడగలదు. సంతానచింతాక్రాంతుడైన దశరథుని దుఃఖమును దూరీకరింప ఒకనాటిరేయి

సుమంత్రుడు ఆయనను దర్శించినాడు. సమయము అర్ధరాత్రము. తాను వచ్చినట్లు కూడా దశరథునకు తెలియదు. దశరథుడు పరధ్యానములో ఉండి తనముందు చేతులు కట్టుకొని ఉన్న సుమంత్రుని కొంత సేపటికి చూచి ఇంక కొంతసేపటికి సుమంత్రుడు అని గుర్తుపట్టి ఈ అర్ధరాత్రమున వచ్చిన కారణ మేమని అడిగినాడు. మీరు దానఘనులు, ఏది కావలసిననూ చూడవత్తును అని సుమంత్రుడు బదులు పల్కినాడు. అయితే మీరు దీనికొరకు ఇంత సేపు నిరీక్షించ వలెనా? ఎదురుచూడనక్కరలేదు అడగండి అని రాజు పలుకగా సుమంత్రుడు తన అభీష్టమును ఇలా వెల్లడి చేసినాడు.

'మీరీ కరణి దిగులు పొందుచు మాకు దిగులుసేత మాన్పగవలయున్.' మీరు దిగులు లేకుండా ఉంటే అదేమాకు పదివేలు. ఇదీ సుమంత్రుడు చెప్పిన విషయం. దీంట్లోసుమంత్రుని స్వామిభక్తి, దశరథుని స్వజన వాత్సల్యం ఏలాగో స్పష్టపడుతున్నప్పటికీ మొత్తంమీద సుమంత్రునిస్వామిభక్తిఅతివినయం గానూ అనుచితంగానూ ఉంది.

"నీకేది కావలయునో యది
కై కొమ్మన నాకు నేమి కావలయును? మీ
రీకరణి దిగులు పొందుచు
మాకు దిగులు సేత మాన్పగవలయున్."

ఇక్కడ ఉన్న అనౌచిత్యాన్ని కొంచెం ఓపికతో పరికించాలి. పృచ్ఛకునకు తన మీద యాచకత్వభారాన్ని వైచికొని పరసుఖాన్ని తన సుఖంగా కోరేస్థితి ఎప్పుడు వస్తుంది? ఒక యాచకుడుగానీ క్షమాప్రార్థిగానీ నన్ను మీరు అనుగ్ర హించండి అని వేడుకొంటాడు. ఇది స్వవిషయంలో ఘోరమైన తప్పిదం జరిగినప్పుడూ లేక యజమాని భయంకరమైన విపత్తులో ఉన్నప్పుడూ, అది కూడా ఆయజమాని ఆమంత్రుల కొరకూ ఆ ప్రజలకొరకు ఒకానొక ఆహుతికి సంసిద్ధుడైనప్పుడూ, అతడు వినా మహాప్రళయం అంతటి ఆపత్తు కలుగుతుందని అనుకున్నప్పుడూ, అప్పుడు ప్రజలు గుమిగూడి అలా బలిఐపోతున్న రాజును వేడికొని తమ క్షమార్పణాలు చెప్పి బ్రతిమాలి బ్రతికించుకుంటారు. పరిస్థితి బాగా విషమించినప్పుడే యీ దానవాగ్దానాలు క్షమార్పణలూ జరుగుతాయి. కాని ఇక్కడ పరిస్థితి ఏమీ విషమించలేదు. పిల్లలులేని దిగులు రాజుగారికి రోజూ ఉండేదిగులే. దీనికోసం అర్ధరాత్రి సమయంలో పనిగట్టుకవచ్చి సుమంత్రుడు మీరు పిల్లలులేనందుకు చింతించకండి అంటే ఎంత అసందర్భంగా

ఉంటుంది? తీరా సుమంత్రుడు చివరకుచెప్పే దుఃఖపరిహారము అయోధ్యా తీర్థమునకు వెళ్ళడం తప్ప ఏమంత ముఖ్యమైనదీ కాదు. దీన్ని ఎంతో పెద్దది చేసి దానమివ్వమన్నట్లు సుమంత్రుడు అడగడం, దీనికి నిరీక్షించాలా, ఏది కావలసివచ్చినా చప్పున తీసుకో అని దశరథుడు అనడం, మొదలైనవన్నీ ఈ ప్రసంగాన్ని అనౌచిత్యసంభరితం చేస్తున్నాయి ఎందుకంటే సంతాన విషయంలో దుఃఖనివారకమైన ఉపాయం ఏదైనా ఉంటే దశరథుడే స్వయంగా ముందుకువస్తాడు. దీనికి సుమంత్రుడు ఇంత ఆర్భాటం చేయనవసరంలేదు.

తరువాత సుమంత్రుడు ఇలాచెబుతున్నాడు- మీ దిగులువల్ల మేము నిద్రాహారములు మానివేశాము. నన్ను మంత్రులు మీవద్దకు పంపారుఅంటూ, అతడు రాజుగారికి ఒక విశేషణం వేస్తాడు. ఆ విశేషణం అతిఘోరమైంది.

"నన్బాలింపవే నీవా యక్షుద్రాత్ముండవు యాజ్ఞి
కుండవు నిదా శోకంబు నీబోటికిన్"

ఇక్కడ దశరథుణ్ణి కవి ప్రాసకోసమనో లేక బుద్ధిపూర్వకంగానో అక్షుద్రాత్ముండవు అంటాడు. అక్షుద్రాత్ముడవు అనేదానికి గొప్పవాడవు అనుకోవాలి. 'అనల్ప', 'అనూన' అనే వెనుకటిశబ్దాలకు తక్కువలేని గొప్పఅనే అర్థం వస్తుంది. ఆ వరవడిలో ఈయన అక్షుద్రాత్ముడవు అన్నాడు. అక్షుద్రాత్ముడుఅంటే గొప్పవాడు కాదు. అసలు నేను మంచి చెడు అన్న రెండు తెగలేలేవు. అటు మంచి కానీ యిటు చెడు కానీ ఒక సామాన్యదశకూడాఉంది అని కవి గుర్తించలేకపోయాడు. అక్షుద్రుడు అనడంలో దశరథుడు క్షుద్రుడు కానివాడు అనిమాత్రమే అర్థంవస్తుంది. ఇలా సాధారణవిశేషణంతో పిలవడం సుమంత్రుని ఆశయంకాదు. ఏమైనా అక్షుద్రశబ్దప్రయోగం అర్థస్ఫూర్తి తీసుకు రావడంఅటుంచి ఒకరకమైన ఏవగింపును కలుగజేస్తుంది. అక్షుద్రుడవుఅంటే వ్రేలుఎత్తి 'నీవుచెడ్డవాడవుకాని మంచివాడవు' అన్నట్లుంది.

సుమంత్రుని కథనం తరువాత ఒక చిన్నవచనం వస్తుంది. అది ఇది.

"అనిపలికినవిని ఆపేడాసనంబున మసలి, మరలవంగి కూర్చుండి కపోలమ్ము కేలనూది యుస్సురని నేత్రంబుల బాష్పంబు లురలి మంత్రీ! యని పిలిచి"

"ఇడి పొత్తుకల భార్య నడికట్టుతోవచ్చి
యందీయఁబసిపాప నందుకొనుచు
చిటికతోఁ బల్కరించినఁ దొట్టెలోబిడ్డ
బోసినవ్వుల చిట్టెహాసుమఱుగ"

అని దశరథుడు తన సంతాన శూన్యస్థితిని ఒక సీసపద్యంలో చెప్పు కొన్నాడు. 'మంత్రియనిపిలిచి, ఇడి పొత్తుకలభార్య నడికట్టు' అని వెంటనే ఆవచనానికీ ఈసీసపద్యానికీమధ్య పొత్తేమిటి? పెద్దఅఖాతం ఏర్పడ్డది. ఇది కథా కథనంలో తీరనిలోపం. వచనంలో చెప్పినట్లు పాపం రాజు దుఃఖబాష్ప కలితు నయ్యాడు. నిజమేకాని స్వీయదుఃఖానుభవ దశలోఉన్న మనుష్యుడు ఎదుటి వానికి తన దుఃఖగాథను వివరించేటప్పుడు హఠాత్తుగా విశేషపరిగణనాబద్ధమైన స్థితిని ఒలకబోయగూడదు. కొంచెం వాతావరణం కల్పించాలి. పూర్వరంగ నిర్మాణకౌశలం చూపాలి. ఈ ప్రసంగంలోని యీలోటును తీర్చడానికి, ఆయన పద్యాలను ఈక్రమంలో ఉంచితే సరిపోతుంది. పై వచనం తరువాత ఆ పేజీలోనే ఉన్న 'నా మునుచన్న డేండ్లు' అను ఉత్పలమాలనుఉంచి తరువాత 'ఇడి పొత్తు కలభార్య' అన్న సీసపద్యంవేస్తే ముందువచనంలో ఉన్న విషయానికీ సీస పద్యంలోఉన్న భావానికీ పొందుపొసిగేది. ఇది స్థూలంగా చూడడానికి క్రమ స్ఖాలిత్యమేగాని రచనాదృష్టితోచూస్తే కథాకథనంలో గొప్పలోటని చెప్పాలి. తరువాత "వాని కైహికాముష్మికంబులు నశించు దారి వెలుగులేక"అని చెప్పు కున్న రాజునకు "జనపతి! సుహృత్తులో బంధుజనులో యిద్ది" అని సుమంత్రుడు చెప్పుకపోతాడు. రాజునకు సుమంత్రుడు మధ్యనే అడ్డు తగులుతున్నాడు. చేతులు కట్టుకనుంచున్న వినీతసుమంత్రుడు రాజు చెబుతూ వుండగానే అడ్డు తగలడం ఏమంత బాగుంది? ఇలాఉంటుంది ఈయన కథాకథనక్రమం. ఇక దీన్నిగురించి విశేషంగా చెప్పనవసరం లేదనుకుంటాను. ఇంత పెద్ద కావ్యంలో ఎలాగూ దీర్ఘాతిదీర్ఘములైన వర్ణనలు ఉండాలి. కాబట్టి వాటినికూడా కొంచెం పరిశీలించుదాం.

మన సాహిత్యంలో వర్ణనలు మూడురకాలుగా ఉన్నాయి. అందు మొదటిది పౌరాణికాలు. ఇవి విషయపరిగణనా మాత్రాలు. వంశావళులనూ, కర్మకాండలను, పుణ్యతీర్థాదులనూ వర్ణించు ఈవర్ణనలు కేవలము బాహ్య ములు, వివరణ పట్టికలు. ప్రతిపనికీ ప్రయోజనముండునట్లు వర్ణనలకు కూడా ప్రయోజనముంటుంది. పౌరాణికవర్ణనల ప్రయోజనం ధర్మార్థ కామమోక్ష ప్రాప్తికి వీలైనమార్గములు చూపుటయే. పురాణకవులదృష్టి కావ్యత్వము మీదకంటే నీతి, ధర్మములమీద ఎక్కువ. పౌరాణికునకున్న చిత్తశుద్ధి, దృఢ సంకల్పమూ శంకింపరానివి.

ఈ వర్ణనలు విశ్వనాథలో కూడా ఉన్నవి. ఇవి మనకు అవసరంలేదు. రెండవరకపు వర్ణనలు ప్రాబంధికములు. ఇవి ఆలంకారికవర్ణనలు. వీటి ప్రయోజనం సౌందర్యానుభూతి, రసప్రాప్తి, పాండిత్యప్రకర్ష. ఈ వ్యాసంలో చాలా చోట్ల ఈ వర్ణనలకు సంబంధించిన విషయమే వస్తుంది కాబట్టి వీటినికూడా వదలివేస్తున్నాను. ఇక మిగిలినవి ఆధునికవర్ణనలు. ఇవి ఎక్కువగా సామాజికములై ఉంటాయి. ప్రస్తుతము నవలాసాహిత్యములో విరివిగా కనిపించుతున్నాయి. వీటికి ప్రయోజనాలు చాలా ఉన్నవి. వీటిలో కొన్ని జీవితంలోని వాస్తవికతను చూపించుతాయి. ఇట్టి వాస్తవికతా ప్రకాశనమునకు ప్రయోజనము క్రొత్త ప్రమాణములతో విలువలను తూచి ఒక సమష్టిన్యాయం కోసం వీలైన చైతన్యాన్ని పాఠకునకు అందివ్వగలగడం. ఈ వర్ణనలు జీవనపోషకములు, పౌష్టికములూ. కొన్ని వర్ణనలు మనస్తత్వ విశ్లేషణ జరిపి పాత్రలకు సూక్ష్మములైన రూపురేఖలు దిద్దుతాయి. ఇవి మానవుని హృదయమస్తిష్కముల వికాసమును తెలియజేయు మెత్తని కుంచియలు, నవ్యతాద్యోతకములూ, నాగరికములు. ఇంకా కొన్ని కౌటుంబిక వర్ణనలు నిరుద్దేశ్యములైనప్పటికినీ ఏదో కొంత బాహ్యజ్ఞాన సముపార్జనకు దోహదము లౌతవి. అట్టివి క్షణిక సుఖప్రదములు, కాలయాపన సమర్థములు. కాని ఈ కవియొక్క రామాయణ గాథలో సామాజికములవలె ఉన్న వర్ణనల ప్రయోజన మేమిటో బోధపడదు. పౌరాణికంలో అతి సామాజికత్వం చూపెట్టే యీ వర్ణనలు రామకథా స్థాయిని కించపరచడమే గాక క్రొత్తపాతల మేలు కలయికలకు బదులు చేదు కలయికలై రసభావాదులను వమ్ముచేస్తాయి. అయోధ్యలో సామంత రాజులతోపాటు ఆ నగరంలో ఉన్న పెద్దశెట్టికూడా రత్నాలు దెచ్చి దశరథునికి సమర్పిస్తాడు. నెలకు మూన్నాళ్ళ యెద్దడివల్ల మడిచీర అరక తడిచీర కట్టుకుంటుంది కౌసల్య. రామాయణేతర కాలంలోని జీవితస్థితిని సూచించే ఇలాంటి వర్ణనలు ఈ కావ్యంలో చాలా ఉన్నాయి. అచ్చంగా మన నేటి అర్థిక సాంఘిక కుటుంబాలను ఈ రామాయణంలో చూస్తాము. అతివాస్తవిక చిత్రణకు కూడా ప్రయోజన ముంటుందని పైన చెప్పాం. ఈయన అతివాస్తవిక చిత్రణవరకు తీసుకుంటాడుగాని అతివాస్తవికులు పొందే ప్రయోజనం మాత్రం పొందడు. ఆ ప్రయోజనం ఈయనకు అక్కర్లేదు, సరిపడదుకూడా. అయినప్పుడు ఇలాంటి వర్ణనలు చేయడమెందుకు? ఏమీలేదు. వర్ణనకోసం వర్ణన. అంతవరకే. వాస్తవిక దృశ్యాలను యథాతథంగా యిస్తే వర్ణన అవుతుందా! ఆ దృశ్యం

లోని అనుభవం ఇవ్వాలి. దాని వెనుక కవి ఆశించే ప్రయోజనం ఉండాలి. అప్పుడది సరైన వర్ణన. అవి ఏమీలేవు ఇందులో. వస్తు పరిగణనాత్మకములైన పౌరాణిక వర్ణనలూ, అతి కల్పనాప్రౌఢములై దీర్ఘ సమాసములతో తలదిమ్ము ఘటించే ప్రాబంధిక వర్ణనలూ, వాటితోపాటు పచ్చి సామాజిక వర్ణనలూ కలిసి పేలాలతోపాటు గుగ్గిళ్ళు కలుపుకు తిన్నట్లుంటుంది. సూక్ష్మ మనస్తత్వ విశ్లేషణను చూపగలిగిన వర్ణనలు ఈ కావ్యంనుండి ఆశించడం ఎలాగూ సంభవంకాదు. ఈ కవి పాత్రలు తథాకథితములే గాని విశేష వ్యక్తిత్వ సూచకములు కావుగదా! కాని రాముణ్ణి హాస్యాద్భుత శీలి (వెకిలి రాముణ్ణి) చేసినాడు. ఇది బహుశా ఆయన విశేష వ్యక్తిత్వ చిత్రణ మేమో! ఈ పాత్రపోషణలో ఆయన చూపిన స్వభావచిత్రణాపాటవము చూడండి. రాముడు పసికందు. పాలు త్రాగుతున్నాడు. తాగుతూ తాగుతూ "క్రొత్తగా వచ్చే చివుళ్ళ తీటవల్ల కౌసల్య స్తనాన్ని నొక్కుతాడు. అది కందిగింజంత అవుతుంది" సహృదయులకే అనుభవైకవేద్యం దీనిలోని సౌందర్యం. ఇలాంటివి ఈ కావ్యంలో చాలా ఉన్నాయి. వర్ణనకోసం వర్ణనా అతివర్ణనా కువర్ణనలూ ఎక్కడికక్కడికే నిండుకున్నాయి. ఈయన దృశ్యాల్లో సమన్వితమైన సృష్టిలేదు. ప్రయోజన పర్యవసితమైన దృష్టి అంతకన్నా లేదు.

# రామాయణ కల్పవృక్షము - ఒక విమర్శన

[బాలకాండ]

—శ్రీ దుర్గానంద్

## 2

భారతీయ సాహిత్యాచార్యులు రసాన్ని కావ్యంలో ఆత్మసదృశంగా భావించి వివేచించినారు. ఇది ఒక దృష్టితో కావ్యానికి ప్రాణము వంటిది. రసపోషణ కొరకు మహాకవులు చేసిన తప్పులు క్షంతవ్యాలు అయినాయి. దోషాలను నిర్ణయించేటప్పుడుగూడ కావ్యాపకర్షహేతుత్వం అంటే రసాపకర్షహేతుత్వమే తప్ప అన్యథా ఏమీ లేదని పలువురి భావన. రసదృష్టిలేని కావ్యం కావ్యంగాకూడా పరిగణించబడలేదు. రసంకోసం తప్పులు చేయవచ్చు గాని రసాన్నే హననం చేయబూనడం అత్యంత గర్హణీయం. మరి ఈ కవిలో రసదృష్టి ఉందా?

రామాయణం లాంటి మహాకావ్యంలోకూడా ఈయన రసంతో వేళాకోళం ఆడాడు అంటే సరిపోతుంది. రామాయణంలో అతిజాగ్రత్తవహించవలసిన పాత్రలు సీతారాముల పాత్రలు. లోకధర్మ పరిరక్షణకు వాల్మీకి ఈ రెండు పాత్రలనూ ఆధారంగా జేసుకొని ఉత్తమ మానవాదర్శం స్థాపించడానికి ఎంతో సంయమం చూపాడు. ఆయన కవితా తపస్సు సర్వమూ ధారవోయగా లభించిన పాత్రలు ఈ సీతారాముల పాత్రలు. ఈ పాత్రల లోకవృత్తమే భావియుగాలలోని స్త్రీ పురుష జాతుల జీవన ప్రణాళికకు వరవడిదిద్దినాయి. ఇవి లౌకిక జీవనులకు లోకోత్తరాదర్శములుగనూ. కవులకు కళాదర్శములుగనూ నిలిచినవి. ఏ కవీ ఈ పాత్రలకున్న స్థాయిని తగ్గించ సాహసించలేదు. సీతారాముల్ని విషయవాసనా కలితుల్ని చేయలేకనే కాబోలు సౌందర్యపిపాసువులైన మధ్యయుగ కవులు రాధామాధవుల్ని సృష్టించుకొని వాసనామద్యాన్ని పుడిసిళ్ళబట్టి త్రాగారు. భవభూతి వంటి రససిద్ధుడయిన మహాకవి రామాయణాన్ని గ్రహించితే సీతారాములను శృంగారస్పర్శతో మలినం చేయవలసి వస్తుందని భయపడికాబోలు వారిలోని లోకహితైక భావనోపపన్నమైన కరుణపక్షాన్ని గ్రహించి ఉత్తర రామాయణం వ్రాసుకొన్నాడు. కాళిదాసులాంటి కావ్యకవికూడా రామగాథను క్లుప్తంగా చెప్పుకుపోయి అనిష్టకథనంనుంచి తప్పుకున్నాడు. తెలుగు ప్రబంధకవులు కూడా తమ వాచాల శృంగారవర్ణనలకు సీతారాముల్ని గురిచేయక అన్యపురాణాలలో

నుంచి వస్తువును గ్రహించి రామాయణ మర్యాదను గుర్తించారు. భారతీయ సంప్రదాయాన్ని గౌరవించదలచిన ప్రతికవీ ఈ రహస్యాన్ని గుర్తించాడు. కాని విశ్వనాథ 'అహం' ఇక్కడకూడా అపమార్గములు త్రొక్కింది. ఈయన నిరంకుశత్వం సీతారాముల పాత్రలను అతివికృతంగా గాయపరచేంతదైన్యానికిపాల్పడ్డది. విశ్వనాథ ముందుగనే తన రాముణ్ణి వెకిలిరాముణ్ణి చేసుకున్నాడు. సీతకూడా అతనికి తగిందే. ఇక శృంగారానికి లోటేముంటుంది? ప్రాచీన భారతీయతాపరిరక్షణ అనేపేరుతో యజ్ఞయాగాది కర్మకాండలూ, జప తపో ధ్యాన హోమాదులు, జన్మ పునర్జన్మలూ, అవతారములూ, జంతుబలులూ మొదలైన ఫల్గు విషయములకు ప్రాధాన్యత నిచ్చిన ఈ కవి కావ్యరచనకు ప్రాణభూతములైన ఈ మహోన్నత పాత్రలను ఎందుకిలా హననం చేస్తున్నాడో బోధపడదు. ఆధునిక కవులకు పాత్ర పోషణ అతిముఖ్యమైనది. వాల్మీకివంటి ప్రాచీకనకవి పాత్రచిత్రణకు తన సర్వస్వాన్నీ ధారపోయగా మనస్తత్వ విశ్లేషణాశ్లేషణలతో నిత్యనూతనంగా వెలుగొందుతున్న ఈ యుగంలో ఉండికూడ విశ్వనాథ పాత్రచిత్రణను ఇంత అవహేలన చేయడం సుఖప్రదమైన విషయం గాదు. రామాయణంలో ఈయన సీతారాముల శృంగారాన్ని కడవపోతగా గ్రుమ్మరించాడు అన్నా తప్పులేదు. ప్రబంధ నాయికానాయకులుగూడా వీరిముందు తీసికట్టు. ప్రబంధశృంగారంతోపాటు family శృంగారంకూడా జతవడి వికటాట్టహాసం చేస్తుంది. కైక ఒక చేటిలాగా వీ రిద్దరి మధ్యను. కైక అంటే పాఠకుల్లో ఎలాగూ అసహ్యభావం ఉంది కాబట్టి ఆమెను ఈ పనికే వినియోగించడంలో తప్పులేదని విశ్వనాథవారి అభిప్రాయమై ఉండవచ్చు. కాని రాముణ్ణి అడుగో రాము డంటుందట కైక. అప్పుడు సీత పర్వుగములు పెడుతుందట. ఇది చూచి కైక 'అడవికోడి కూసినట్లు నవ్వుతుం' దట. ఇదేనా కావ్యోచితమైన సభ్యశృంగారం? ఇంతటితో ఈ మహాకవి ఊరుకోలేదు.

"మెలతను సీతఁ గైక తన మేడలకుం గొనిపోయి మెచ్చుమే
రలుగ నలంకరించి యల రామునకుం బనియున్నయట్లు వా
ర్తలనిచి రామచంద్రుడునురా నొక పన్నకమాడి యిద్దరన్
గలియగ ద్రోసి నవ్వులనుగా గదితల్పులు మూసి తీసెడున్."

ఇది మహాదుర్భరమైన శృంగారం. కైక తల్లి. కొడుకునీ, కోడలినీ పెడగా త్రోస్తుంది. నవ్వులూ ఆపైన తలుపులు వేయడం, తీయడమున్నూ. ఈ కవికి రసోద్దీపనకొరకు తల్లులు దప్పితే ఇంకెవరూ దొరకలేదేమో. రాముడు ముగ్గురు తల్లుల గృహాల్లోకి వెళ్ళి చూస్తాడు, జానకి కనిపించుతుందేమోనని. కనిపించదు.

అడుగలేదు. సిగ్గు. లక్ష్మణుడుకూడా ఇలాగే చేస్తూవుంటాడా అనుకొని అంతటితో ఊరుకోక మేనమామ యింటివద్ద నున్న భరతశత్రుఘ్నులను గూర్చి కూడా ఇలా తలపోస్తాడు.

"తన మేనమామ భరతుని
గొని చనె శత్రుఘ్నుతోడ గోరిక వారున్
దనవలె సౌమిత్రియువలె
గనుదురొ భార్యలను దొంగకన్నుల తుదలన్."

సర్వాంతర్యామియైన రామచంద్రునకు పెద్ద సందేహమే కలిగింది. దొంగకన్నులతో తాను చూస్తూ ఉన్నట్లు భరతశత్రుఘ్నులు మాత్రం తమ భార్యలను చూస్తూ ఉండగూడదూ? నిజమే. విశ్వనాథ రామునకు ఈ సందేహం కలగడంలో అబ్బురంలేదు. అది అలా ఉంచుదాం. అసలిక్కడ రసవిరోధత్వం ఏర్పడ్డది. మనశ్శాస్త్రం కూడా దెబ్బతిన్నది. అన్నలు తమ్ములనూ, అక్కసెల్లెండ్రనూ సామ్యం దెచ్చుకునే ఊహ రతిస్థాయీ భావానికి పెద్ద వ్యాఘాతం. రసపరిపుష్టికి ఇలాంటి భావనలు దోహదం ఇవ్వవు సరిగదా క్షీరభాండంలో విషబిందువులు లాగా శృంగారప్రసార తరంగాల్ని కలచివేస్తాయి. హృదయానికి ముల్లులాగా గ్రుచ్చుకుంటాయి. ఇలాంటిదే ఇంకొకటి.

"విల్లు పట్టఁ గత్తి విసర నేర్చినదాది
తనదు నొడిని వీడి చనిన రామ
చంద్రవిరహదుఃఖసరణి కౌసల్యకు
సాటి చిన్నసీత లోటుదీర్చె."

కౌసల్య ఒడియొక్క లోటును సీత తీర్చిందట. ఇచ్చట శృంగారంలో వాత్సల్యం. వాత్సల్యంలో శృంగారం. ఈ రెండూ విరుద్ధ తత్వాలు సీత సంబంధమైన శృంగారంలో తల్లిని జొన్పడం ఎంత జుగుప్సాకరంగా ఉంది? ఇలాంటి పనులు ఈయన ఎందుకు చేస్తున్నాడు? దీనికి కారణం ఉంది. శృంగార ప్రసక్తిలో తల్లిని తీసుకవస్తే అది కొంచెం ఉదాత్తమైన, పవిత్రమైన శృంగారం అవుతుందని ఈయన అభిప్రాయం. రసంలో ఉదాత్తత చూపించడానికి ఈయన వేసుకున్న పెడదారులకు ఇంకొక ఉదాహరణ చూడండి.

రాము డనితరదృష్టితో సీతవంక చూస్తున్నాడు. ఆమెయొక్క మోమును, కన్నూ, ముక్కు తీరులను పరికిస్తున్నాడు. ఆమెలో జనకమహారాజుయొక్క పవిత్రరూపం కనిపించిందట. అప్పుడు ఆమెకు నమస్కరించబోయాడు. సీత

నవ్వింది. ఇదీ వీళ్ళ ప్రణయం పోకడ. ఇంతకీ ఈ కవి శృంగారంలో పవిత్రత తీసుకురావడానికే ఇలాంటి వికారాలు సృష్టిస్తున్నాడా? అసలు సీత రూపురేఖల్లో జనకుడు కనిపించడ మేమిటి? ఆమె నాగేటిచాలులో దొరికింది గదా! దీనికి కవి ఎలా సమాధానం చెప్పుతాడు? చాలా చిక్కుసమస్య. ఇంకా ముందుకు వద్దాం. సీతారాముల శృంగార కేళీవిహారాలు వసంతర్తువులో పెల్లుగా జరిగినాయి. ఇంతలో గ్రీష్మం వచ్చింది. గ్రీష్మంలో రామునకు రతిమీదా, తత్కారణంగా సీతమీదా విరక్తి కలుగుతుంది. పరుగుపరుగున వచ్చి వసిష్ఠమహర్షి కాళ్ళమీద పడి

"స్వామీ ప్రాణముకంటెఁ బ్రాణము ధరాజాతాముఖాంభోజమే
యేమోగా కనిపించు లోయెదదలో నింకున్ సమస్తావనీ
స్వామిత్వాదిక భావనావిషయవాంఛా పూర్ణపేశంతముల్
తామండించెడు గ్రీష్మ మెచ్చటిది? తాతా! నన్ను మన్నింపవే."

అని వేడుకొంటాడు. పాపం ఈ జీవుని వేదన ఎలా ఉంది? గ్రీష్మంలో విరక్తి గలగడం, భార్య నచ్చకపోవడం, వసిష్ఠుని దగ్గరకు వచ్చి వేదాంతం చెప్పమని ప్రాధేయపడి అడగడం, ఇదేనా మహాపురుషుల ప్రణయజీవనచర్య? ఇంతకంటే నిగూఢమైన, గంభీరమైన పద్ధతి ఈ కవికి దొరకదా? అతిసామాన్యులలో క్షణక్షణమూ మారుతున్న వ్యసనచ్ఛటలు తప్పితే రామునిలో ఉదాత్త ప్రణయ లక్షణాలే లేవా? ఈ రాముడు ధీరోదాత్తుడా! ధీరశాంతుడా! మరి ధీర లలితుడా! అంతకంటే ఒకమెట్టు దిగువా! గ్రీష్మంలో రత్యాదులయందు కలిగిన వైరాగ్యంతో పడనెట్టుకుంటూ వచ్చి వసిష్ఠుణ్ణి వేదాంతాన్ని గురించి కొన్ని ప్రశ్నలు వేయడంతోటే ధీరశాంతత చేకూరుతుందా! ఒక్టిది. ఒకచోట కుప్పగా కొంత వైరాగ్య వ్యాఖ్యానం చేసినంత మాత్రాన ఆ భావం, ఆ పాత్ర నిష్ఠం కాలేదు. పాత్రయొక్క ప్రతి కార్యాచరణలోనూ అది వ్యక్తం కావాలి. ముందు ఆ రకమైన భావస్థాయిత్వంలో కవి నిమగ్నత చెందాలి.

తద్వాసనా వాసితమైన అనుభూతి మాత్రమే పాత్రలకు రూపురేఖలు దిద్దుకుంటూపోవాలి. ఇది చాలా ఓపికతో చేయవలసినపని. విశ్వనాథలో ఏదిపడితే అది వ్రాసే ఓపికేగాని అది ఎలా వ్రాయలన్న ఓపికలేదు. ఆయన నిరంకుశత్వం ముందు కథ, రసం, పాత్రలూ, సీతారాములూ, ఒకటేమిటి? అంతా దెబ్బతిని చితికి చతికిలబడి చూస్తూ ఉండవలసిందే.

పాత్రగతములైన ఈరసానౌచిత్యాలతో పాటు ఈకవిలో ఇంకొక పెద్ద లోపం ఉంది. అదీ భాషకు సంబంధించింది. ఈయన భాష రసాధీనంకాక

ఎక్కడి కక్కడకు విరిగిపోయి సహృదయునకు అమితమైన ఏవగింపును కలిగిస్తుంది. ఈ క్రింది పంక్తులను పరికించండి. రాముడు ధనువును స్పర్శించి పైయంతస్తున స్త్రీల కదలికగని గుర్తుపట్టి తలయెత్తి చూచాడు అక్కడ సీత ఉంది. ఆమె

"ప్రాణముల్ బయటికివచ్చి ముగ్ధాకార
మెనయించి దర్శన మిచ్చినట్లు"

గా ఉందట. ప్రాణములు బయటికి రావడమేమిటి? ప్రాణములు లేచివచ్చుట నుడికారం. ఆ ప్రయోగంలో ఎంతో మమకారం వెల్లడి అవుతుంది. పదసారస్యం చూడని విశ్వనాథ ప్రాణములు లేచివచ్చుటకు బదులు 'ప్రాణములు బయటికి వచ్చుట' వాడి భాషా సౌష్ఠవాన్ని వికృతం చేసినాడు.

ఈ రామాయణంలోని ప్రధానపాత్రలిలా రసవిచ్ఛిత్తికరంగా ఉన్నాయి. పోతే అయోధ్యాకాండవరకు ప్రతినాయికాత్వం వహించిన కైక మంథర పాత్రల నిర్మాణ విధానాన్ని పరికించితే వాల్మీకికీ ఈయనకూ హస్తిమశకాంతరం లేదా కనిపిస్తుంది. కైకనూ, మంథరనూ ఒక్క క్షణకాలం అవాంతర ప్రతినాయికలుగా వాల్మీకి సృష్టించినాడు. వాల్మీకి దృష్టి కథా సంవిధానంమీద ఉంది. కథా సూత్రాన్ని ముందుకు వేగంగా ప్రసరింప జేయడానికి కథను ఒక పెద్ద మలుపుకు త్రిప్పవలసి వచ్చింది. ఒక మహాకార్యానికి మధ్యలో విఘ్నాన్ని ఆపాదింపజేసి తన లక్ష్యం వైపుకు కథను నడిపించుకోవాలి. అందువల్ల ఆయన తనచేతికి దొరికిన ఆ రెండు పాత్రలతో ఆపని చేయించినాడు. కైకనూ, మంథరనూ, ఆయన న్యూన పరచినా తనకు కావలసినంతవరకే. తరువాత వాళ్ళను పట్టించుకోకుండా ముందుకు సాగి పోయినాడు. అంతకు మించి ఆ మహాకవికి ఆ పాత్రలలోని నైచ్యం చూపాలన్న ఉద్దేశ్యమే లేదు. మహాకవు లెప్పుడూ ఇటువంటి పట్టుల తమ పాత్రలయెడ నిర్లిప్తులుగానూ, సాక్షీభూతులుగానే ఉంటారు. మహాకార్యసాధనోద్దేశ్యమే కాని వారికి పాత్రలయెడ వ్యక్తిగత రాగద్వేషము లుండవు. కాని విశ్వనాథ ఈ పాత్రలను చెడగొట్టడానికి బాలకాండ దగ్గరనుంచే పనిగట్టుక కూర్చున్నాడు. ఈ రామాయణంలో మంథర కైకలయెడ విశ్వనాథవైఖరి ఆజన్మ శత్రుత్వమువలె నున్నది. మంథర వ్యక్తిగాదు. క్లిశ్యమానమైన యొక జాతికి ప్రాతినిధ్యం వహించు దాసి. రాజకుటుంబంలోని ఈ దానిస నిజానికి ఆధునికయుగకవికి అంత నీచురాలుగా కనిపించగూడదు. కొంచెం ప్రయత్నించితే ఆధునిక పాఠకుల్లో మంథరపట్ల

సహానుభూతికూడా కలిగించవచ్చునేమో. ఇంత సుదూరకల్పన విశ్వనాథ ఊహకు అందరానిది, వదలివేస్తున్నాను.

ఇచ్చట రసవిషయంలో పాత్రప్రసక్తి వచ్చింది. ఇది తప్పదు. పాత్రలకూ రసమునకూ అవినాభావ మున్నది. భారతీయులకు రసోత్పత్తియెడ, పాశ్చాత్యులకు పాత్రచిత్రణయెడ దృష్టి. పాశ్చాత్యులయొక్క పాత్రల వికాసమును పరాకాష్ఠ నొందించి కవి ఉద్దేశ్యములో దానిని పర్యవసింప జేయుట, భారతీయులయొక్క ఆలంబనగతములైన అనుభావ సంచారీ భావములను ఉద్దీప్తపఱచి రసస్థాయికి దెచ్చుట రెండునూ ఒకటే. రసోద్దీపనకార్యములో పాశ్చాత్యుల వాతావరణ సంయోజన మున్నది. పాత్రలనగా లోకములోని వ్యక్తిత్వములవంటి కావ్యవ్యక్తిత్వములే గదా ! వ్యక్తియొక్క కొన్ని చేష్టల, గుణముల, భావములయొక్క కలయికలే పాత్రలు. అపరిపక్వ రసరూపములో ఉన్న విడివిడి మొత్తములు.

ఈ మొత్తములు కథా ప్రసారములో ఘాత ప్రతిఘాతములద్వారా ఒకదాని నొకటి ఒరసికొనును. ఒక వర్గములో అధికారములతోడి ఆనుషంగికము లొకమొత్తమై కలసి ప్రతిపక్షములోని విరుద్ధ శక్తులతో పెనగుచూ కల్లోలములో మునిగి తేలుచుండ కవి చేయూతనొసగి తన అభీష్టపాత్రలను లేవనెత్తికొనును. ఇది భారతీయులలో అసంలక్ష్యక్రమముతో సాగుతున్న స్థాయీభావముల ఉద్బోధ. పాశ్చాత్యులకు పాత్రోన్మీలనాగతమైన కథాప్రసారగతియందునే ఇది మునింగి యున్నది. పాత్రల స్వరూపనిర్ణయము పాశ్చాత్యులకు కథా ప్రసారముతో కలిసి యుండును. ఇది భారతీయులకు ఇతివృత్తగతమై పూర్వమే సంపాదితమై యుండును. లోకప్రసిద్ధములైన ఇతివృత్తములతోపాటు యౌగపద్యముగా పాత్రలను సేకరించుకొని యుండుటవలన భారతీయులకు పునఃపాత్రసృష్టిక్లేశము తప్పి తరువాతి కావ్యవ్యాపారమంతయు రసపరముగనే గ్రహింపబడును. దీనికి భిన్నముగా పాత్రోన్మీలనముతో కథను దీర్ఘీకరించుకొను పాశ్చాత్యులసిద్ధాంతము అదనపు క్లేశమును వహించి పాఠకునకు మరింత ఔత్సుక్యము నిచ్చు సౌకర్యమును కలుగజేసినది. పాత్రల కార్యవిధానముయొక్క అనుత్ప్రేక్ష్యతవలన కలుగు ఔత్సుక్యమునేకాక పాత్రల నిర్మాణ విషయకమైన అనుత్ప్రేక్ష్యతవలన కలుగు ఔత్కంఠ్యమునుకూడ పాశ్చాత్య పాఠకుడు పొందుచున్నాడు. దీనివలన ఇంకొక లాభముకూడ కలుగుచున్నది. చర్వితలోకవృత్తములనేగాక క్రొత్త వృత్తములనుగూడ చర్వ్యమాణ మొనరింపగలిగిన సామర్థ్యము ఈ సిద్ధాంతమున గలదు. రసాత్మకవాక్య సిద్ధాంతమువలన ఈ పని జరుగదు. Poety is an inter-

pretation of life through imagination and emotion. ఇది పాశ్చాత్యుల కవితాస్వరూపము. జీవన వ్యాఖ్యానమే కవిత. పూర్వనిశ్చిత - ఇతివృత్తగతములైన మన ప్రసిద్ధపాత్రలలో జీవనసంస్మరణమే తప్ప జీవనవ్యాఖ్యాన ముండదు. స్మృతిజ్ఞానమును ఉద్బుద్ధ మొనరించుటయే రసము. సామాజికునిలోని ప్రాక్తన సంస్కారమును ఉద్దీప్తపఱచుటయే రసోద్దేశ్యము కాబట్టి నాయకవ్యవస్థ ఎంత సంప్రదాయబద్ధమైన భారతీయకవికి అంత సుఖము. కాని పాశ్చాత్యకవికి జీవితము ముందు పరుగిడుచున్న తీరులలోని రామణీయకతయే పరమార్థము. ఒకటి వ్యవస్థా ప్రధానము, రెండవది క్షణక్షణనవ్యతా ప్రధానము. అందువలన భారతీయులలోని రమణీయార్థ ప్రతిపాదకత, రీతిధ్వనివాదములు పాశ్చాత్యులకు దగ్గరలో నుండును. మొత్తముమీద పాత్రలయొక్క ఉత్థానపతనముల మీదనుండి వచ్చు "Art of uniting pleasure" పాశ్చాత్యులకు కూడా కవిత కాబట్టి చివరిమెట్టులో వీరు రసవాదులతో కలియుచున్నారు. రసము, పాత్రలకు ఇట్లు గాఢమైన సంబంధమున్నది.

ఇంతవరకు చెప్పినవన్నీ కావ్య తత్వాల్లో వచ్చిన ప్రధాన లోపాలు. ఈయన శిల్ప విషయంలో కొందరికి మహా అమితమైన భక్తి ఉంది. ఈశిల్పం నిత్య నూతనమై బహుముఖమైన ఈయన ఉపజ్ఞలోంచి అతి స్వేచ్ఛగానూ దుర్వారమైన శక్తితోనూ ప్రభవించి సాహిత్యంలో ఎప్పటికప్పుడు క్రొత్త పుంతలు త్రొక్కుతుందని పలువురి భావన. నిజంగానే ఈ శిల్పం అంత శక్తమైందా? స్థూలంగాచూస్తే అలాతోస్తుంది కాని కొంచెం లోతుకుదిగి నిగూఢంగా పరిశీలిస్తే పైచెప్పిన సుగుణాలు ఏమీ కనిపించవు. ఈయనకూ ఈయన పాఠకులకుకూడా అది అతి క్లేశసాధ్యమైంది. ఈయన శిల్పసుందరి అతి కర్కశమైన ఈయన శబ్ద సమాసోపగూహనంలో ఇరికి సైరంధ్రిలాగా చాలాసేపు పెనుగులాడి చివరకు ఎలాగో బయటపడుతుంది. ఈయన శిల్పాన్ని తెలియజేయడానికి ఈక్రింది కొన్ని ఉదాహరణములు ఈయన ఊహలనుంచి, భావనా పరిశీలనలనుంచి, అభిప్రాయములనుంచి, అభివ్యక్తులనుంచీ ఇస్తున్నాను.

ఇవి ఎంత అసమర్థములైనవో నిరూపితములు ఎలాగూ అవుతవి. అంతే కాకుండా వీటిలోని ఈ అసామర్థ్యాన్ని కప్పిపుచ్చడానికి ఈయన తన పాండిత్య ప్రకర్షను ఎలా వినియోగించుకుంటున్నాడో తద్వారా పాఠకుణ్ణి ఎంత గుంభనగా ప్రతారణ చేస్తున్నాడో కూడా వ్యక్తమౌతుంది.

వసంత ఋతువులో ఒక పూలతావి వధూ సంగమానందాన్ని ఒలకబోసు కుంది. అది నవ్వువలె వికసించిందట. ఇంతవరకు బాగానేఉంది. పుష్పాన్ని నవ్వుతో ఉపమించడం అందంగా ఉంటుంది. ఇంతటితో తృప్తి పొందకపోతే కవి ఆ నవ్వు ఎలాంటిదో చెప్పడానికి ఒక చిన్న విశేషణం వేసికొనవచ్చును. తప్పులేదు. కాని ఆనవ్వు ఇలాంటిది అని చెప్పడానికి ముందు ప్రపంచాన్ని ఎత్తుకొని దాంట్లో ఇద్దరు ప్రేయసీ ప్రియుల్ని ఎత్తుకొని వాళ్ళకు శృంగార చేష్టలు కల్పించి అందులో ఒకరికి సిగ్గువస్తే అది అణచుకోలేక ఒకనవ్వు బయటికి వచ్చింది అనుకోండి. ఆనవ్వుతో పువ్వును పోల్చుకుంటే ఎలా ఉంటుంది? దగ్గరలోనున్న ఒక ఉపమానాన్ని స్పర్శించీ స్పర్శించక, నునువ్రేళ్ళతో అందించుకొని సురుచిరమైన కల్పనతో సరళంగా ఇచ్చివేయగల ప్రతిభ ఈయనలోలేని కారణంగా చిత్రపద్ధతిని ఆశ్రయించి కావ్యగురుత్వం వ్యర్థపరచుకుంటాడు. సామ్యప్రసారం ఎంతవరకు ఉంటుంది అనేది కవి స్పర్శేంద్రియానికి గోచరించాలి. ఉపమానానికి కొంత maximum power ఉంటుంది. అది నశించిన తరువాత ఒక్క అడుగుకూడా అది ముందుకు వేయలేదు బలవంతాన వేయిస్తే నీరసిస్తుంది. దస్సిపోతుంది. కాని విశ్వనాథ అక్కడితో ఊరుకోక తనకున్న సమాస బలంతో ఇంకా ఇంకా ముందుకు లాక్కొని పోతాడు. ఆనవ్వును ఈయన యిలా యిలా పెంచాడు.

"ప్రథమ చేలాంచల స్పర్శవేళా భయా
పనయనాంతర నర్మ భాషణముల
సిగ్గుచే నదిమి హెచ్చినఁ బట్టుకోరాక
రువ్వగా వెలలిన నవ్వువోలె"

అంటే దీనికి అదే అర్థం. ఒక ప్రియుడు ఒక ప్రియురాలియొక్క చేలాంచలం పట్టుకోబోతే దానివల్ల ఆవిడకు భయంకలిగితే దానిని పోగొట్టడానికి ఏవో నర్మ భాషణములు పలికితే ఆపైన సిగ్గువస్తే దానిని అదిమిపట్టుకోలేక ఒక నవ్వు వచ్చింది. ఆ నవ్వులాగా పూలతావి ఉంది. దీనికి ఇంత పెద్ద కర్మకాండ దేనికి? ఈ వర్ణన ప్రేయసీప్రియుల ప్రేమకలాపాలు వర్ణించే ఘట్టంలో ఉంటే ఎంత బాగుంటుంది! కాని మళ్లీ ఈయన ఆ సందర్భంలో ఇలాంటివర్ణన ఇవ్వడు. పూవుకు వేసుకోవడంవల్ల ఈ వర్ణన అంతా మొత్తం అప్రస్తుతం అయిపోయింది.

మరొక్కసారి ఈయన వాస్తవికంనుండి బయటపడితే పురాణకల్పనల మీదకు వెళతాడు. అక్కడ ఏదో పరిశీలన చేస్తున్నట్టు కనిపించుతాడు. చివరకు

అదీ దూరారూఢమైంది, అసంగతమైందిగానే వెలువడుతుంది. ఈయన పరిశీలనా జ్ఞానము జీవితమునకు దగ్గరగానూ ఉండదు, జీవితమునకు ఉపయోగపడనూ పడదు. శ్రీ మహావిష్ణువునకు శేషభోగి అంతమెత్తగా పూలపాన్పులా ఎలా అమరుతుందో ఈయన పరిశీలించి చెబుతున్నాడు.

"ఊనిన మేనిపై బొడుపులొత్తని మెత్తని క్రిందిపొట్ట పై
గా నొనరించి శ్రీవిభునికాయము కందని యట్లు చూచు."

ఆశేషభోగికి పైన బొడుపులుగా ఉంటుంది కాబట్టి క్రింది పొట్ట పైకి వచ్చే టట్లు మెత్తగాచేసి ఆయన్ను పడుకోపెట్టుకుంటుందట. నిజంగా ఆ సర్పము మన సర్పాల్లాగానే ఉంటే అది ఎలా పడుకోబెట్టుకున్నా ఒళ్ళు గరపొడుస్తుంది. కాక దేవతాసర్పమైతే విశ్వనాథవారి ఇంతమంచి ఊహము వ్యర్థమౌతుంది.

ఒక మధురమైన భావాన్ని సుఖంగా అభివ్యక్తం చేయలేనికారణంగా ఒకొ కప్పుడు ఈయన పద్యంలో శబ్దవ్యాయామం తప్పితే ఏమీ దక్కదు. కౌసల్య రామునకు పాలు ఇస్తుంది. ఇది పాలధారావర్ణన.

"కౌసల్య యెదదలో గరడు కరడు
లై పొంగు లొలయు పయస్స్వాదు నిర్జర
నిర్ఝర ధారలు నిక్కి నిక్కి"

ఈమె యెదదలో పాలుకరళ్ళు కరళ్ళుగా పొంగుతున్నాయి. అవి మళ్ళీ సంస్కృత సమాసంలో పయస్స్వాదు నిర్జర నిర్ఝరధారలు. శిశువాత్సల్యంలో స్నిగ్ధంగా స్రవించేపాలు. వీటికి కరళ్ళను ఉపయోగించి నిర్జర నిర్ఝర శబ్దాలను ఉపయోగించి ఒక మధురమైన భావాన్ని హననం చేయడం తప్పితే ఏముంది? అభివ్యంజనా లాఘవం లేకపోవడమే దీనిలోని పెద్దలోపం.

ఇక ఈయన అభిప్రాయాలు ఎంత ప్రతిగామి దృక్పథంతో కూడినవో చూడాలి. గత జన్మసంబంధములను తెల్పు సిద్ధాంతాలమీది మమకారము ఈయ నకు మిక్కుటముగా నున్నది. ఈ సంబంధము జీవసంపుటిలోని అంతర్వాహిని అనీ, ఈ స్పర్శ గుణముచేతనే సచరాచరజగత్తు పరస్పరానుబద్ధమై ఈశ్వరేచ్ఛా సంచాలితమై తిరుగుతూ ఉంటుందనీ, ఇదే ఈయన అంతఃప్రేరణ అనీ పలుపురి నమ్మిక. ఈ నమ్మిక వ్యక్తిగతమైన మేరకు చిక్కులేదుగాని దీన్ని కావ్యపరం చేసి సమష్టికి అందించ బోవునపుడు ఇట్టి సిద్ధాంతముల ప్రభావములయొక్క పరి ణామములనూ వీటిమంచిచెడ్డలనూ ఆలోచించవలసి యున్నది. భక్తునకు కొన్ని నమ్మకములుండవచ్చును. ప్రమాదము లేదు. కాని కవి సంఘజీవి. కవి వ్యక్తి

త్వము వీథిమానిసి వ్యక్తిత్వమునకు మించినది. అతనిని శాసించునది. అతనిని పురోగమింపజేయునది. ఈ దృష్టితో విశ్వనాథయొక్క జన్మ - సాంగత్యముల గురించిన అభిప్రాయములను వంశము - పరిస్థితులు అన్న ఆధునిక శాస్త్రీయ సిద్ధాంతములతో పోల్చి చూడవలసియున్నది. జన్మ - సాంగత్యములు భారతీయ ధార్మిక సిద్ధాంతములు. వీటికి 'పారంపర్యము - పరిసరములు' అన్నవి పూర్తిగా భిన్నములు. వంశపారంపర్య సిద్ధాంతము మానవజాతి వికాసమును సూచించునది. మొట్టమొదటి మానవుడు తన పరిసరములతోడ కలియుచు ఎన్నియో దశాంతరములనుదాటి యీస్థితిని సమీపించిన వికాసమును అది నిరూపించుచున్నది. కాని జన్మసిద్ధాంతము సమస్త మానవజాతి వికాసమును పరిశీలించక విశిష్ట జాతి వ్యక్తులనుండి తజ్జాతి జన్యులకు సంక్రమించు గుణదోషములను పరామృశించును. శాస్త్రీయ సిద్ధాంతములోని మార్పు గుణాత్మకమైనదేగాని ఆమార్పు వచ్చు పద్ధతి, దానిస్వరూపము వేరు. అది జీవకణములకు సంబంధించిన దగుట వలన దాని పరిణామములు అదృష్ట శక్తులమీద ఆధారపడియుండక భౌతిక తత్వములతో మిశితము లగుచుండును. కాని ధార్మిక సిద్ధాంతమునకు ఇవన్నియూ అవసరములేదు. ధార్మిక సిద్ధాంతమునుబట్టి మానవునకు సంక్రమించు గుణదోషములు కర్మబంధనములతో కూడిన పాప పుణ్యములు. ఇవి జన్మగతములు జన్మ జాతిగతము, జాతి ఈశ్వరేచ్ఛాగతము. ఇట్లు ఈ సిద్ధాంతముయొక్క ఆగమ నిర్గమము లన్నియు ఆత్మవాదముమీద ఆధారపడి వస్తుసత్తాకమైన మనుష్యుని మిథ్యాజీవిగ చేసివైచినవి. జీవునకు పుణ్యము సత్సాంగత్యము వలననూ పాపము దుస్సాంగత్యము వలనూ కలుగును. మనుష్యుని పాపి లేక పుణ్యవంతునిగ చేయుటకే ఈసిద్ధాంత మెక్కువ దోహద మీయగలదు. పుణ్యవంతుడు - పాపి అనుదశను దాటి మంచి - చెడు అను నైతికస్థాయినికూడ అధిగమించి కేవలము పరిస్థితివలన మార్పుచెందుచూ వ్యవహారమాత్ర లక్షితుడైన వ్యక్తినివ్యక్తిగా చూచు నేటి యుగమున ఈజన్మ సిద్ధాంతము శిథిలప్రాయమై తనపాత్రను చాలించినది. కారణ జన్ములమని అనుకొన్న కొందరి పుణ్యాత్ముల ఊహలలోనే కొన ప్రాణములతో జీవించుచూ వింతవింత వైఖరులను వెలయించుచున్నది. ఈయన కైకయొక్క సత్వరజస్తమోగుణముల కారణములను వివరించ దలచుకొనినాడు. అసలు కైక మంచిదే. కేవలము సాహచర్య దోషమువలన చెడిపోయినది. ఈమెతండ్రియైన కేకయరాజు సత్వగుణ ప్రధానుడు. కాబట్టి ఆయన రక్త ప్రవాహములు ఈమె సిరలలో ప్రవహించి తెలియరానిపట్టుల ఈమె భావములలో

దాగికొని ఈమె ఊహలలో బయలుపడుచున్నవి. ఈ జీర్ణభావమును నగ్నముగా వెలువరించిన కాలము సహించదని గ్రహించిన విశ్వనాథ అతి గభీరమైన భాషలో గోప్యముగా దీనిని వెల్లడించుచున్నాడు. ఆపద్యము ఇది.

"ఆ వనితా సిరాపథములం దెసలారుట(జేసి జన్మతో(
గేవల సత్వమూర్తియగు కేకయనాథు నసృక్ప్రవాహముల్
భావములోపలన్ దెలియబట్టని చోటుల మూలసత్త్వగం
ధావలితంబులై పరిణతాకృతి భద్రములౌ తదూహలన్."

ఈ పద్యము మొదట చదవగనే ఏదో మహా సిద్ధాంతమును కవి ప్రతిపాదించ బోవుచున్నాడు అనే భ్రాంతి కలుగును. కాని తీరా చూచిన ఈమూలసత్త్వ గంధావలితంపు టూహలలో ప్రాతకాలపు గంధముతప్ప మరేమియు కానరాదు. ఈకవి ఇలా ప్రగల్భ శబ్ద సంకలనముతో పాఠకుని ప్రతారణ చేయుచుండును. ఇంతేకాదు. ఈమానవ పురోగతినీ, వైజ్ఞానిక స్థాయినీ, ఈ సర్వతోముఖ చైతన్యమునూ, ఒక్క ఉదుటున మాపుచేయవలెనన్న ప్రబలకాంక్ష ఈయనలో వ్యక్తమగుచున్నది. ఈమానవ పురోగతిలో ఏమీ పొరపొచ్చెములు లేవని నేను చెప్పడంలేదు. ఎప్పుడూ దోషాలు ఉంటాయి. కాని జీవితం ఒక మలుపుకు తిరిగిన తరువాత అక్కణ్ణుంచే దానివేగాన్ని మనం అధ్యయనం చేస్తూ ఉండాలి. అక్కడ దొరికిన క్రొత్తలను, జీవిత సత్యాలనూ సంతరించుకొంటూ పోవాలి. ఈవిశాల సృష్టిలో ఈ ప్రవాహ సంక్షుభితమైన జీవితంలో ఎక్కడి కక్కడే మంచి చెడులు ఉంటవిగదా. అలాకాక ఈ యుగవేగాన్ని వెనక్కు త్రిప్ప సాహసించి మనం చేయగలిగినది ఏమీలేదు. ఆ రథచక్రాలు మనను త్రోసుక మరీ పోతాయి.

## అన్యకవి పరంపరలమీద అనుచిత ప్రహారాలు (ఫీల్సు)

నవ్యత కవిలక్షణము. ప్రాతనుంచి క్రొత్తను విరియింపజేయుటకు మారు పేరు కళ. కావ్యకళలో నూత్న స్ఫురణను మొలకరింప జేయడము ప్రతిభాశాలి యైన కవికే సాధ్యపడును. ఒక అనుభూతి, దానితో సద్యః ప్రసూతమైన ఒక ఉద్భావన, దానిని వ్యక్తీకరించుటలో సుఖదమైనశైలి ఇవి కావ్యకలనకు హేతువులు. శక్తీ, ప్రతిభా, వ్యుత్పత్తుల సమ్మిశ్రణములో ఈనవ్యత సాక్షాత్కరించును. పూర్వ సంప్రదాయముల చేర్పు కూర్పులతో అకృతకమైనరామణీయకతను పరిసర చైతన్య భూములనుండి గ్రహించుటయే నవ్యత. నవ్యత చిద్రూపము. మానవుని

ఉషస్సంధ్యాంతముల అలమికొనిన తమశ్ఛటలలో మిణుగురువలె మెఱయు చున్నదే చిత్తు. అదే రామణీయకత. కవిలోని జ్యోతిర్లేఖ. "క్షణేక్షణే యన్నవ ముపైతి, తదేవ రూపం రమణీయతాయాః" అని మన ఆచార్యులు నుడివి నారు. "నవ్యార్థ యుక్త్యుద్భోధ విధాయినీ స్ఫురంతీ సత్కవే ర్బుద్ధిః, ప్రతిభా సర్వతోముఖీ' అని సమన్వయింపబడినది. ఇదే ప్రసన్న కథాకలితార్థయుక్తి. ఈ నవ్యతను యాదృచ్ఛికంగా తేగలిగిన కవి స్తుత్యుడు. అలాకాక బలవంతంగా అది సిద్ధించితే నవ్యతపేర వికృతి అవుతుంది. విశ్వనాథ తెలుగుకవితా సంప్రదాయ ములను అధ్యయనం చేసిన వ్యక్తి. కాని వీటితో అనుస్యూతమైన భేదాభేదాత్మక మైన సుఖదశైలి (happy expression) ఈయనకు పట్టుపడలేదు. ఆయా సంప్ర దాయాలను మించిపోవుదమన్న ఈయన ఉత్కంఠ ఆ సంప్రదాయముల తత్వ ములతో నొరసికొనుచు ద్విధాశకలమై రెంటికిని కాకుండ పోవును. ఇది ఆ సంప్ర దాయములమీద ఆయన చేయు అనుచిత ప్రహారము అని నా భావన. ముందు పురాణవిషయములనే పరిశీలింతము.

పురాణ సంప్రదాయము ఈయనలో ఎక్కువగా జీర్ణించినది. పురాణ సిద్ధాంతమే ఈయన అభిమాన విషయము కాబట్టి దీనిని క్రొత్తప్రాతల మేలు కలయికలకు వ్యంజనముగా ఉపయోగింప జూచుచున్నాడు. రామాయణరచనా సంకల్పములోని రహస్యముకూడ ఇదియే. రామాయణములో పురాణతత్త్వముల మేరకు ఈయన అచ్చగా పౌరాణికునివలె కనిపించవచ్చును. కాని కాలప్రవాహ వశమున కొన్ని క్రొత్తగాలులు నాసాపుటముల నిండిన కారణమున ఒక నవ్యతా వేశమువచ్చి ఈయన కవికర్మలో కషాయతిక్తముగా కలిసిపోయినది. మొత్తము మీద పౌరాణికశైలి ఈయనను సరసకవిగా చేయలేదు. ప్రగల్భకవిగా చేసెనన్న అదియును లేదు. ప్రగల్భత్వపుటాభాస మాత్రమే ఎడనెడ కన్పించును. ఏలనన ఈయన ప్రాగల్భ్యము శైలికి సంబంధించినదే గాని విషయమునకు సంబంధించి నది కాదు. పౌరాణికతలో నవ్యతనూ, నవ్యతలో పౌరాణికతనూ, కృతకముగా అల్లివేయు సామర్థ్యము ఈయనలో ఉన్నది.

పౌరాణికశైలిలోని ముఖ్యగుణము సంస్కృతీకరణము. పురాణయుగంలో సంస్కృతప్రభావం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, శబ్దంమీదా, వాక్యంమీదా, చాలా ఉన్నది. ప్రత్యక్షంగా శబ్దాల్లోనూ, సమాసాల్లోనూ కనిపించితే, పరోక్షంగా సంస్కృతవాక్య విన్యాసాన్ని పోలినరీతిగా కూర్చుకున్న తెలుగు వాక్యరూపంలో ఉండేది. తిక్కన్నలో "బుద్ధికిరా నుచితంబుతోడి మెల్పున" "పాపము రాకునికికి

గతమైన పలుకులు" "మననుం దెఱఁగేది యునికి" లాంటి ఉదాహరణలు చాలా ఉన్నవి.

ఆ కాలంలో తెలుగుభాష యిప్పటివలె పరిపక్వతను పొందలేదు కాబట్టి సంస్కృతీయం చేయడం సర్వథా అవసరమై పోయింది. కాని ఈ పద్ధతి నేడు రుచించదు. సంస్కృతంలో వాక్యార్థబోధను విశేషణాంతంగా చేయడంలో చాలా సొగసు ఉంటుంది. సంస్కృత విశేషణాల్లో ఆశక్తి ఉంది. రకరకాలైన విశేషణ వాక్యాలు అర్థాన్ని మోసుకువచ్చి వాక్యాశయంమీద వదలుతాయి. ఇది సంస్కృత భాషకు సహజము. కాని తెలుగులో ఇలాంటి ప్రయోగాలు చేస్తే పద్యం అంతా ఎక్కడికక్కడికి చుమ్మలు చుట్టుకుపోతుంది. భావోన్మేషము కలుగదు. విశ్వనాథ తాను చేసే దీర్ఘసమాసాలు చాలవా అన్నట్లు ఇలాంటి విశేషణాంతాలు కూడా పెల్లుగా చేస్తాడు.

"అరథమేగు త్రోవ" అన్న పద్యంలో రథంతోపాటు జలదావళి కూడా వెళ్ళిన వర్ణన ఉంది. అది "రథనేమినిస్వన స్ఫోరక హేతువై యుఱుముచున్ వెనుకన్ దెసలన్ బ్రపాతధారా రమణీయవాఃకణధురా పరితర్పితదేశమై చనెన్" రథము పరితర్పిత దేశమై వెళ్ళింది. ఇది విశేషణాంతం. మేఘం వెళ్ళిన పద్ధతి అంతా విశేషణాల్లోనూ, పెద్దపెద్ద సమాసాల్లోనూ ఉంది. ఇది చాలా నలిగిన వర్ణన. దీన్ని విరిచి తెలుగుమాటల్లో ఇవ్వరాదూ? వీల్లేదు. అలా యిస్తే అందరికీ సులభంగా తెలుస్తుంది. కాబట్టి ఈ చర్విత భావానికి ఇలా శబ్దాలతో ఆడంబరం కల్పించడం అవసరం. ఇది ఒక రకంగా పౌరాణిక శైలితో ఘర్షణపడటం.

ఏ నామవాచకాన్నైనా క్రియావిశేషణంగా చేసి అందంగా చూపెట్టే పద్ధతికూడా సంస్కృతంలో ఉంది. పురాణకవులు ఇలాంటివి చాలా చేశారు. కాని కొన్నిచోట్ల తప్పితే అవి అంతగా రాణించవు. విశ్వనాథమాత్రం వాటి అందం, ఆనందం ఏమీ పట్టించుకోకుండా యథాసాహసం అవి చేసివేస్తాడు. "కలియగద్రోసి నవ్వులునుగా గదితల్పులు మూసి తీసెడున్" 'నవ్వులునుగా' అనేది చూస్తే నిజంగానే నవ్వువస్తుంది. ఈ ఘట్టంకూడా అలాంటిదే అనుకోండి. తెలుగులో సంబంధ సూచక సర్వనామములేదు. సంస్కృతంలో ఉంది. యత్-తత్‌ల ప్రయోగంలో ఒకానొకప్పుడు వాక్యంమీద పడుతున్న బలాఘాతంవల్ల భావం కొట్టొచ్చినట్లు కనుపడుతుంది. తెలుగులో ఈ సర్వనామము లేకపోవడం వల్ల ఎవడు అన్న ప్రశ్నార్థకాన్నే సంబంధబోధకంగా మలచుకుంటారు. సంస్కృతంనుంచి పురాణాలను అనువాదం చేసుకునేటప్పుడు అలాంటి ప్రయో

గాలు తప్పనిసరి అయేవి. ఒక్కొక్క సమయంలో ఈ ప్రయోగం కొంచెం ఎబ్బెట్టుగా ఉన్నా చాలాచోట్ల ఇది అందం తెచ్చింది. 'ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల' అని చెప్పి చివరకు 'వానినాత్మ' అన్నప్పుడు విధేయాంశంమీద పడుతున్న బరువు కవి ఆశయాన్ని శక్తివంతంగా ద్యోతకం చేస్తుంది. పోతనవంటి పదవాక్యశైలీ సారజ్ఞుల చేతుల్లో ఈ ప్రయోగాలు క్రొత్తవింతల చెలువొందినాయి. కాని కొందరు వాటిని పురాణఫక్కీలో 'ఎవడు మహాబలవంతుడో, ఎవడు మహా గుణవంతుడో' అన్నట్లు వాసి, తెలుగు సౌష్ఠవాన్ని వికృతం చేశారు. విశ్వనాథ ప్రయోగం కూడా అప్పుడప్పుడు ఈ ఫక్కీలోనే ఉంటుంది.

"ఎవఁ డహ్హృష్టుఁడొ వాఁడు నెవఁ డతుష్టుడొ వాఁడు
నేరు తుష్టాదనుల్ కారొ వారు"

పురాణాల్లోని ఇలాంటి ప్రయోగాలు ఈయన చేయడం దేనికి? పురాణాల్లో అలా ఉంటుంది కాబట్టి తానుకూడా అలాచేస్తే కావ్యానికి ఒక రకమైన పెద్దరికం లభిస్తుంది. ఈయన అనువాదంకూడా చేయడంలేదు. ఇంతశ్రమ దేనికి?

మరొక్కచోట అతి వ్యావహారికమైన శైలితో పౌరాణికం జోడింపబడుతుంది. పేలవమైన భాషతో పద్యం నడిచి మళ్ళీ అతి కర్కశమైన గ్రాంథికంతో కుదుపుతుంటుంది. "అసలు చక్కగ దీర్చిరావీథు లవనిపుం డరుదెంచెనని యుబ్బివిరిసె నొక్కొ" ఇక్కడ "అసలు చక్కగ దీర్చిరావీథులు" ఇంతవరకు వ్యావహారికస్థాయి. తరువాత అవనిపుండు. అవనిపశబ్దం. దానికి సున్న జేర్చి పుండుజేసి తరువాత ఉత్తునకు సంధిజేసి ఆపై ఉబ్బి విరియుట—ఇది ఘోరమైన గ్రాంథికం.

"రాజుదునో నేను రాజనో తడికట్టె
దడికట్టెయును లేక తప్పనపుడు
మరలనందున దక్కువ మండుటయును
వనట నెక్కువ మండుట పనికిరాదు"

వీటిలోని రాజుదును తడికట్టె మొదలైన పదాలు వ్యావహారికాలు. వీటితోపాటు యును అన్న సముచ్చయము, వనట మొదలైన పదాలు కలసి వాక్యాన్ని ఎగుడు దిగుడుగా చేసివేసినాయి. కేవలం గణపూర్తికి ఈ 'యు, ను' లు తీసుకురాబడ్డాయి. కాకపోతే 'వనట నెక్కువ మండుట' దగ్గర తప్పనిసరిగా 'యును' ఉండాలి. కాని అక్కడలేదు. అలాగే 'అంగళ్ళలోన క్రయ్యంబులు' అన్న ప్రయోగాలు ఈయనయొక్క శబ్దమైత్రి లేమిని వ్యక్తం చేస్తుంటాయి.

మరొక్కచోట ఈయన అతి సామాజికమైన భావాన్ని తీసుకొని గ్రాంథికంతో బిగించివేసి పాఠకులకు అతికష్టపు ఆనందాన్ని ఇస్తాడు. ఈ క్రింది పద్యంలో కౌసల్య రాముని సంలాప మాధుర్యాన్ని చూరగొంటుంది. పద్యం బాలభాషలో నడిచింది. కాని ఆనడక తీరును గమనించండి.

"తానో 'లాములు' తండ్రి పేరెవరయా 'దాచాతమాలాలు' నౌ
లే నా పేరన నమ్మగాలనగ నోలిం దల్లి 'కౌసల్య తం
డ్రీ!' నాగా ననబోయి రాక కసులన్ నీర్వెట్టఁ 'గౌసల్య నే
గానే కానులె యమ్మనే' యని ప్రభున్ కౌసల్య ముద్దాడెడిన్"

ఇక్కడ కవి ఒక మధురమైన వాగ్గుళుచ్ఛాన్ని ఎన్నో పీటముళ్ళువేసి బంధించినాడు. 'నాపేరన' 'అమ్మగాలనగ' తల్లి 'కౌసల్య తండ్రీ!' నాగా ననబోయి 'అమ్మనేయని"—ఈ గ్రంథిని Direct speech గా విప్పితే తల్లీ కొడుకుల మధ్య ఒక చిన్న సంభాషణ అవుతుంది. మామూలు సంభాషణగాదు. ఆశ్చర్య బోధకాలతో కూడిన మధురమైన సంభాషణ. దీంట్లో భావ శబలతగూడ ఉంది. కౌసల్య తండ్రీ! అన్నచోట మంచి విరుపుకూడా వస్తుంది, ఇవన్నీ ఈపద్యానికి చెందిన సుగుణాలు. కాని వ్యక్తీకరణ Presentation దృష్టితో చూస్తే ఈ పద్యం చాలా అసమర్థమైంది. కవికి మితవాగ్విన్యాసము ఉండవలసిందేకాని అది యెప్పుడు ? కవి తన భావ వ్యక్తీకరణకు తగినశబ్దం వాడగలిగినప్పుడు. చివరకు కవిలక్ష్యంకూడా భావస్ఫూర్తి తీసుకురావడమేగదా ! ఇది వశ్యవాక్పంపన్నులకు కొద్దిలోనే లభ్యమౌతుంది. లేకపోతే ఆకుకూ పోకకూ అందకుండా కవిని చాలాచాలా దూరం తీసుకువెళ్ళి తిప్పుతుంది. కొన్ని సందర్భాల్లో క్లుప్తీకరణ ఎంత అవసరమో విపులీకరణ అంత అవసరమై ఉంటుంది. ఏమైనా ఆశయ వివక్ష చేయునప్పుడు రెండునూ వ్యర్థములే. భావాన్ని విపులీకరించి చెప్పవలసిన అవసరం పై పద్యంలో ఉంది. భావం ఎక్కువగా అనుభావంచేత ప్రతీయమానం చేయబడుతుంది. అనుభావం విభావాన్ని ఆశ్రయించి ఉంటుంది. కవి ఆశయం ఒక్క భావం చెప్పడమే అయితే క్లుప్తీకరణ అవశ్యకమౌతుంది, ఇంకొక రకంగాచూస్తే Thought ను చెప్పేటప్పుడు క్లుప్తీకరణ, Feeling ను చెప్పేటప్పుడు విపులీకరణ అవసరం. పైపద్యం Feeling కు సంబంధించింది కాబట్టి విపులీకరించాలి. కనీసం దీన్నొక సీసపద్యంలో అయినా చెప్పాలి. ఈ భావాన్ని శార్దూలంలో ఇరికించివేయడంలోని పద్ధతిని కవియొక్క మిగతా వాగ్విన్యాసముగా భావించడం తప్పు. దీంట్లో ఉన్న రెండవదోషం తిరిగి ఆ మొదటిదే. అతి లలితము

లైన పిల్లల ముద్దు పలుకులతో పెనవేసుకొని 'ఓలిం' 'నాగాననబోయి' లాంటి క్లిష్ట గ్రాంథికాలు ఉండటం, తరువాత సాధికారమైన ప్రభుశబ్దం, ప్రభుశబ్దంలో ఉన్న స్వారస్యాన్ని తీసి దానికున్న గొప్పతనం నిరూపించవచ్చునుగాని, అచ్చట ఆ శబ్దానికి సంబంధించిన వాచ్యంలో అభిధాశక్తికి కావలసిన సంయోగ వియోగ సాహచర్యాదుల్లో ఏవొక్కటీ సహకరించడంలేదు. ఇంతేగాక కౌసల్య అన్నపదం మూడుసార్లు ఉపయోగించబడింది. ఆ పదం కొటేషనులో ఉన్నా తిరిగి తిరిగి పునరావృత్తమై రసాస్వాదన చేయనివ్వదు. పునరావృత్తిని ఆలంకారికులు కొన్ని శబ్దాలంకారాలలో తప్పితే పూర్తిగా నిషేధించారు. ఈయన ఈదోషాన్ని ఇక్కడే గాదు, చాలాచోట్ల చేయడం కనిపించుతుంది.

అయితే ఇంతమంచి సన్నివేశాన్ని ఈకవి విడదీసి రెండు మూడు పద్యాల్లో ఎందుకు చెప్పలేదు అని మనకు సందేహం కలుగవచ్చు. దీంట్లో ఒక రహస్య ముంది. అసలు ఈ సందర్భం అభినయ యోగ్యమైంది. లేదా నవలల్లోనూ నాట కాలలోనూ వివరించదగినది. దీనికి కావ్యత్వ గౌరవం లేదు. కావ్యంలోకి తెస్తే చాలా పేలవంగా ఉంటుంది. లోకంలో ఉన్న అన్నిభావాలూ, అన్ని పదాలూ కావ్యంలోకి రావు. కావ్యము ఒక ప్రత్యేకమైన స్థాయికి చెందింది. తతిమ్మా సారస్వతంలోనూ లేదా లోకంలోనూ ఉన్న చాలా 'తుక్కు' కావ్యంలోకిరాదు. అదంతా కావ్యపరంగా చూపదలిస్తే ఇలాంటి అనర్థాలు ఎన్నో కలుగుతాయి.

ఇంతవరకు పౌరాణికాలతో ఆయన పెట్టుకున్న ఆత్మీయతా, అక్కడకూడా స్వీయవ్యక్తిత్వం పెల్లుబికి వచ్చిన కారణంగా అవి చిదిపి చిందరవందరజేసి బయటకు రావడం చూచాము. ఇలాగే ప్రబంధాలతోగూడా ఈయన ఘర్షణపడుతూ ఉంటాడు. ప్రబంధకవుల్లోని ముఖ్యగుణం అతిదూరకల్పన. వీరి ఆలంకారిక సామగ్రికి వాస్తవిక జీవితం ఆధారం కావడమనేది చాల తక్కువ. మన్మథుడు, కామధేనువు, కల్పవృక్షం, చక్రవాకము, క్షీరసాగరం, కుబేరుడు, మలయపవనం మొదలైనవాటితో నిర్మించుకున్న ఒక ఊహాప్రపంచం అది. బాహ్యరూపవర్ణన వీరికి ముఖ్యం. ధర్మార్థకామమోక్షాల్లో కామాన్ని ప్రధానంగానూ, మిగతావి గౌణం గాను గ్రహించారు. రసాన్ని పరమావధిగా పెట్టుకొని తద్విరోధక సన్నివేశాలను నిరాకరించారు. శృంగారాన్ని రసరాజుగా చేసికొని అష్టాదశ వర్ణనలకు వచ్చినంత మేరకే జీవితాన్ని ఉపాసించారు. విశ్వనాథ ఈ ప్రబంధ సంప్రదాయంలోకూడా జీర్ణించినవ్యక్తి. ఈయనకు పురాణం ధార్మికాదర్శం ఎలాగో ప్రబంధం కావ్యా దర్శ మలాగు. అయినప్పటికీ ఈయనవ్యక్తిత్వం ప్రబంధాలకుకూడా ఎదురు

తిరుగుతుంది. ఇలా ఎదురుతిరగడంలో వైదగ్ధ్యం ఏమీ కనిపించడంలేదు కాబట్టి దీన్ని నేను ఆ సంప్రదాయంమీద ఈయన చేసే అనుచిత ప్రహారమంటున్నాను.

ప్రబంధకవులు చేసిన వర్ణనలను ఈయన కొంతవరకు చేశారు. అంత వరకు ఈయనలో ప్రత్యేకత ఏమీ కనిపించదు. ఉదాహరణకు ప్రబంధకవులు గర్భిణీస్త్రీలను వర్ణించారు. ఈయనా వర్ణించాడు. కాని వైశిష్ట్యమేమీ రాలేదు. అందు కని వెంటనే గర్భిణీస్త్రీకి ప్రక్కన ఉన్న పురిటిల్లు ఈయనకు స్ఫురించింది. దశ రథుని రాజమందిరంలో ఉన్న పురిటింటిని ఈయన ఎంతో మమకారంతో వర్ణిం చాడు. పురిటింటివర్ణన ప్రబంధకవులకు ఏహ్యమైనట్లే ఆధునికులకుకూడా ఏహ్య మైనట్టిది. ఈ ఘట్టం జుగుప్సాకరమైంది కావడంవల్లనూ, దీనివల్ల కవి సాధించే ప్రత్యేక ప్రయోజనమేమీ లేకపోవుటవల్లనూ ప్రాచీన-అర్వాచీన కవులు దీనిని వదలి వేసినారు. గర్భిణీస్త్రీని వర్ణించడంలో ఒక అందం ఉంది. భావిమాతృత్వ గౌరవం, గార్హస్థ్యవైభవం, అసలు గర్భంతోనే వచ్చే భాగ్యబంధురమైన నిండు బండిపంటి సౌందర్యం ఆమెలో కనిపించుతాయి. అందువల్ల ప్రబంధకవులు దీన్ని నాచి కొన్నారు, కాని పురిటింటిలో ఆసౌందర్యం లేదు. ఈ రామాయణంలో 'కౌసల్య కా్ౖరేడు చీరలు ధరిస్తుంది. ఆమె పురిటింటిలో సాగనారమట్టలూ ప్రాతచెప్పులూ కట్టబడినాయి.' ఎంత జుగుప్సాకరమైన వర్ణన! ఆ రాజసౌధంలో, విష్ణ్వవతారం ప్రభవించిన దశరథుని యింట్లో ఇంత హేయమైన వర్ణన. వాస్తవిక కవులు ఇలాంటి అతి వాస్తవికవర్ణనలు చేయవచ్చుగాని వారిదృష్టి వేరు. ప్రాచీన సంప్ర దాయాల్ని ఛిన్నాభిన్నం చేసి పాఠకునకు దృశ్యమాన జీవితంలోని పరమార్థాన్ని చూపి లేక దానిలో ఉన్న దైన్యాన్ని రెచ్చగొట్టి ప్రత్యర్థి విజృంభణను అరికట్ట డానికి అది పనికివస్తుంది. కాని విశ్వనాథ ఈ వర్ణనను ప్రబంధకవికి ప్రతిగా చేశాడేకాని ప్రయోజనం దృష్టిలో కాదు. ప్రాత సంప్రదాయంలో ఉన్న కవికి ఇలాంటి వర్ణన నిష్ప్రయోజన మౌతుందని మొదటే చెప్పాను.

ఇలాగే ఈ కవి భావికవిత్వపు ఛాయల్లోకూడా తన వింతగొంతును సవరించుకుంటాడు. భావకవిత ప్రబంధకవుల శృంగారానికి ఒకవిధమైన క్రొత్త సింగారింపు అభివ్యక్తిలో ఒక క్రొత్త నడక. నాయికానాయకుల ఐంద్రియకాను రాగమే స్వేచ్ఛాప్రణయమై అతీంద్రియ స్థితికి తీసుకుపోయిన ఆత్మైకసిద్ధి అది. ప్రకృతిలో తాదాత్మ్యం, సౌందర్యోపాసన, కళకోసం జీవించడం, జీవనసికతల ఆవలియొడ్డున ఒక రహస్యాకర్షణ. హృదయభాండంలో పొర్లుకపోతున్న మధు వుని గ్రోలిచొక్కిపోవడం, సన్నని సంగీతం, లయా, సుదూరాన ఎవరిదో పిలుపు,

మూగికోర్కులూ, నిట్టూర్పులూ, నిర్భరనీరవమైన ఒక ఆనందసుషుప్తి అది. దీనికి ఎంతో అనుభూతి ఉండాలి. వేదనామంద్రమైన వీణవంటి సన్నని గొంతు కావాలి. ఐహిక కిల్బిషాల నటించుకోని స్ఫటికమువంటి హృదయం కావాలి. సర్వసిరాస్పందనశీలమైన భావనా. మధుర వేణునాదంవంటి గానం కావాలి. విశ్వనాథ ఈ పదచ్ఛాయలలో గూడ కొంతదూరం ప్రయాణం చేసినాడు. ఈయన కొన్ని భావగేయాలు కూడా వ్రాయవచ్చు. అవి పేరుకూడా పొందవచ్చు. కాని పైచెప్పినట్లు ఈయన వ్రాయనిదంటూ ఏమీలేదు. అలాంటి బాహ్యశక్తి ఈయనకు దైవదత్తంగా ఉంది. కాని కవితాసాఫల్యం కేవలం బాహ్యశక్తిమీదే ఆధారపడి యుండదు. అది అంతరుద్బోధ. అంతర్వాణి పిలుపు. ఆ పిలుపు లేనినాడు కవితావ్యాసంగము సమస్తమూ ఊసరక్షేత్రమువలె నిష్ఫల మగును. ఈయన రామాయణంలో భావకవిత్వపుఛాయలు చాలా ఉన్నవి.

"నడుమ విడలని మొగ్గకు విడిలిన వెలి
పసరు రేకులకున్ మధ్య వానచినుకు
నిలుచుదమ్మినా గ్రుడ్డు తెప్పలకు నడుమ
కనుల నీర్నించు నతివ యేకాంతముగని."

ఈ పద్యంమీద నవ్యకవితా ప్రభావం ఉంది. కాని సంశ్లిష్ట పదబంధనతో తీసుకు రాదగిన సమన్విత సంకేతం విడివిడిగా ఛిన్నాభిన్నం చేసి అందింపబడ్డది ఈ కవితలో. సృష్టి అంతర్లయను సంగీతంగా చేసుకొని పాడుకుంది భావకవిత. పాటలో భావం, భావంలో పదం కలిసి ఒకదానితో నొకటి అల్లుకొనిపోయిన అనురాగవల్లరి అది. దాంట్లో విడదీయరాని అవ్యక్తమైన ఒక మధుర ఝుంకృతి మాత్రమే నిస్వనిస్తుంది. అర్థాన్నీ, అన్వయక్లేశాన్నీ కూడా అధిగమించిన పారవశ్యం, అనూహ్యమైన హృదయానుభూతి, అచుంబితమైన ఒక భావస్పర్శ, రేఖాంచలాలతో తుమ్మెదలా గీరి మైతీవను పులకరింపజేస్తుంది. కాని పై పద్యంలో ఆ తంద్రాలసమైన స్పందనలేదు. కారణం? ఇక్కడ కవి ఒక మధురమైన భావాన్ని అల్లుకొనియున్న కోమలసంగీతాన్ని విడదీసి పొడిపొడి మాటల్లో విరజిమ్మినాడు. ఈ కవికి శబ్దమూ, అర్థమూ, అన్వయములమీది చూపే కాని అన్వయాతీతమైన ఒక తరళరసైక్య భావన ఛాయా కవిశిల్పంలో ఉంటుందన్న దృష్టేలేదు. అర్థాన్ని విడమర్చి చూపే మోటు అవయవ పద్ధతిని పై పద్యంలో గ్రహించడంవల్ల భావకవుల సౌకుమార్యం రాలేదు. భావకవులు వెనుకటి సంస్కృతశబ్దంలో క్రొత్త అభివ్యక్తిని నింపారు. సంస్కృత పక్షపాతియైన ఈ

కవి తన సంస్కృతీకరణవిధానాన్ని ఇక్కడ అమలుజరపక పోవడం శోచనీయం. 'నీరవగళము' అను చప్పుడులేని గొంతులని విరిచి చూపినా 'రేఖాంచనా' అను రేఖల చివళ్ళు అన్నా ఆ అందంరాదు. భావకవులు పోషించుకుంటూ వస్తున్న భావతాదాత్మ్యాన్నీ ఆసుమనోరాగ వల్లరిని కదిపి విరస ఝంఝూక్రీడలు చేస్తుంటాడు ఈయన. మరొకచోట భావకవుల సమాసంవంటి సమాసం వాడి తిరిగి భావంతోనూ శబ్దసంకలనంలోనూ ఆమొరటుదనమే చూపిస్తాడు.

"పునరుద్భవ ద్దంత ముగ్ధమోహనరుచి
ప్రకట రేఖాహాస భావపరిధి"

ఇది కావ్యశిల్పం దృష్ట్యా భావకవిత. దంతములనుండి వెడలిన హాసముతో ఒకానొక భావపరివేషము ఆమెను చుట్టుకొనిఉంది అనుకోవాలి. ఇచ్చట పునరుద్భవ ద్దంత అంటే తిరిగి పుట్టుచున్న దంతాలా ? ఇదివరకు పుట్టిన దంతాలా ? పునరుద్భవత్ వర్తమానకాలం కాబట్టి ఇవి ఏదంతాలో స్పష్టంగా తెలియడం లేదు. అవి పుట్టిన దంతాలైనా పుట్టుచున్న దంతాలైనా ముగ్ధమోహన రుచికి ఏమీ అవసరంలేదు. అయినా దంతరుచి ఏమిటి ? ఇంతకంటే అందంగా చెప్పే పద్ధతిలేదా ? క్లిష్ట భావపద సాంకర్యంవల్ల ఇది భావకవిత అయికూడా కాకుండా పోయింది. మొత్తంమీద చెప్పాలంటే ఈయన వ్యక్తిత్వకాంక్ష ప్రబలి కవితా సంప్రదాయాల అన్నిటిమీదా స్వైరవిహారంచేసి అన్నిటినీ త్రుంచి తాను తునుగుతుంది.

ఇంతవరకు ఆభ్యంతరికములైన కొన్ని కావ్య తత్త్వములను గూర్చిన వివేచన జరిగినది. శబ్దార్థములు, వ్యుత్పత్తి, సమాసము, విగ్రహమూ, సంధి, విచ్ఛేదము మొదలైన భాషాశబ్ద సంప్రదాయములమీద వీరికున్న దృష్టిని, ఆసక్తినీ పరిశీలించి రామాయణ కావ్యముయొక్క బాహ్యరూపమును రేఖామాత్రముగా తరువాత వ్యాసము పరిశిష్టములో చర్చించగలము.

# స్వర్ణాక్షరాలు

హాఫ్‌వే (Half way) అనే పేరుతో స్వర్ణాక్షరాలతో కూర్చిన ఒక మహత్‌గ్రంథాన్ని శ్రీ నార్లవారి స్వర్ణోత్సవ సందర్భంలో నార్ల సన్మానసంఘం వారు బహూకరించారు.

శతమానం భవతు శతాయుః దీర్ఘమాయుః అని సాధారణంగా దీవించేటప్పుడు నూరేళ్ళు పూర్ణాయుష్షుతో వర్ధిల్లవలసిందని ఆశీర్వదిస్తారు. ఆ లక్ష్యానికి సరిగా మధ్యమార్గంలో ఉండి యాభై సంవత్సరాలూ పూర్తిచేసుకొన్న నార్ల వెంకటేశ్వరరావుగారికి 1958 డిశంబరు 1 వ తేదీని ఒక సన్మానసభ జరిగింది. ఆ సభలో ఈ అభినందన గ్రంథం ఆంగ్లభాషలో తయారుచేసి మన ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డిగారు సమర్పించారు. శ్రీ పి. వి. రాజమన్నారుగారు, శ్రీ బి. గోపాలరెడ్డిగారు మొదలయిన పెద్దలు ఆశీర్వదించారు.

ఈ యభినందన గ్రంథం రెండు భాగాలు. మొదటి భాగంలో నార్లవారిని గురించిన వ్యాసాలున్నవి. రెండవభాగంలో వివిధ విషయాలు గూర్చిన విశిష్ట రచన నున్నదివి. దీనికి మన ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు పీఠిక వ్రాస్తూ "యీ గ్రంథం ఇంత విశిష్టంగా, విస్తృతంగా వెలువడటం సంపాదకుడుగానూ రచయితగానూ "నార్ల" వారిమీద ప్రజలకు గల ఆదరాభిమానాలకు ఒక నిదర్శనము" అని అన్నారు.

"నార్ల"ఆంధ్రప్రభ సంపాదకత్వములో-జీవితముమీద చక్కని వ్యాఖ్యానాలు వ్రాశారనికూడ అన్నారు. ఇంక నార్ల రచనా వ్యాసంగం గురించి పేర్కొని యిలాగ అన్నారు. సృజనాత్మక సాహిత్యములో అన్ని విభాగాలలో మా "నార్ల"ది అందెవేసినచేయి. నాటకము, కవిత, వ్యాసము, వాక్చిత్రము ఇటువంటి అన్ని విషయాలలోనూ అరితేరిన దిట్ట. అయితే అన్నింటిలోనూ గ్రామ జీవితమే వీరి రచనలో ఎక్కువగా ప్రతిబింబిస్తుంది, ఈయనశైలి సులభము. బాణంవేసినట్లు చెప్పదలచుకొన్న అంశం సూటిగా అందుకొంటారు. మొదటి భాగములో ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు కూర్మా గోపాలస్వామిగారు నార్లవారి జీవితచరిత్ర వ్రాశారు, కోటంరాజు రామారావుగారు నార్లవారి పత్రికా సంపాదకత్వం గురించి వ్రాశారు. తాపీ ధర్మారావు, పి. వి. రాజమన్నారు, ఆచంట జానకిరామ్ గారలు "నార్ల" సాహిత్యసేవను ప్రశంస చేశారు. పెద్దాడ రామస్వామి, ఖాసా సుబ్బారావు, యమ్. సోమశేఖర శర్మగారలు కళాశాలలో, పత్రికాలయములో, జీవిత

రంగంలో విద్యార్థిగా "నార్ల" సాధించిన విజయాలు వివరించారు. ఇంక రెండవ భాగములో రాజాజీ, డాక్టరు పట్టాభి సీతారామయ్య, డాక్టరు బి. రామకృష్ణారావు, శ్రీమతి కమలాదేవి చటోపధ్యాయవంటి రాజకీయ ప్రముఖులూ శ్రీ యస్. గోవిందరాజులు, డి. యస్. రెడ్డి, ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్య, డా. ఆర్. సుబ్రహ్మణ్యం, డా. కె. సి. వరదాచారి, డా. సి. కున్హాన్ రాజావంటి విద్యావేత్తలూ, జి. వి. సీతాపతి, జి. వి. కృష్ణారావు, కె. జార్జి, బుర్రా సుబ్రహ్మణ్యం వంటి సాహిత్య విమర్శకులూ వ్రాసిన వ్యాసాలున్నవి.

రాజాజీ, తిలక్‌గురించి చక్కని ఆలోచనాత్మక వ్యాసం వ్రాశారు. ఐసెన్ బర్గు ప్రాక్ పశ్చిమ దేశాల మానసికశాస్త్ర దృష్టిగూర్చి సమీక్ష చేశారు. డాక్టర్ పట్టాభి ప్రజాస్వామికతలో నాయకత్వం గురించి చర్చించారు. ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్య శ్రేయోరాజ్యంలో రాజకీయాలగూర్చి ప్రస్తావించారు. అద్వైత విధానంగూర్చి డాక్టర్ కె. సి. వరదాచారి వ్రాస్తే, ఆస్తికత, నాస్తికతలగూర్చి డాక్టరు కున్హాన్‌రాజా వ్రాశారు. గాంధీతత్వంగూర్చి బి. వి. కిషన్, కొరానులో చెప్పిన శీలనిర్మాణంగూర్చి డా. మీర్ వలియుద్దీన్ వ్రాశారు. డా. బూర్గుల రామకృష్ణారావు గారు వివిధ సంస్కృతుల కూడలిగా హైదరాబాదును ప్రశంస చేశారు. నవలల జీవితమును సంస్కృతినీగూర్చి గిడుగు సీతాపతిగారు సమాలోచన చేశారు. శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ అఖిలభారత స్థాయినందగల నాటకరంగము గూర్చి ఆదరణయోగ్యమైన ప్రతిపాదనలు చేశారు. ఆంధ్రదేశములోని కళ, శిల్ప నిర్మాణములగూర్చి డాక్టరు మారేమండ రామారావుగారు విపులమైన సమీక్ష చేశారు. తెలుగు పత్రికా చరిత్రలో కొన్ని ప్రధాన ఘట్టాలుగూర్చి ఒక ప్రచ్ఛన్న రచయిత చక్కని సింహావలోకనం చేశారు. యువకులలో క్రమశిక్షణగూర్చి మన వైస్ ఛాన్సలర్లు అయిన గోవిందరాజులుగారూ, డి. యస్. రెడ్డిగారూకూడ తర్కించారు. సాహిత్య అకాడమీ సహాయ కార్యదర్శి కె. యమ్. జార్జి ప్రఖ్యాత కేరళకవి నల్లత్తులేగూర్చి ఒక అమూల్యమైన వ్యాసం వ్రాశారు. ఆధునిక కవిత లోనూ కల్పనా సాహిత్యములోనూగల సమస్యలుగూర్చి గుజరాతీకవి మన్‌సూలాల్ ఝవేరీ చర్చించారు. తెలుగు సాహిత్యములోని సాఘిక ప్రయోజనంగూర్చి బుర్రా సుబ్రహ్మణ్యంగారు విమర్శ చేశారు. వంగదేశములోని పత్రికారచనగూర్చి శ్రీ నందలాల్ సేన్ గుప్తగారు పేర్కొన్నారు. వేమన కవితావిశేషాలగూర్చి డాక్టర్ జి. వి. కృష్ణారావుగారు విశదీకరించారు. మొత్తం రెండు వందలు పుటలకుపైన మించిన యీ గ్రంథములో చక్కని చిత్రాలుకూడ వేశారు. ముద్రణ, సంకలన యే

అమెరికాలోనో, లండన్‌లోనో అచ్చువేసి బైండు చేసినంత సుందరంగానూ శుభ్రంగానూ ఉన్నవి.

ఇది తయారుచేసిన సంపాదక వర్గములోనున్న శ్రీ ముక్త్యాల రాజాగారు, శ్రీ డి. ఆంజనేయులు, శ్రీ కప్పగంతుల సత్యనారాయణగారలు అభివందనార్హులు. ఈ సన్మానమునకు కారకులయిన శ్రీ జి. యస్. రాజు, శ్రీ కె. యల్. ప్రసాద్ మరీ ముఖ్యంగా ప్రశంసార్హు లనవచ్చును.

ఇన్ని అమూల్య వ్యాసాలతో ఇంత అందంగా తయారు అయిన నార్ల అభినందన గ్రంథము ఆంధ్రుల యిండ్లలో అలంకార ప్రాయంగా ఉంటుందని చెప్పకతప్పదు. దీనిని Golden Book అన్నందుకు దీనిలోనివి నిజంగా స్వర్ణాక్షరాలే!

పైగా ఈ గ్రంథమువల్ల నార్లవారినిగూర్చి, వారు ప్రాతినిధ్యం వహించే తెనుగు పత్రికలూ, సాహిత్యమూగూర్చి ఆంగ్లభాష తెలిసినవారందరికీ బాగా తెలియపరచడానికి ఈ అభినందన గ్రంథం అన్ని విధాలా ఉపకరిస్తుంది.

—శ్రీవాత్సవ

## భీమన్న కావ్యకుసుమాలు (ఖండకావ్యం)

ప్రతులకు : నవ్యసాహితీసమితి

208 బోయిగూడ, సికింద్రాబాదు. వెల : 3-00

డెబ్బది శీర్షకలతోడి ఖండకావ్యమిది. కృతికర్త శ్రీ బోయిభీమన్నగారు. శ్రీ కల్లూరి సుబ్బారావుగారి కీ కృతి అంకితము. ఈ గ్రంథమునకు "పరిచయము" పేరుతో శ్రీ కురుగంటి సీతారామయ్యగారును, "పరామర్శ" పేరుతో శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారును మొత్తము ముప్పదియేడు పుటలలో లెస్సగా సమీక్షలు వ్రాసిపెట్టినారు.

ఒక పాతిక సంవత్సరాల ఈ మధ్యకాలములో శ్రీ భీమన్నగారు అప్పుడప్పుడు వ్రాసిపెట్టుకొనిన ఖండికల సంపుటి యిది. ఖండకావ్యములో రసప్రసక్తి రాదు. వట్టి ఊహల పరిధియే అందుండును. అవియును ఎడతెగక ఉండవు. అనగా ఖండకావ్య మొక లక్ష్యముతో నుండదు. దీపసభవంటి కావ్యమును వ్రాసిన శ్రీ భీమన్నగారి వివిధములైన భావపథము లెరుగుట కీ గ్రంథ ముపయోగపడగలదు.

శివధనుర్భంగవేళలో సీత హృదిని
తనది గానించుకొను స్వామి తరళమూర్తి,
తన్ముహూర్త నిష్యందమై తత్త్వమసిగ
పృథివి గగనమ్ము ముంచెత్తు వెలుగు నించె।

కలిగెచీకట్లు, తనివార గురిసెవాన
చెట్లు చిగిరించె, శాద్వల సీమలెల్ల
నూత్నరాగశోభితములై రత్నమయ వి
లాసవేదికాభ్రమ నొప్పె - లాస్యరక్తి
నచట మందార వృక్షము లల్ల జార్చు
పూల యెఱ్ఱని కాంతుల పూత లలమి।
ప్రకృతి నవవసంతాగమన కళ నొక్క-
దివ్య స్వప్నాన, తన్మయోద్వేగ పరత
పులకిత లతాంగియైన యీ పుణ్యవేళ
తెలిసితిని - నీవు నాలోనె - వెలసితివని।।

---

గ్రంథస్వీకారం

| | |
|---|---|
| సాంప్రదాయం | శ్రీ కె. వి. రెడ్డి, శ్రీ ఐ. బి. రాజు |
| మహాశ్వేత | శ్రీ స్ఫూర్తిశ్రీ |
| న్యాయమందిరం | శ్రీ అంబటి |
| రౌడీ మల్లన్న | శ్రీ ఎం. ఏ. ఖాదర్ |
| అంగార వల్లరి | శ్రీ కె. వి. రమణారెడ్డి |
| ఖిల్లఫల్గునీయము | శ్రీ కట్టి భీమలింగాచారి |
| జాగృతి | విజయదశమి ప్రత్యేక సంచిక జాగృతి కార్యాలయం, విజయవాడ-2. |
| విశ్వవీణ, | సాంస్కృతిక పక్షపత్రిక, సంపాదకులు: మసూనా శ్రీ శ్రీనివాస్ మొక్కరాల విశాఖపల్లికేషన్సు, మెయిన్‌రోడ్, విశాఖపట్నం-౧. |

# రామాయణ కల్పవృక్షము - ఒక విమర్శన

## పరిశిష్టము

—శ్రీ దుర్గానంద్

## 3

ఈ కవి వ్యుత్పత్తిప్రధానుడు. శబ్దార్థముల సంబంధములమీద ఈయన కున్న మమకారము అతివేలమయింది. ఈవ్యాసములోని దోషములు పెక్కులు ఏతన్మమకార జన్యములే కాబట్టి ఈ శబ్దార్థసంబంధములమీద ఈయనకున్న అభిప్రాయములూ, అపోహలూ, ఎలాంటివో తెలుసుకొనుట అత్యవసరము. ఈ అభిప్రాయములు జయంతి పత్రిక తొలిసంచికనుండి ఉద్ధృతములైనవి.

"సంస్కృతభాషలోఁ బర్యాయపదములు కొల్లలుకొల్లలుగా నుండును గదా. సంస్కృత భాషాశబ్దములు వ్యుత్పత్తిసహితములైనవి. ఎక్కువశబ్దములు ధాతుజన్యములు. కొన్ని భిన్నావయవముల యొక్క యర్థపోషకములు. అందుచేతఁ బ్రతిశబ్దమునకు యౌగికార్థము రూఢ్యర్థము రెండునుండును."

—అభిజ్ఞానశాకుంతలము

సంస్కృతభాషలో పర్యాయపదములు ఎక్కువ అని ఈయన అభిప్రాయము. పర్యాయపదములన్న ఒక వస్తువునకున్న అనేక నామములని ఈయన భావన. కాని పర్యాయపదములు ఒకేవస్తువునకు అదేఅర్థములోఉన్న అనేకనామములుకావు. శబ్దశాస్త్రదృష్టితోచూచిన పర్యాయపదములు ఒక వస్తువునకున్న వివిధనామములు కావనియూ అవి సంస్కృతభాషలోతప్ప అన్య భాషలలో లేకపోవుటకూడా లేదనియు తెల్లమగును. పర్యాయ పదములు వస్తువులకున్న గుణసూచకములగును. భావములకున్న అవస్థా సూచకము లగును. కోర్కె-అనుపదమును ఉదాహరణముగా తీసికొనుడు. సంస్కృతములో దీనికి పర్యాయపదములు చాలఉన్నవి. వాంఛ, కాంక్ష, తృష్ణ, లిప్స, ఈహ ఇవియన్నియు నిఘంటువులలో ఒకేముడిని కట్టివేయుటవలన సాధారణముగా కోర్కెకు పర్యాయపదములుగా గ్రహింపబడుచున్నవి. కాని సూక్ష్మముగా పరిశీలించిన ఇవి ఒకానొక మానసిక వ్యాపారము యొక్క భిన్నదశలను సూచించు రూపములుగా తెలిసికొనదగును. ఒక అలభ్యవస్తువును పొందుటకు మనస్సుచేయు సన్నికట వ్యాపారము కోర్కె అనబడును. ఈ కోర్కె-

కోరువానిని బట్టియు, కోరదగిన వస్తువునుబట్టియు, కోరుచున్న రీతినిబట్టియు, కోరగా వచ్చిన ఫలితమునుబట్టియూ, పైచెప్పిన పర్యాయపదములలోని వివిధ రూపములను ధరించును. వస్తుప్రాప్తిగతములైన ఈమానసిక వ్యాపారముతే పర్యాయపదములు. ఈపరిస్థితి ప్రతిమానవునియందును, ప్రతిదేశమునందునూ కలదు కాన ఈభిన్న అవస్థా సూచకశబ్దములు అభాషలు వికసించినమేరలో కొంచె మెక్కువతక్కువలుగా నుండును. ఆంగ్లమున desire, want, ambition, longing మొదలైన పదము లిట్టివేగదా. తెలుగులో తమి, కోర్కె మొదలైనవి కలవు. పాతప్రవచనములందు స్థూలదృష్టిలో గ్రహించిన ఇవి పర్యాయపదములేగాని మహాకవి ప్రయోగములందు నిర్దిష్టాంశములను సూచించుచునివి సార్థకశబ్దము లగుచున్నవి. అంతియేగాని ఒకరొకచోకూర్చొని సంస్కృతములో ఈశబ్దములను రాశిగా గ్రుమ్మరించిరనుకొనుట ప్రమాదము. ప్రపంచములో సాహిత్యము వృద్ధిగాంచినకొలది మానవుని మనోగోళములో భావసంఘర్షణ హెచ్చినకొలది ఇట్టిపర్యాయపదములు ఎన్నియో వెలసినవి.

ఇట్లే ఒకవస్తువునకు వివిధనామములు కలుగుటకూడ ఒక విచిత్రమైన సంఘటన. ఒకవస్తువునకు ఒకశబ్దము ప్రసిద్ధమై యున్నప్పుడు రెండవశబ్దముతో దానిని పిలుచుటకు మానవు డేల ఉత్సహించును. 'నేను' 'మీరు' అను సర్వ నామములకు పర్యాయపదము లేవే. ఇట్లే నిత్యజీవనావశ్యకములైన పదము లకునూ పర్యాయపదములు లేవు. ఉన్ననూ చాలతక్కువ. వ్యక్తులు, వస్తువులు గుణాశ్రయములు. వీటిలోని గుణములనుబట్టి ఆగుణముల సూచించునటుల పర్యాయపదములు వెలసినవి. ఈ గుణసందర్శనము చేయుటకు వీలైనపరిస్థితులు భాషాచరిత్రలో పలురకములుగా ఏర్పడియుండవచ్చును. శైలము, నగము, భూధరము, పర్వతము, గిరి అను పర్యాయపదములు ఎట్లేర్పడినవి? శిల యొక్క రూపమును అనుభవించినప్పుడు శైలము అనబడినది. దాని చలన రాహిత్యమును అనుభవించినప్పుడు నగము అయినది. భూమిని పర్వతము ధరించుచున్నదను ధార్మికవిశ్వాసము కలిగిన చరిత్రదశను భూధరము సూచించు చున్నది. మీకాశ్చర్యము కలుగవచ్చును. పర్వతమునకు సంబంధించిన పైశబ్దము లన్నియు మాతృకదశలో సంస్కృతశబ్దములు కాకనూ పోవచ్చును. ఎన్నియో దశాంతరములు పొందిన శబ్ద, శబ్దవిన్యాసవ్యవస్థ ఒక కొంతకాలము గడచిన తరువాత ఒక నిశ్చిత వ్యవహార దశలో ఒక భాష పేరుతో పిలువబడును.

మొదటి సెలయేటి రూపముననున్న నదిని ఆ రూపములో దానిని విశిష్ట నామముతో పిలుచుటలేదు. హరిద్వారము నుండి వెలువడిన ఆ ప్రవాహ రూపమునే గంగానది యనుచున్నాము. ఇట్లే భాషలన్నియు. వీటిని విడగొట్టి వీటి తొలిరూపములలో వీటియొక్క అనంతర రూపములను చూచుట కష్టము. పై చెప్పిన పర్యాయపదముల ఉత్పత్తిని మనము ఒకింత చరిత్రాత్మక పద్ధతిలో ఊహించవలయును. తొలి మానవజాతి నేటివలె ఏక సమాజరూపమున నుండక కొన్ని గుంపులుగనూ, తెగలగనూ ఆయా వేరు వేరు స్థానముల నాశ్రయించి యుండవచ్చును. అట్టి తెగలు ఆయా వస్తువులలో అనుభవించిన గుణములను బట్టి ఆ వస్తువులకు విడివిడిగా నామకరణము చేసి యుండవచ్చును. ఈ తెగలన్నియు కలిసి ఒక మహాజాతిగా ఏర్పడినప్పుడు ఆ తెగల అంతకుపూర్వము సంతరించుకున్న వేరు వేరు పదములుకూడ ఒకే వస్తువునకు పర్యాయపదములై ఏక భాషకు స్వరూపమునూ, సమృద్ధినీ ఇచ్చినవి. ఆ భాష సంస్కృతము కావచ్చును. తెలుగు కావచ్చును. ఇంగ్లీషు, అరబీ ఏదైన కావచ్చును. పర్యాయపదములు రూపొందిన ఈ పరిస్థితిని గమనించినచో సంస్కృతములో పర్యాయపదము లెక్కువ అను భ్రాంతి దానంతటది అంతరించును. దీనితో పాటు సంస్కృతశబ్దములు వ్యుత్పత్తి సహితములన్న భ్రాంతికూడ గమనించ దగినది. సంస్కృతములోని ప్రతిశబ్దము వ్యుత్పత్తి సహితము అంతకన్నను గాదు. పలురకములుగా భాషలో మొట్టమొదట కొన్ని మాతృకశబ్దము లేర్పడును. తరువాత భాష అభివృద్ధి పొందినకొలది ఉపసర్గల పరసర్గల ద్వారా లేక ఇతర శబ్దముల కలయికవలన క్రొత్త యౌగికశబ్దము లుద్భవించును. ఈ భేదమును సూచించుటకే శబ్దములను రూఢములని, యౌగికములని విభాగము చేయు నవసర మేర్పడినది. యౌగికరూఢ శబ్దవిభాగము చేసిన మన పూర్వుల భాషాజ్ఞాన మీ విషయమున ఎంతటి సూక్ష్మవివేచనా దక్షమైనదో గమనింప దగినది. శబ్దములన్నియు ధాతుజములుకూడ కాదు. క్రియాసంబంధి నామములే ధాతుజములు. ఇక్కడకూడ ఒక విశేషమున్నది. బీజరూపమైన ఒక మూలక్రియారూపము ధాతువు అను పేరుతో ఉండుననియూ, దానినుండి చిలవలు పలవలుగా వివిధకాలద్యోతన క్షమ ప్రత్యయాత్మకములైన సర్వక్రియలు పుట్టుచుండు ననియూ అనుకొనుట కూడ ప్రమాదము. మొదట 'గమ్ౡ' అని పుట్టదు. గచ్ఛతి, గచ్ఛ అను వ్యావహారిక క్రియలు పుట్టును. 'గమ్ౡ' అను ఒక మూలరూప స్థాపనము, ఈ సర్వక్రియలకు సంబంధించిన తెగలను, రూపములనూ

అర్థము చేసుకొనుటకు వీలుగా చేసుకున్న ఒక వైయాకరణ కల్పన, ఒక సూత్రీకరణ, ఒకరూప సాధనావకాశము మాత్రమే. దానినే వివిధరూపములకు మూలరూపమనుకొనుట అవివేకము. దీనినిబట్టి చూచిన తేలినదేమన వస్తువునకు ఏర్పడిన కొన్నిశబ్దములు గుణగతములు, కొన్ని క్రియాగతములు. వీటినే ఇంకొక మార్పుతో రూఢయౌగికములనీ, స్వాభావిక సాంకేతికములని పిలుచుచున్నాము. ముందు కొన్నిశబ్దములు మాతృకములుగా పుట్టి తరువాత విశిష్టార్థప్రయోజనముకొఱకు అవయవములను చేర్చగా అవి యౌగికము లగుచుండును. ఇవి కృతకములు. స్వతస్సిద్ధములైన రూఢములు, కృతకములైన యౌగికములు ప్రతిభాషయందును ఉండును. ఇల్లు, ఎద్దు మొదలైనవి తెలుగులో రూఢములు. రేయెండ, మగనాలి, ప్రామినుకులు మొదలైనవి యౌగికములు. ఇవి ఆంగ్లముననూ వేనకువేలున్నవి. ఈకవి చెప్పినట్లు సంస్కృతములో ప్రతిశబ్దము వ్యుత్పత్తి సహితము అయిన అది చాల కృతకభాష అయి యుండెడిదే. వ్యుత్పత్తిని ముందు ఊహించుకొని సంస్కృతభాషను తయారుచేసి ఉందురా? ఒక్తిది. ఇట్టి భ్రమ కలుగుటకు కారణము పాణిని వ్యాకరణము. సంస్కృతము మీద ఇంతపెద్ద వ్యాకరణమువచ్చి సూక్ష్మాతిసూక్ష్మముగా శబ్దావలోడనముచేసి ఒకప్రక్క సంస్కృతమునకున్న గొప్పతనమును ప్రపంచము నలుగడలా నిరూపించినది. వేరొకప్రక్క గ్రుడ్డిగా చదువుకొని పోయిన సంస్కృతజ్ఞులకు ఈ భాషయెడ వేయిమడుంగల భక్తిని అధికము చేసినది. ఆ వ్యాకరణము చేసిన అత్యంత సూక్ష్మ వివేచనమువలన సంస్కృతములోని ప్రతిశబ్దము కాదు ప్రతి అక్షరము శతధా చీల్చబడి అతికివేయబడినది. ఏతత్కారణముగా సాంప్రదాయిక పండితులకు సంస్కృతములోని ప్రతిశబ్దము వ్యుత్పత్తి సహితము అన్న భ్రాంతి కలుగుచున్నది. ప్రతి భాషయు ముందు వ్యావహారికదశలో ఉండి తరువాత గ్రాంథికమగును కదా! సంస్కృతముకూడ మొదట వ్యావహారికముగనుండి తరువాత సంస్కృతీకరింపబడినదనుట సర్వవిదితము. సంస్కృతమునకున్న వ్యవహారరూపము వేదములన్న ప్రబలసాక్ష్యము మనకు కనబడుచునే యున్నది. కాబట్టి సంస్కృతము అపౌరుషేయమేమియు కాదనియూ తోటిభాషలలో ఉన్నతమైన భాషలలో నొక భాషయనియూ గుర్తెరింగిన మనఅపోహాలు చాలవరకు అపావృతములగును. దీనితోపాటు ప్రతిరూఢశబ్దమునకునూ అవయములుతీసి అర్థము చెప్పు పిచ్చియు తొలగిపోవును. విశ్వనాథవారు ఈ వ్యుత్పత్త్యావేశముతోడనే కాళిదాసాది మహాకవుల కావ్య

ముల నధ్యయనముచేయుచు కొన్ని భ్రాంతసిద్ధాంతములను ఏర్పరచుకొనినారు. అవి ఇవి.

"మహాకవులు సామాన్యపాఠకునకు స్థూలకథావస్తువునకు శబ్దమును రూఢ్యర్థములో ప్రయోగించుచుఁ దాముద్దేశించిన మహార్థములను లోతుగా దిగి చూచెడి పాఠకులకు వాని యౌగికార్థములతో సంతరింతురు" అభిజ్ఞాన శాకుంతలము—జయంతి, తొలిసంచిక.

అంటే ఈయన ఉద్దేశ్యము మహాకవుల ప్రతికావ్యమునూ మొదట శబ్దరత్నాకరాదులతోవచ్చు అర్థముతోచదివి రెండవసారి గురుబాలప్రబోధికతో వచ్చు అర్థముతో చదువమనియా? ఇది చాలఘోరము. మహాకవులు మహోన్నతములైన భావములను ఉపలక్షించి కావ్యములు వ్రాయుదురుగాని వ్యుత్పత్తులు, నానార్థములు, వ్యాకరణసాధ్య ప్రయోగములు ముందిడుకొనిగాదు. మహాకవులయొక్క మహార్థవివక్ష ధ్వనిలోనూ, ఉక్తివైచిత్రిలోనూ వ్యక్తమగును. కవియొక్క అర్థము స్థూలమైనదో లేక సూక్ష్మమైనదో కవియిచ్చు సంకేతమునుబట్టి యుండును గాని రూఢ్యర్థయోగికార్థముల ప్రయోగమును బట్టికాదు. మహాకవుల మహార్థవివక్ష రూఢయౌగికార్థనిష్ఠమే అయినయెడల వారి కావ్యములు అనూక్తములై అన్యభాషలలో ఏమి సాధించగలుగును? అనువాదములలో అవయవార్థములు ఎగిరిపోవునుగదా! కాళిదాసు విశ్వకవిగా పరిణింపబడుటకు కారణము ఆయన రూఢ్యర్థయౌగికార్థ ప్రయోగమేనా? అట్లైన సంస్కృత సాహిత్యములోని చిత్రకావ్యములే కాళిదాసునికంటె ముందుబోయి విశ్వసాహిత్యములో అగ్రశ్రేణిలో కూర్చుండును. ఇట్టి వింతసిద్ధాంతమును సరియైన శబ్దశాస్త్రవేత్త చేయడు. విశ్వనాథ కాళిదాసుని శ్లోకములను ఈ దృష్టితోనే చూచి శ్లోకగతమైన ముఖ్యార్థమును విడిచి తన యూహలమీద వచ్చిన అవయవార్థ శకలములతో గాలిమేడను కట్టుకొనినాడు. కాళిదాసుని మహోన్నతభావములను విసర్జించి శబ్దశకలములతో ఆయన ఆత్మను పట్టుకొనబోవుట గురితప్పిన బాణములతో వేటపులుగును పట్టుకొనుటవంటిది. ఒక మహావ్యక్తిని ఏ గుణములతో అతను మహావ్యక్తి అయినాడో ఆ గుణములతోనే ఆరాధించుట సరియైన ఉపాసకుని లక్షణము. అట్లుగాక ఆ మహావ్యక్తిమీద లేనిపోని కొన్ని గుణములను తాను అనుకొన్నవి ఊహించుకొని ఉపాసించిన అనర్థమే కలుగును కాని మేలుగలుగదు. కాళిదాసునకున్న గుణములతో కాళిదాసుని పొగడవలయును. కాని తనకున్న గుణములను కాళిదాసు

నందు 'ఉన్న' వనుకొనునట్లు చేసి పొగడుట అపమార్గము. అనాదిసిద్ధమైన బ్రహ్మ తత్వమును దాని శక్తిని ఊహించలేక మన కున్న అల్పజ్ఞతలతో చిల్లర దేవతలుగా చేసి ఉపాసించిన మనలోని చిల్లరతనమే బయటపడును గాని ఆ మహావ్యక్తిత్వమునకు కొఅంతరాదు. విశ్వనాథవారి అభిజ్ఞాన శాకుంతలము మీది పరిశీలనము ఇట్టిదే ఒక వింత వైఖరి. తన కవిత్వములో అవయవార్థ శకలములతో కూడిన బిగింపు దప్ప మహోన్నత భావ ప్రదీప్తి ఏమియూ లేదు. కాన తన కున్న ఆచార్యకమ్మన్యతాబలముతో తన కావ్యములలో నున్న లక్షణ ములకు అనుగుణమైన ఒక కావ్య విమర్శనా విధానమును తానే ఒకటి ముందు బయటపెట్టి దానిని కాళిదాసు మీద సమన్వయింపజేసి అద్దానినే తరువాత తనమీద కూడ అన్వయింపజేయుమని నిరీక్షించుటయే ఆయన శాకుంతల పరిశీలనోద్దేశ్యము.

నేను దీన్ని గురించి యింత ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే ముందు చూపెట్టబోయే కొన్ని ప్రయోగాలు పై చెప్పిన అపోహలమీదే చాలవరకు ఆధారపడి ఉన్నవి. ఒక ప్రయోగం చూడండి. సుమంత్రుడు దశథునితో అతని పుత్రాభావ దుఃఖానికి అనుధ్వనిగా సమవేదనాశీలుడై ఇలా అంటున్నాడు.

> "నిద్రాహారము లెల్లమాని యిదిగో నీమంత్రులున్ గాఢ శు
> క్కద్రూసంభవదష్టులై మెలికలుంగాఁ జుట్టుకొంచుంద్రు"

నీ మంత్రులు అంటే మేము గాఢ శుక్కద్రూసంభవదష్టులమై బాధపడుతున్నా మని. వాళ్ళ బాధను వెల్లడించడానికి కవి గాఢ శుక్కద్రూసంభవ అను సమా సము వేసినాడు. దీని అర్థం గాఢమైన శోకము అనే పాములచేత దష్టులమై అని. శోకాన్ని పాముతో పోల్చడం బాగానే ఉంది కాని పాముకు వాడిన శబ్ద మేమిటి? 'కద్రూసంభవ' కద్రూ అనే స్త్రీ యొక్క సంతానము అని సర్పంలో ఉన్న విషదంశనాన్ని చెప్పడానికి సర్పపర్యాయపదాల్లో ఏదివాడినా కథన తీవ్రత వచ్చేది. కద్రూపుత్రులు అని వాడటంలో కద్రూవాత్సల్యంవచ్చి చెప్పదలచు కున్న శుగ్గాఢత్వాన్ని పలుచన చేస్తుంది. అసలు ఇక్కడ ఇంత వ్యుత్పత్తి సాధ్యమైన, ఐతిహ్యా కఠినమైన పదం వాడి అర్థవ్యాఘాతం కలుగచేసుకొని ఇరుకున పడటం దేనికి? కాని ప్రాస యిబ్బంది, పాండిత్య ప్రదర్శనాసక్తి. మరి ఏంచేద్దాం? ఈయన వాస్తవికానికి దగ్గరలో ఉండే పోలికలు తీసుకోక ఎందుకు అంత మారుమూలలకువెళ్ళి కుస్తీచేయడం?

ఇలాంటిదే ఇంకొక ఉదాహరణ. దశరథుడు సుమంత్రునితో ఆతని ప్రభుభక్తిపరాయణత్వాన్ని పొగడుతూ ఇలా అంటున్నాడు 'నీవయ్యమరాపగం బలె మహాప్రభు బుద్ధివి!' దేవనదివోలె నీవు ప్రభుబుద్ధివి అని చెప్పినాడు. ఇందులో ముందు లింగైక్యతలేదు. దేవనది స్త్రీ. సుమంత్రుడు పురుషుడు. పోనీ అధునిక మహాకవులు లింగాభేదమైన గుణసందర్శనం చేయగలరని సమాధానపడినా దేవనదికి స్వామిభక్తిపరాయణగా ఎక్కడా ప్రసిద్ధిలేదు. సామ్యం ప్రసిద్ధగుణంమీద ఆధారపడి ఉంటుంది. దీన్ని తెలుసుకోవాలంటే దేవనదికి సంబంధించిన కట్టుకథలు తిరగెయ్యాలి. ఒకటి విష్ణుపాదోద్భవగంగ విష్ణువు మీద ఈమెకున్న ప్రభుభక్తియా! లేక ప్రభుభక్తి అంటే పతిభక్తి అని చెప్పుకొని శివుని జటల్లో విడక ఉంటుంది కాబట్టి ఆ ప్రభుబుద్ధియా? ఇదైతే దశరథ సుమంత్రుల సంబంధానికి అతుకుపడదు. పోనీ భగీరథుణ్ణి వెన్నంటి వచ్చింది కాబట్టి ఆ ప్రభుబుద్ధియా? ఇంకా పురాణగాథ లున్నాయేమో తిరగెయ్యాలి. ఇంకో దేవనది ఏదైనా ఉందా? ఏమైనా దేవనదికి ప్రభుబుద్ధిత ప్రసిద్ధగుణం కాదనే చెప్పవలసి వస్తుంది. మరి కవి ఈ సాదృశ్యం ఎందుకు తెచ్చుకున్నాడు? దీనికి సమాధానం ఉంది. కవి అంతరాత్మలో గంగానది అంటే ఒక సనాతనమైన రూఢవిశ్వాసం ఉంది. అది పెల్లుబుకివచ్చి ఈ శబ్దాన్ని ఇక్కడ గిరాటు వేయించింది.

ఈయన ఒక్కొకచోట తన భాషాపాటవంతో పాఠకుణ్ణి 'ఒహో' అనిపిస్తాడు. శబ్దానికీ శబ్దానికీ మధ్యకాదు, అక్షరానికీ అక్షరానికీ మధ్య ఈయన చేసే చమత్కారాలు వర్ణనాతీతాలు. రాజుమాటలకు విశ్వామిత్రుడు సంతోషం పట్టలేక ఇలా అంటున్నాడు. "మఘవజ్జగదవన కళాఽజఘన్యతకు, నీ యుదాత్త సంపదకు దగున్." దశరథుని గొప్పతనమేమిటి అంటే మఘవజ్జగదవన కళాఽజఘన్యత అట! జగత్తును రక్షించుట అనే కళలోని అనీచత అని దీనిఅర్థం. అజఘన్యత ఇదీ అక్షుద్రప్రయోగం వంటిదే. కాని ఈ మహాకవి ఇక్కడ ఒక ట్రిక్కు కూడా చేశాడు. కళాజఘన్యత అని చెప్పివేస్తే దాంట్లో ఉన్న అకారం కనిపించకపోవచ్చు. అప్పుడు నీచత్వమే రావచ్చు. గొంతులోని కోర్కె గొంతులోనే ఉండి చాలా అనర్థం కలుగుతుంది. అందువల్ల కళాఽజఘన్యత మధ్య ఒగుర్తు వేసి చేత్తో మరీ నొక్కి చూపించారు. దశరథుని జగదవనకళా జఘన్యత ఎలా ఉన్నా వీరి కవన కళా జఘన్యత మాత్రం స్పష్టపడింది. మొత్తంమీద రామాయణం లాంటి మహాకావ్యం వ్రాసే కవి ఇలా పిల్లకవులు చేసే చిలిపిపనులు

చేయగూడదు. అసలు అక్షుద్రుడు అజఘన్యతలాంటి పదాలు వాడి దశరథుణ్ణి ఈ కవి ఎందుకు హింసించుతున్నాడో. హృదయం విప్పి ఆయన్ను పొగడటానికి ఇష్టంలేదు సరిగదా ఆయన్ను ముఖాముఖ సరైన అర్థంలో హీనపర్చడానికి సాహసంకూడా లేక ఇలాంటి శబ్ద చమత్కారాలతోనూ, శ్లేషలతోనూ గొంతు పిసుకుతున్నాడు.

ఈ కావ్యములో అన్వయమునకు సంబంధించిన దోషములు కూడా పెక్కులున్నవి. "ఎవ్వరి కాలిగోటికి సహింపరు సామ్యము రాణుసాంగనల్" అనేచోట ఈడురారు అనేదానికి సహింపరు అని "కోపము రాదు నవ్వునోన గూడదు" నవ్వను ఒలకబోయుటో విరియ బూయించుటకో బదులు ఒనగూడుట లాంటివి వాడి నుడికారాన్ని హింసించడం. "ఇడి పొత్తుకల భార్య నడికట్టుతో వచ్చి" అనేచోట 'ఇడికొని' అని ఆత్మనేపదిని వేయలేక పోవడం. "చంకను నిటికి యింద్రతనయుడు" అనేచోట 'ఇటికి' లో సకర్మకము వాడి అన్వయాన్ని సుస్పష్టం చేయలేకపోవడం, "వెడలుచుండు నాకు వేయియు రెండు కన్నీటి బొట్లు నిముసనిముసమునకు "అని సామాన్యకథనంతో సరిపోయేచోట 'వేయి రెండు కన్నీటిబొట్లు'తో అనవసరంగా విశేషకథనం చేయడం, "సడలెను జిఱుతిండి బలిసె జనపతిసతులన్" అన్నచోట నిర్దిష్టమైన కారకాన్ని ప్రయోగించ లేకపోవడం, "యాజ్ఞికుండవు నిదాశోకంబు" అని అర్థంలేని ద్రుతాంతాలు చేయడం" మొదలైనవి ఎన్నో ఉన్నాయి.

ఈరకములైన దోషాలను నేను ఎక్కువ చూపించదలచుకోలేదు. కారణ మేమంటే లోగడ భారతిలో ప్రతివాదిభయంకర వేదాంతాచార్యులుగారి ద్వారానూ ప్రతి విమర్శచేసిన పావకిద్వారానూ వీటిమీద చాలా చర్చజరిగింది. ఆ అంశములనే తిరిగి నేను చేపట్టిన చర్విత చర్వణమే కాగలదు. ఆచర్చలమీద నాకుతోచిన కొన్ని అభిప్రాయములను మాత్రమే వివరించి ఈ వ్యాసమును ముగింతును. ఇది గతార్థమైననూ కొంచెము చెప్పకతప్పదు. దీనివలన నాపని యించుక సుకరమగుటయేగాక పాఠకునకు వాస్తవికదృష్టి ఏర్పడుట కొంకింత వీలుకలుగును. వేదాంతాచార్యులవారి విమర్శనము సహృదయ పండితుని విమర్శనమువలె చాల సరసముగనున్నది. ఒక అస్వాభావికమైన కావ్యములోని కవిశోభను వ్యక్తీకరించిన ఆవ్యాసము చాల అమూల్యమని చెప్పక తప్పదు. ఒకపండిత పాఠకునివలె సరసవిమర్శకునివలె యాథార్థ్యము గ్రహింపవలెనను నాసయేగాని ఆయన దోషారోపణలలో ద్వేషవైషమ్యములులేవు. విశ్వనాథ

కావ్యములోని కావ్యాత్మ గ్రహింపవలయునని చాల ప్రయత్నించియు తుదకు అది లేమి విసిగివేసారి ఈపంక్తులు వెలువరించినారు.

"అన్నియూ నిర్జీవములే. తుదకు గథాకథనముగూడ నెంతమాత్రముం దృప్తికరముగాలేదు. ఇందులో పురాణ ధురీణతయులేదు. ప్రబంధ నిబంధనము లేదు....విశ్వాసహీనమైన ప్రాచీనానుసరణ నిర్బంధమే పొడసూపునుగాని నాగరికతావిశిష్ట నవ్యమార్గ విహరణము గానరాదు......ముత్యములవంటిపదములెన్నో భాషలో నిండారియున్నవి. ఈ రచయిత కవేవియుఁ బొడగట్టవు. మృదుశబ్దములకేగాక కఠినశబ్దములకును భాషలో నవకాశముగలదని యొప్పుకొనవచ్చును. రసౌచితినిఁబట్టి యాయాపదములు తగుచోట్ల ప్రయోగింపబడెనేని యాక్షేపణయుండదు. తెనుఁగుఁ బద్యమునకు వలసిన విసురు, నాదము నీ పద్యములందుఁ గానరాదు. మాధుర్యము మచ్చుకైనను లేదు. కవిత్వమునకవసరమైన యుద్రేక మసలే లేదు."

ఇలా వారు విశ్వనాథకవికున్న అవలక్షణము లన్నియు ముక్తకంఠముగా చాటినారు. ఈ మాటలనుబట్టి ఈయన ఎంత సహృదయుడో వ్యక్తమవుతున్నది. ఈ స్థితి ముప్పది పద్యములవరకేకాదు. కావ్యమంతయు నిట్లే యుండునని ఏపాఠకుడైనను గ్రహించవచ్చును. కాని దీనిమీద 'పావకి' చేసిన ప్రతివిమర్శ చాల అసంగతముగానున్నది. కొన్ని సమాసములకు విగ్రహములు చూపుట, ఆయనకు విగ్రహజ్ఞానము లేదనుట, వ్యాకరణములనుండి కొన్ని సూత్రములు ఏకరువుపెట్టి ఆయనకు వ్యాకరణజ్ఞానములేదనుట, ఏవో కొన్ని ప్రాచీనప్రయోగము లెత్తిచూపి ఆ ప్రయోగపరిచయము లేదనుట మొదలైన అధిక్షేపణలతోనే పావకి తృప్తిపడినాడు. కావ్యచర్చ శాస్త్రచర్చవంటిది కాదని ముందు పావకి గుర్తించుకొనునుగాక. అదేమిఖర్మమోగాని విశ్వనాథకునూ వారి అనుయాయులకునూ ఏతద్విశ్వమంతయూ విగ్రహమయము, వ్యాకరణమయముగనే భాసించుచున్నది. కావ్యమన కొన్నిశబ్దముల మొత్తమనియు, కొన్ని వాక్యములగుంపు అనియు, అవి పదవిచ్ఛేదములచేత విడదీసి కలుపుటకు వీలుగా నుండవలయుననియూ, తెలియనిచోటుల శబ్దరత్నాకరాదులు చూచి సరిపెట్టుకొనవలయుననియు, ఇదితప్ప కావ్యమన వేరలేదనియూ వీరిభావన. వీరు పదములకు స్వారస్యములు లాగుదురు. శబ్దార్థములను విరిచిచూపి చూపరులకు మిరుమిట్లు గొల్పుదురు. ఉక్తిలో మలుపులు, భావములలో కుదుపులు ఏవేవో ఉన్నవని నిరూపింపజూతురు. కాని ఇవన్నియు కావ్యములో ఆత్మ

అనునదిఉన్నతరువాత అతిరిక్తముగా చూపదగినఅందములు. ఒకప్రక్క కవి యొక్క ముఖ్యార్థము నిర్జీవమై పడియున్నది. ఆశయ వివక్షలేదు. రసములో ఔచితిలేదు. కథలో లక్ష్యములేదు. కావ్యమున కుండవలసిన ఊపిరులను వెడలజేసి బాహ్యలావణ్యములను కూర్చిన ప్రయోజన మేమిటి? ఒకానొక ఝుంఝా వాతమువంటి భావా వేశము కవిని త్రోసుకపోవుచుండ చేలాంచలములవలె ఈ ఒయ్యారములు వాటంతట అవియే వచ్చుచూ పోవుచుండవలెను. కాని విశ్వనాథలో ఆ మహావేగము లేని కారణమున ఈయన కవిత్వ పుటడుగులు ఎక్కడికక్కడే చిల్లతుప్పల చిక్కుకు పోవుచుండును. ఈ విషయమును వ్యక్తీకరించిన ఆచార్యులకు సూటియైన సమాధానము చెప్పజాలక తమకున్న శుష్క పాండిత్యమును ప్రదర్శించి అసలు విషయమును జారవిడిచినారు. ఆచార్యులవారికి 'ప్రసాదగుణము' అని వాడుట కూడ తెలియదట! ప్రసాదగుణము అనిగాని, ప్రసన్నతా గుణము అనిగాని వాడవలయునట. ఆయన ప్రసన్నగుణము అని వాడి తప్పు చేసినాడట. ఇలాంటి తప్పుడు ప్రయోగమునకు కారణము ఆయనకు ధర్మి ధర్మ సంబంధజ్ఞానము కూడ లేకపోవుటయేనట. ఈ విషయములో ధర్మి ధర్మ సంబంధజ్ఞానము ఆచార్యులవారికి లేదో లేక పావకికి లేదో కొంచెము ఆలోచించవలసి యున్నది. ప్రసన్నము ధర్మి అనియు ప్రసన్నత ధర్మమనియు పావకి అభిప్రాయము. కాని ఇది తప్పు. నిజమునకు ప్రసన్నము, ప్రసన్నత రెండునూ ధర్మములే. ఇక్కడ ధర్మి వేరొకటి. ప్రసన్నత ధర్మము. ప్రసన్నతా ధర్మమునకు ధర్మి ప్రసన్నతాకము. ప్రసన్నతాకము తిరిగి ప్రసన్నము కాదు. అది ప్రసన్నత కలిగిన ఒక వస్తువై యుండును. ఆ వస్తువు కావ్యము అని అనుకొందము. అనగా కావ్యము ధర్మి యగును. కావ్యముయొక్క సామాన్య ధర్మము కావ్యత్వమై యుండగా విశేష ధర్మము ప్రసన్నత్వమై యుండును. కావ్యత్వము కలిగిన వస్తువే ధర్మి యగును గాని ప్రసన్నత్వము కలిగిన వస్తువు ధర్మికాదు. ధర్మికి అనగా కావ్యమునకు విశేషణ పదమే ప్రసన్న మనునది. ప్రసన్నము అనగానే వివక్ష పూర్తిగాదు. ఎందువలన ననగా అది కేవలము గుణమును సూచించు శబ్దము మాత్రమే. అందువలననే ప్రసన్నము అనుటతోడనే వివక్షా పూర్తి కొరకు ప్రసన్నమగు అనికూడా చెప్పుకొనుచున్నాము. 'అగు' అనునది ధర్మి అయినడ. అది కావ్యము కాబట్టి ప్రసన్నమే ధర్మి కాలేదు. ప్రసన్నము విశేషణ పదము, ప్రసన్నత భావవాచకము. ఇట్లు యీ రెంటికీ ఉన్న తేడా

వాచక సంబంధమైనదే కాని తత్వసంబంధమైనది కాదు. ఈ సూక్ష్మవిషయమును పావకి గుర్తించుగాక. ఆచార్యులు వాడిన ప్రసన్న గుణము అను పదమునందు దోషమేమున్నది? లక్షణ గ్రంథములలోని విశిష్టమైన ప్రసాదగుణము యథా లక్షణముగా విశ్వనాథలో ఎలాగూ లభించదు కాబట్టి కనీసము ఈ కావ్యములో ప్రసన్నమైన గుణమైననూ లేదని చెప్పినారు. పదవిచ్ఛేదపారీణులు ఇలా ఎందుకు చెప్పుకోరు?

'ఆ నవ్వు చిళ్ళచిళ్ళ లయినది'. అనుకరణ శబ్ద ప్రయోగములు రూఢిరై యున్నవని ఆచార్యులు ఆక్షేపించినారు. దీనికి పావకి ధ్వన్యనుకరణము కాదని, ఆచార్యులవారు పొరపాటు పడినారని ఇది శకలార్థములో వాడ బడినదని టలాయించినారు. దీనిని తెలుసుకొనుటకు కొంచెము భాషాజ్ఞాన మవసరమై యున్నది. చిళ్ళ అని వేరుగా ఉండక చిళ్ళపెంకు అని కలసి ఉంటుందని అలా సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఉందని పావకియే చెప్పెను. చిళ్ళ అనునది వేరుగా లేదు. పెంకుతో కలిసి ఉన్నది. ఇది ఆచార్యులవారి వాదమునే బలపరచుచున్నది. ఏలనన ధ్వన్యనుకరణములకు స్వతంత్ర వ్యక్తిత్వ ముండదు. చిళ్ళ అను శబ్దము ఎట్లేర్పడినది విచారింతము. కొన్ని శబ్దములు ధ్వనినిబట్టి కూడ ఏర్పడుచుండును. 'కా కా' అను దానిని బట్టి 'కాకి' పుట్ట వచ్చును. అలాగే కుండ పగిలినప్పుడు ఛెళ్లు మనును. అదే చిళ్ళగా అయినది. ఇది ధ్వన్యనుకరణము. ఈ ధ్వన్యనుకరణమునే మన మప్పుడప్పుడు విశేషణ ముగా వాడుచుందుము. పిట్ట తుర్రున పోయింది. ఇది ధ్వన్యనుకరణము. దీనిని తుర్రుపిట్ట అనినయెడల విశేషణ మగును. తుర్రుపిట్ట, కిర్రుచెప్పు, చిళ్ళ పెంకు ఇవి. పిట్ట తుర్రు తుర్రు లయ్యేను అంటే ఏమన్నా అర్థ ముందా? లేదు. అలాగే నవ్వు చిళ్ళ చిళ్ళలైందన్నా ఏమీ అర్థము రాదు. ఇలా ప్రయోగించితే చేతకాని ధ్వన్యనుకరణము అనగా సంప్రదాయ విరుద్ధమైన ధ్వన్యనుకరణము అనవలసివస్తుంది. ఇది ప్రసిద్ధి త్యాగమనే దోషము. అలా కాక శకలశకలమైందని ఆయన చెప్పుకున్న అర్థాన్నే చెప్పుకుంటే నేయార్థమనే దోష ముంటుంది. ఎందువల్లనంటే ఇచ్చటి లాక్షణిక ప్రయోగము రూఢి, ప్రయోజన ముల ఏ ఒక్కొటి మీదా ఆధారపడి యుండలేదు. ఇలాగే విశ్వామిత్రుని నవ్వు ముసురుతుంది. ఆచార్యులవారికి ఈగలు ముసిరినట్లు అనిపించితే పావకిగారికి చీకట్లుముసిరినట్లనిపించినాయి. ఇది మొదటిదానికంటె ఘోరము. విశ్వామిత్రుని నవ్వు చీకట్లు ముసిరినట్లు ముసరడమేమిటి? పాపము శమించుగాక! ఆయన

ఆమాట అన్నాడు గాబట్టి దానికి ప్రతిగా ఈయన ఈమాట అన్నాడేగాని మళ్ళీ యీ అర్థాన్ని కలిపి చూచుకోలేదు. కలిపిచూస్తే మళ్ళీ వీరిని ఆనేయార్థమే వెంటాడుతుంది. నవ్వు ముసరడం ఎలాఉంది? నీ ముఖం చంద్రుణ్ణి తన్నింది అన్నట్లు లేమా ?

"తనూ రోమాంధువు లానంద శ్రీ మత్పులకాంబుభంగ ధృతి ముని పొంగెన్" ఇక్కడ ఆచార్యులవారు ఎత్తిచూపిన సమాస వ్యత్యయాన్ని తట్టుకోలేక ప్రౌఢ వ్యాకరణంనుండి ఒక సూత్రాన్ని తెచ్చి ఇది ప్రథమకాదు సప్తమి అని పాఠకులకు దిగ్భ్రాంతి గొల్పారు. అంతవరకే. ఈ గదమాయింపు అయినతరువాత మళ్ళీ ఆ అన్వయం వీరుచెప్పిన సప్తమితో ఎలా పొసగుతుందో చూపలేదు. వీరు చెప్పిన సప్తమీ అర్థాన్ని వేసి ఈసారి చూద్దాం. తనూరోమాంధువులంటె వీరి సప్తమిప్రకారం తనూరోమాంధువులందు ఆనంద శ్రీమత్ పులకాంబు భంగధృతిచేత ముని పొంగుతున్నాడట. ఇక్కడ రోమాంధువులు అధికరణము, అంటే ముని రోమకూపాల్లోనే కూర్చుని పొంగుతున్నాడు అని చెప్పవలసి వస్తుంది. ఇది చాలా విపరీతమైన అర్థం. రోమాంధువులందు ఆనందశ్రీ కాకుండా రోమాంధువులందలి ఆనందశ్రీ అని సప్తమిమీద షష్ఠి చేయవలయునని కవిగారి అభిప్రాయము కాని ఈ ప్రయోగంవల్ల అది సిద్ధించదు. అలా అర్థం చెప్పుకోవాలంటె మళ్ళీ ఆచార్యులవారి ఆక్షేపణే ఎదురౌతుంది.

రాముడు నన్నునుగన్న తండ్రి. ఇక్కడ 'ను' గణముకొరకే ఏర్పడినదని ఆచార్యులు అన్నారు. అది నిజము. దీనికి పావకిగారు ఇచ్చిన సమాధానం ఇది. "నాకు స్నానమగు, జపమగు, ధావనమగు, ఎల్ల నా బ్రతుకునగు", వెనుక ఇన్ని ఉన్నాయి 'నన్నును' గన్నతండ్రి ఇచ్చట సముచ్చయం ఉండితీరాలి. నిజమే సముచ్చయముండితీరాలి. అది నన్నునువద్ద ఉండితీరాలో కన్నతండ్రివద్ద ఉండితీరాలో కొంచెం యోచనచేయాలి మరి. ఈ పద్యంలో కవియొక్క విధేయాంశం 'నా' అనే సర్వనామము కాదు. స్నానము భోజనము, కన్నతండ్రి మొదలైనవి. పైవన్నియూ ఎవరినో అయితే ఇక్కడ నన్ను అని చెప్పవలసి వచ్చేది. కాని దశరథునకు రాముడు ఏమి అవుతున్నాడు అనే దానికి పై పద్యంలో సమాధానం రావలసి ఉంది. అందువల్ల రాముడు స్నానమయ్యాడు భోజనం అయ్యాడు, తరువాత ఏమి అయ్యాడు? కన్నతండ్రియును అయ్యాడు. ఇలా నన్ను వద్దకాకుండా కన్నతండ్రివద్ద ఈ 'యును' వేయాలని పావకి గుర్తించవలెను. ఊరికే ఖూంకరించితే లాభంలేదు. అసలు ఈయనకు సముచ్చయాల

మీద ఇంత జాగ్రత్త ఉంటే అత్యవసరములైన కొన్నిచోట్ల వాటిని అతి ఘోరంగా వదలిపెట్టారే!

"తండ్రి తల్లికిచ్చుఁ దల్లి దాసికోసంగు
సంభ్రమించి రిట్లు శాంతయు ముని ౬౯ పేజి.

ఇక్కడ మునిశబ్దం తోకతెగిన మొండెంలాగా ఉంది. ఒక్క సముచ్చయం వేయగూడదూ! గణం చాల్లేదు. ఇంతకీ ఈ కవికి గణప్రస్తారం ఒక్కొక్కప్పుడు నవారు కొలతలా అలా సాగి మరొకప్పుడు నత్తగుల్లలా ఇలా ఇలా ముడుచుక పోతుందేం?

దైత్యజంతువులు రూపకంకాదు ఉపమితసమాసం అని ఇంకో టలా యింపు. దైత్యులే జంతువులు అని మాత్రం ఎందుకు చెప్పగూడదు. అసలు దైత్యులు హీనులో జంతువులు హీనులో ఆ రెంటికి సామ్యం చెప్పడమేమిటో ఇదంతా ఒకగందరగోళంగాఉంటే దానిమీద రూపకమూఉపమానమూఅని ఇంకో పేచీ దెచ్చి అదంతా మొత్తం గలిపితే పాఠకుడికి ఏమీ తోచక దిక్కులు చూచేంత వికారస్వరూపాలు ఈయన రూపకల్పనలు.

ఇలాగే సుబాహు మారీచ ద్వంద్వాన్ని సాధించడానికి ఇంకొక యుద్ధం. సుబాహుమారీచులన్న ప్రయోగం రఘువంశం, సంగ్రహ రామాయణములందే ఉన్నదట. ఉండవచ్చు. అసలు సుబాహుడు ముందా? మారీచుడు ముందా? ఇది చిన్నపిల్లవాడికైనా తెలుస్తుంది. దానికి సంస్కృతంనుంచి ప్రయోగాలు తెచ్చి చూపాలా! ఇప్పుడు మీరు దేంట్లో రాస్తున్నారు? తెలుగులో వ్రాస్తున్నారు. మీరు ఎత్తిచూపిన ప్రయోగం దేంట్లోది? సంస్కృతంలోది? ఎన్ని సంవత్సరాల నాటిది. దాదాపు వెయ్యిసంవత్సరాలనాటిది. ఒక వెయ్యి సంవత్సరాలనాడు ఒకభాషలో (సంస్కృతంలో) ఒక మైత్రితో ఉన్న శబ్దాలు వెయ్యి సంవత్సరాల వెనుక వేరొకభాషలో (తెలుగులో) అదేమైత్రిలో ఉంటాయా? వ్రాసేది తెలుగు రామాయణం, 20 వ శతాబ్దిలో. ప్రయోగాలు ఎత్తిచూపించేది సంస్కృతంలో కొన్నివందల సంవత్సరాలనాటివి. ఎంత అమాయికం? సరససాహిత్యస్రష్టకు సుబాహుమారీచుడు అని వాడాలో మారీచసుబాహువులు అని వాడాలో హృదయానికి తగులుతూనే ఉంటుంది. ఈవిషయాలన్ని చర్చించేవిగావు. రసజ్ఞ పాఠకులు స్వయం నిర్ణయించుకునేవి.

ఇట్లే వీరు ప్రతిసమాసమునకు విగ్రహము చూపి ఇది మంచి సమాసమే అని తృప్తిపొందుటకూడ వ్యర్థవిషయము. విగ్రహము చెప్పుటతోడనే ఒకవికృత

సమాసమునకు ఔచిత్యము సిద్ధించదు. విగ్రము ఏమిటి? అదొక తంతు. తిరిగి సంస్కృతములో విడదీసి చెప్పుట. "నవబాహుపటుదీర్ఘదండుడు" లాంటి సమాసములోని వ్యుత్క్రమము ఏకొంచెం సమాసం తెలిసినవానికైనా కటువుగానే ఉంటుంది. మహాకవుల సమాసయోజన తలకొక తీరుగా ఉండవచ్చును. కాని కట్టుబాటులు తొలగించకయే వారు తమ సమాసములలో తమవ్యక్తిత్వములను నిరూపించుకొందురు. ఈకవి కట్టుబాటును తొలగించివేయుటవలన సమాసము విన నలవాటుపడిన చెవికి అది ముల్లుగా గ్రుచ్చుకొనును. సమాసములోని మంచిచెడులను చెవియే చెప్పగలదు. విగ్రహముచేసి చూపిన మాత్రాన సమాధానము కుదురదు. ఆచార్యులవారు చేసిన ప్రతిఆక్షేపణకు వీరుచెప్పినసమాధానము గురికి మూరెడు అటునిటుగా జారిపోయినది. ఇంతకంటే ఈవిషయాన్ని ఇక పొడిగించి చెప్పనవసరములేదు. ఒక్క వేదాంతాచార్యులువారే కాదు, ఎవరైనా విశ్వనాథవారి పద్యాలకు అర్థాలు చెప్పలేరు. ఇది పాఠకుల తప్పుగాదు. వారి పద్యమే అలాంటిది. పద్యం ఎక్కడికక్కడకు విరిగిపోతుంది. సమాసంగానీ, శబ్దంగానీ, భావంగానీ ఏదీ చేతికిరాదు. అసలు మంచి పద్యం అనేది పాఠకుణ్ణి దానంత అదే లాక్కుపోవాలి. ఆశక్తి ఈయనఏవొక్క పద్యంలోనూలేదు. కొందరి ఆధునికుల పద్యాలు మేలిమిముద్దలులా ముచ్చట గొలుపుతూ ఉంటాయి. ఈయనపద్యాల్లో ఆమేలిమిఅనేదేలేదు. ఒకవేళ అదిఒకపాలు ఉన్నా వెంటనే దాంతోపాటు సీసం, ఇనుమూ, తుత్తినాగమూ, రాగీ ఎక్కువపాళ్ళల్లోఉండి అది ఏధాతువో తెలియకుండా పోతుంది. అది ఒక మహాధాతువని కొందరంటారేమో. అననివ్వండి. కొన్ని అనలక్షణాలు ఒక తూనిక ప్రకారం కలిస్తేకూడా ఒక వ్యక్తిత్వమవుతుందేమో, ఇప్పుడు అనుమానం కలుగుతుంది. ఆయనేదో ఒకటిఅయ్యాడు. కాని ఆయన్ను అనుసరించేవాళ్ళు మాత్రం చిక్కులో పడతారు. ఎందువలన? మరి ఇన్ని అవలక్షణాలను అనుసరించాలన్నా కష్టమేగదా. వీరిపద్యాలు చాలమంది చదువుతున్నారుగదా! అనవచ్చు. ఎవరు చదువుతున్నారు? పాఠకులు చదవడంలేదు. ఆయన్ను స్తుతించేవారో విమర్శించేవారో చదువుతున్నారు. నేనూ ఈవ్యాసాలతో విమర్శించాను. కాని నేను విమర్శక విమర్శకుణ్ణి కాదు. పాఠకవిమర్శకుణ్ణి. పాఠకవిమర్శకుడంటే పాఠకుడు చదివినదానిమీదనుంచి విమర్శించుతాడు. విమర్శకవిమర్శకుడంటే; విమర్శించడంకోసం విమర్శించుతాడు. అంటే వృత్తివిమర్శకుడన్నమాట. ఈయనలో వ్రాసేకంటే వినిపించేశక్తి ఎక్కువఉంది. వినిపించే

కంటే ఒప్పించేశక్తివుంది. కొన్నిపదుల పుస్తకాలు వ్రాసినప్పుడు కొన్నివందల పాఠకులైనా ఉంటారు. ఏపుస్తకం చదువరు? డిటెక్టివ్ నవలా చదువుతున్నారు, కాళిదాసు మేఘసందేశమూ చదువుతున్నారు. దేశింగురాజుకథలూ చదువుతున్నారు. ఒక కొంతమంది ఒకకవికి ఎప్పుడూ చదివేవాళ్ళు ఉంటారు. కాని సుపరిష్కృతులైన పాఠకులు ఎలాంటికవిని ఎన్నుకుంటారో, వారికి ఏకవి కావాలో, ఏకవి యుగాన్ని నడిపించగలుగుతాడో, ఏకవి జాగరూకుడో, ఏకవి రసజ్ఞ ఈహృదయాల్లో హత్తుకుంటాడో, ఏకవి పిలుపులో జాతివిద్యుద్ఘాతం పొందినట్లు త్రుళ్ళిపడుతుందో, ఆకవి, ఆమహోన్నతకవిని జాతిఊరికే గుర్తించుకుంటుది. ఈస్తుతి సాహిత్యంలో పారు ఎంతపోతుందో మన యీ ఏదో వ్రాసేవాళ్ళకంటే ప్రజలకే ఎక్కువతెలుస్తుంది. విశ్వనాథవారు వారికున్న భక్తిచొప్పునా శక్తిచొప్పునా ఏది వ్రాసుకుంటే ఎవరుకాదంటారు? కాని యుగాన్నిమాత్రం కవ్వించవద్దని నామనవి.

---

## అభిప్రాయ వేదిక

ప్రతివిమర్శకులు అసలువిషయంమీదకు రావడంలేదు. నా 'పేరు' ను మాత్రం తారుమారు చేస్తున్నారు. దురదృష్టం. "ఆ విమర్శ అట్లుంచి కొన్ని సామాన్య విషయములు" అనీ "ఈ విమర్శకు సమాధానం వ్రాయుట నా ఉద్దేశ్యం కాదనీ", "విమర్శ ఎట్లున్నప్పటికీ దక్షిణభారత సభ" అనీ సభనూ, పత్రికనూ, బెదిరించుతూ అయినవారినీ కానివారినీ కూడ నిగ్గదీస్తున్నారు. ఇది మరీ దురదృష్టం. హిందూ మతాన్నికూడా కాపులకు తెచ్చుకుంటున్నారు. ఇది ఇంకా ఇంకా దురదృష్టం. ప్రతివిమర్శకుల వాదపద్ధతి మనకు తెలిసిందే, కొత్తగాదు. ముందు శబ్దాలూ, అర్థాలూ తెలియవు అనడంతో ప్రారంభించి, వ్రాయుటకు గల అనధికారాన్ని నిరూపించి, ముందు అది తెలుసుకున్న తరువాత దీనికి దిగాలి అని సాధికారంగా శాసించడం. ఈ 'తెలియదు' అన్న మాటను ప్రతిచోటా ప్రతి మనిషికీ ఉపయోగించితే ఆ అనడం అర్థం లేకుండా పోయి చివరకు అలా అనడమే ఒక పిచ్చిగానో, జబ్బుగానో తయారవుతుంది.

రామాయణ కల్పవృక్షం విమర్శమీద ప్రతివిమర్శ చేసినవారు ఇద్దరో, ముగ్గురో ఉన్నారు. వీరికి అంత పెద్ద వ్యాసంలోనూ రెండే రెండు విషయాలు దొరికినాయి. ఇంకా విచిత్ర మేమంటే అందరికీ దొరికినవి ఆ రెండు విషయాలే. ఇది అద్వైతం కాదు రూపకాలంకారం అని ఇద్దరు ఒకే పెట్టున గడబా యించారు. బాగుంది. అద్వైతం అయితే రూపకాలంకారం కాగూడదని ఎక్కడుంది? ఇతడు పోలీసు, మనిషి కాదన్నాడట ఒకాయన. పోలీసు పోలీసూ అవుతాడు, మనిషీ అవుతాడు అన్నాడట రెండో ఆయన. ఈ సంబంధాలు కొంచెం అర్థం చేసుకొని మాట్లాడాలి మరి. ఒత్తి బూకరింపు పనికిరాదు. అక్కడ ఉంది రూపకాలంకారమైతే అది దేనికి తొడిగారో అది అద్వైతమే అవుతుంది. అద్వైతపరంగా మాత్రం అలంకారాన్ని వేసుకోగూడదూ? దీంట్లో ఉన్న అలంకారం రూపకమైతే అలంకార్యం అద్వైతం. వీటిని ఆలోచించేటప్పుడు కాసింత అలంకార అలంకార్య జ్ఞానముండాలి. వేదాంతం దీంట్లో లేదని మీరు చెప్పనక్కర్లేదు. అది నేనే చెప్పివేశాను. కాగా పోగా 'జీవి' 'మాయ' లాంటి అనవసరమైన బులాకీలు అక్కడ తగిలించవద్దంటున్నాను. ఇంకొకటి అసలిక్కడ రూపకాలంకారం కూడా లేదు. లేనిపోని ఇంకో తప్పును మీద వేసుకున్నారు ఈ ప్రతివిమర్శకులు. ప్రియసుతుడన్న జాబిల్లి, కొడుకన్న చిన్నారిపడవ అన్న పై నాలుగు సీసపాదాల్లో రూపకం ఉంటే ఉందేమో కాని ఆ ఆట వెలదిలో మాత్రం లేదు. కవిత్వం వ్రాసేవాళ్ళకు తెలుస్తుంది. ఒక భావం సీసపాదాల్లో ఒక తీరుగా నడిచి క్రింద ఉన్న గీతం, ఆట వెలదుల్లో ఇంకో నడక నడుస్తుంది. పైన లక్ష్యాలు ఉంటే క్రిందలక్షణం ఉండటమో, పైన విశేషంఉంటే క్రింద సామాన్యం ఉండటమో ఏదో ఒకటి. ఈ కవికూడా పైపద్యంలో అలా చేశారు. పైనరూపకాలు చెప్పుకుంటూవచ్చి క్రింద 'తనయుడన్న సూక్ష్మతత్వం బెఱుంగని జీవిమాయలోన జిక్కుకొన్న యనదపుర్వు' అని ఒకసిద్ధాంతం చెప్పారు. ఇది సిద్ధాంతవాక్యం పైవిఅలంకారవాక్యాలు. సొగసున్నఊహే అలంకారమౌతుంది. అన్నిఊహాలూ అన్నివాక్యాలూ అలంకారాలుకావు. పంచభూతాత్మకమైనది ఈజగత్తు అంటే సిద్ధాంతమవుతుందికాని అలంకారంకాదు. ప్రతివిమర్శకులు గ్రహించాలి.

నేను ఎక్కడో ఉపమఉందనీ రూపకముందనీ అన్నానట. నేను ఎక్కడా అనలేదు. ఫలానాపద్యంలో ఉపమ ఉందనిగానీ రూపకముందనిగానీ లేదు. 'పోలిక' అనే పదంవాడాను. అది ఉపమ అనుకున్నారేమో పాపం. ఉపమా సామగ్రిని సంస్కరించుకోవాలి అన్నాను. దాన్నికూడా ఉపమాలంకారం

అనుకుంటే ఇక మనం చేసేదేముంది? "ఒనరబోర్కాడించియుయ్యెల తొట్టెలో బండపెట్టిన పసిపాపవోలె" అనేపద్యంలో సాధారణీకరణలోపం చూపించాను. ఆ సాధారణీకరణలోపం చూపించడానికి ఆ సీసపద్యంలోని ఆ నాలుగుపాదాలే చాలు నాకు. ఆ పద్యం ఏస్థానంలో ఉందో చెప్పడం అక్కడ నా లక్ష్యంకాదు. ఏపద్యమూ ఏ స్థానములోనూ లేదని కథాసంవిధానంలో చూపించానుగదా. ఏవస్తువును ఏదీపంక్రింద వెదకాలో నాకు బాగాతెలుసు. ఎక్కడ ఏది పారవేసుకున్నారో తెలియనివాళ్ళ వస్తువునుకూడ ఒక దీపంవద్దకుతెచ్చి సరిచూడడము కూడా నాకుతెలుసు. మీరు కళ్యాణఖండం చదవమని సలహాచెప్పారు. అదినేను చదివితే అక్కడ మీరు చెప్పినగుణాలు లేకపోగా ఇంకాకొన్ని కొత్తదుర్గుణాలు కూడా బయటపడవచ్చు. అందువల్ల చదవను.

కొంచెం జయంతి సంపాదకీయం చూద్దాం. అందులో ఒక వాక్యం 'వ్యాఖ్యానించినచో మరియు యే యితరకాలమునందు' ఇక్కడ యడాగమం ఉంది. ఈ సంచికలోనే అభిజ్ఞాన శాకుంతలంలో 'వ్రాయదగిన వెన్నియో నున్నవి' ఇక్కడనుగాగమముంది—ఏమిటీ బదులుకోళ్లు? 'ఇంద్రుడడిగినట్లు మొదలైన కథయున్నది' ఏమిటీకథ? ఏమిభాష! ఇక విషయంమీదకు వద్దాం. సంపాదకీయం చాలావిషయాలమీద వలిదిరిగింది. ఈ వలిదిరగడంలో ఏమి చెప్పబోయి ఏమిచెపుతున్నారో సంపాదకీయులకే అర్థంకావడంలేదు. ఏదైనా చెప్పదలచుకుంటే రెండు పద్ధతులుంటాయి. ఒకటి- శాస్త్రీయపద్ధతి. రెండు- కావ్యపద్ధతి. తర్కం ఈ శాస్త్రీయపద్ధతికి కొంతవరకు ఉపయోగిస్తుంది. అంతే గాని తర్కమే అంతాచేసిపెట్టదు. తర్కంతోనే ఉన్నదిలేనట్టు లేనిదిఉన్నట్టు చెప్పలేము. ఉన్నదేదో ఉంటుంది. లేనిదేదో లేదు. మన పూర్వీకులు తార్కికులు ఈశ్వర తత్వాన్ని సులభంగా శాస్త్రీయపద్ధతిలో తెలుసుకోవడానికి ఈ తర్కశాస్త్రాన్ని పెంపొందించారు. తర్కం ఇలాసాధనమాత్రమే అని తెలుసుకోనివారు తర్కంతోనే అన్ని సాధించివేయాలని చూస్తుంటారు. ఇట్టివారు తర్క సంగ్రహంవరకే చదివి ఆపైని తర్క ప్రయోజనమేమిటో తెలియక కేవలం పాండిత్య ప్రదర్శనంకోసం దానిలోని నాలుగుమాటలను వాడి లేక ఆశైలిని వాడి పాఠకులకళ్లు జిగేలుమనిపిస్తారు. ఆ ధోరణి ఈసంపాదకీయంలో నడుస్తుంది.

"గొప్ప కవియని అనుకొనబడుచున్నవాడొకడు కలడు. వాని సిద్ధాంతములు మనకిష్టము కావు. వానిని మనము గొప్పకవి యనుచున్నాము.

ప్రతిభాశాలి యనుచున్నాము. వాని కావ్యమునం దవి లే వివి లేవని వ్రాయుచున్నాము. అనగా మనమనుకొన్నవి లేవనియేకదా! అవి లేకపోయినను వాడు గొప్ప కవియని మనమంగీకరించు చున్నాముకదా—వాడు కవి. నీ సిద్ధాంతములు లేవు. అనగా కవిత్వమునకు సిద్ధాంతమునకు సంబంధము లేదనియేకదా అర్థము."

కుక్క చెప్పు కొరికెను. కుక్క కానిది చెప్పు కొరకదు. కొరకబడుట దేనికి ఉన్నదో అది చెప్పు. కొరకబడుట లేనిది చెప్పు కాదు. చెప్పుగానిది కుక్క కొరకదు. అనగా కుక్క చెప్పును కొరక లేదని డీనియర్థము. ఇదే మాదిరితర్కం. ఈ తర్కాలవల్ల ప్రయోజనం లేదు. గజం మిథ్య పలాయనం మిథ్య లాంటివి. కాకపోతే సిద్ధాంతాలు లేకపోతే కవి అవడమేమిటి? ప్రతిదీ వాదంకోసం ఒక బండగీటు గీసుకొని కొమ్ములున్నవన్నీ ఎడ్లు, కొమ్ములు లేనివన్నీ గుఱ్ఱాలు అన్నట్టు విషయనిర్ణయం చేయగూడదు. పిల్లల కవిత్వంలో సిద్ధాంతాలు లేకపోవచ్చు. ప్రణయ కవిత్వంలోనూ దాదాపు సిద్ధాంతాలు రాకపోవచ్చు. కొంచెం గంభీరంగా వ్రాసే కవిలోమాత్రం సిద్ధాంతాలు ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా సూక్ష్మంగానైనా ఉంటాయి. ప్రతికవి వెనుకా కొన్ని అభిరుచులూ, సిద్ధాంతాలూ ఉండి అతని శైలిమీదా, శబ్దసంకలనం మీదా, అతని కావ్యవస్తువు ఎన్నికమీదా ప్రభావం చూపుతూంటాయి. అసలు వెనుకటి కాలానికి ఇప్పటికాలానికీ చాలా తేడా ఉంది. వెనక సిద్ధాంతకర్తలు వేరు, కవులు వేరు. ఆయా సిద్ధాంతాలూ, శాస్త్రాలు ఆయా వర్గాలవరకే పరిమితమై ఉండేవి. కాని ఇప్పుడు కవి సిద్ధాంతకర్త కూడా అవవలసి వచ్చింది. కవేకాదు ప్రతి సామాన్యుడూ ఇప్పుడు కొన్నివిషయాలు తనకుతానై చర్చించవలసిన అవసరం వచ్చింది. పూర్వం ఒకరు చర్చించియిచ్చిన విషయాలు కవులు కళ్ళు మూసుకొని చెప్పేసేవారు. ఇప్పుడు తనకై తాను కళ్లుతెరిచి చూడవలసి వస్తుంది. చర్చించవలసీ వస్తుంది. ఈ చర్చించవలసి రావడమనే పరిస్థితినే సిద్ధాంత మంటాము. ఈ స్థితి ఎందుకు వచ్చిందంటే ఏ అభిప్రాయమూ ఇప్పుడు వ్యక్తి పరంగా లేదు. అన్నీ సమాజపరమై కూర్చున్నాయి. ఈ సూక్ష్మ భేదాన్ని తెలుసుకుంటేనే ఏది కవిత్వమో తేలుతుంది. కవిత్వమంటే వాగ్వైచిత్రి వ్యంగ్యవైభవము, వక్రోక్తినైపుణ్యమూ వీని నాశ్రయించి ఉండటం అలా ఉంచి ఇవి దేనిని ఆశ్రయించి ఉంటాయో అది ఒకటుంది. అది ఒక వస్తువో,

రూపమో, భావమో అయి ఉంటుంది. ఆ వస్తు రూప భావాలు ఏ దృష్టితో చెప్పబడుతున్నవో అదే సిద్ధాంతం. ఇది కవిలో కనిపించకుండానూ కనపడుతూనూ ఉంటుంది. ప్రతి మహాకవి వెనుకా ఈ దృష్టికోణం ఉంది.

నే వాడిన శబ్దం ఆ అర్థంతో అర్థం కావడములేదని ఇంకో ఆక్షేపణ. ప్రాత సత్యం అన్నానట. నిజమే. ప్రాత క్రొత్త సత్యాలు ఉంటాయి. సత్యం అనాదిసిద్ధమైంది అని మీరు రోకటిపాటగా చదువుకున్నారు. సత్యంటే జీవిత సారాంశం. అందువల్లే జీవితాన్ని ఉపయోగించుకోగా మిగిలిన మిగులును సత్యమని చెప్పాను. కరుగుతున్న జీవితంతోపాటు కరగని కొన్ని శాశ్వత ధారణలు మనకు ఏర్పడుతూ ఉంటాయి. ఇవి కొంతకాలం వరకూ కరగవు. కాని జీవితం విలువల్నే తల్లక్రిందులుచేసే అంత తుపాను వచ్చినప్పుడు ఆ శాశ్వతధారణలు కూడా మారిపోతాయి. అహింస, బ్రహ్మచర్యం, అస్తేయం ఇవి ఒక రకంగా సత్యాలు అంటున్నాము. పరుల సొమ్ము ఏ విధంగా దొంగిలించినా అది దొంగతనమే. కాని అస్తేయం ఆ అర్థంలోనే ఇప్పుడు లేదు. ప్రాచీన-అస్తేయం ప్రకారం దొర అయినవాడు ఇప్పుడు దొంగ అవుతున్నాడు. దీన్ని మారటం గాక మరేమంటారు? అదిగాదు. ఆ అహింసా, అస్తేయం అనే వాటిల్లో ఉన్న సామాన్యగుణం. అది సత్యం. అది ఎప్పుడూ ఉంటుంది అన్నా 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' అనే ముక్తిదశలో అది కూడా లేకుండా పోతుంది. అందువల్ల అన్నీ అర్ధ సత్యాలే. ఇవి తాత్విక విషయాలు. కేవల నిఘంటు గతజ్ఞానులకు ఈ విషయాలు ఎలా తెలుస్తాయి? నిఘంటువులో శబ్దమూ దానికున్న అర్థమే తెలుస్తుంది. శబ్దార్థజ్ఞాన మెంత ఉన్నా విషయజ్ఞానం లేకపోతే ఆ విషయం తెలియదు.

నేను పేరుకోసం ఈ విమర్శ వ్రాస్తున్నానని ఇంకో వెక్కిరింపు. విశ్వనాథవారు రామాయణ కల్పవృక్షం వ్రాస్తే అది జీవుని వేదన ఎందుకవాలి, నేను ఆయనమీద విమర్శ వ్రాస్తే జీవుని వేదన ఎందుకు కాకపోవాలి? అసలు ఆయన జీవుడుకంటే నా జీవుడే మంచివాడేమో. పిరికితనానికీ సాహసానికీ తేడా కొద్దిలోనేఉంటుంది. గెలుపుకూ ఓటమికీకూడ తేడా కొద్దిలోనేఉంటుంది. అలాగే పేరుకోసం చేసే ప్రయత్నంలోనూ పేరుచూడకుండా చేసే ప్రయత్నంలోనూ కూడా తేడా కొద్దిదే. పేరువచ్చినా రాకపోయినా అది ఒక ప్రయత్నం. పేరుకోసం ఉబలాటపడుతున్న ఈ లేత విమర్శకులూ, రచయితలూ తమ ఉబలా

టాన్ని అన్యులమీద ఆరోపించి ఆనందిస్తుంటారు. అసలు ఒకరిమీద విమర్శలు వ్రాస్తే పేరు వస్తుంది అనుకోవడం అవివేకం. వెనుక విమర్శలు వ్రాస్తే పేరువచ్చినమాట నిజమేగాని ఇప్పుడు తెలివైనవారు ఇంకో సులభమైన కొత్తమార్గం కనిపెట్టారు. అది స్తుతిమార్గం. అదేపనిగా ఒకరిని స్తోత్రంచేస్తుంటే కొంతకాలానికి పేరురావచ్చు. హుందాగా ఒకస్థాయిలో స్తుతించడంకూడా కొంతకష్టమైనపనే అనుకోండి. కాని విమర్శించడం పరమకష్టమైన పని.

BY APPOINTMENT TO
HIS EXCELLENCY THE GOVERNOR OF ANDHRA

జి. పుల్లారెడ్డి నేతిమిఠాయి వ్యాపారము ఫోన్: 5506

హెడ్డాఫీసు: కర్నూలు బ్రాంచి: స్టేషన్‌రోడ్, ఆబిద్‌సర్కిల్ - హైద్రాబాదు

విందులు, టీపార్టీలకు

రకరకాల మిఠాయిలు, తినుబండారాలు సప్లయి చేయగలము

→ మీ ఆర్డర్లు పోస్టుద్వారా పంపగలము ←

# వాన వెలిసింది

—శ్రీ పెండ్యాల వరవరరావు

చైత్రరథమ్మెక్కి రవి
జైత్రయాత్ర వెడలినాడు
వ్యాకోచముచెంది గీఱ
లాకసాన వ్రాడిపడియె

మార్తాండ మహితతేజమ్మును
మబ్బు దుబ్బ గప్పుకొనియె.
నల్లరేగడి చరియలట్టు
లల్లుకొనె మేఘమ్ము లెల్లడ
ఆకసము అంబోతు
పోలిక రంకెవేసెను.
విహాయసపు గుహలోపల
విహరించెడి కేసరి విధమ్ము
గర్జించెను పర్జన్యుడు.

అబ్ధి అంతరాంతరాల్లో
మబ్బుముంత ముంచి చేది
సాయంగృహిణి వాకిట
చానిపి చల్లిన చందము
ప్రకృతి పచ్చందనాల
ఆకృతిదాల్చెను యెల్లెడ.

సుడిగాడుపు కెగిరిపోయి
ఉడువీథిని చిక్కినట్టి
ప్రకృతి చేలాంచలమ్ము
పగిది దోచె నింద్రధనువు.

ఆకాశపు టందగత్తె
ఆనందాశ్రువులట్టుల
గగన రమణి సిగవ్రీలిన
తారకాసుమమ్ములట్లు
వానచినుకు లొలికిపోయి
వసుధ క్రొత్తబదుకుదాల్చె.

ఆవిరియై ఎగసినట్టి
ఆశ పునర్జీవమెత్తె
గతము గాలి కెగసి ప్ర
స్తుత పర్వతమును దాకి
భావి హరిత రూపమెత్తె.

బీదవాని హృదయంలో
ఉదయరేఖ మెదిలినట్లు
తూరుపు దిక్కున చక్కని
మెరుపు తళుక్కున దరిసెను.

నింగి శృంగమందు నిలిచి
నెచ్చెలి స్మితవదనయయ్యె
కాంతిరేఖ గీసి నవ
క్రాంతివార్త నందించెను.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
DEPT.
Acc. No.

BCI

AOUA105B 119

BC

V.R. NARLA LIBRARY
V.R. NARLA D.P.R.I. Acc. No.

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B119 |
| పుస్తకం పేరు | రామాయణకల్పవృక్షము ఒకవిమర్శ |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | YES |
| మొత్తం పేజీలు | 69 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | BCI |
| లేని పేజీలు | 1,6,28,54 |
| తయారు చేసినది | Kethana |
| పేజీలు విభజించినది | Kethina |
| స్కాన్ చేసినది | |
| పరీక్ష చేసినది | BUJJI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |